www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 2-12-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 227 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం; తిథి: పాడ్యమి మ. 12.44 తదుపరి విదియ; నక్షత్రం: జ్యేష్ఠ మ. 3.45 తదుపరి మూల; వర్జ్యం: రా.12.04-1.43; దుర్ముహూర్తం: మ.12.26-1.10, మ.2.39-3.23; అమృతఘడియలు: ఉ.6.33-8.08; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.33; సూర్యాస్తమయం: 5.35 | హైదరాబాద్ సిటీ *

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మహిళల్లోనూ పెరుగుతున్న బట్టతల



ఒత్తిళ్లతో కూడిన జీవన శైలితోనే సమస్యలు

పోషకాహార లోపం, జన్యుపరమైన కారణాలూ

దీనిని తొలి దశలో గుర్తిస్తే నివారణ సాధ్యమే

జడ గట్టిగా వేసుకోవడంతోనూ ఇబ్బందే

14 గుంటూరు ఐఏ డీవీఎల్ సదస్సులో వక్తలు



లగచర్ల పారిశ్రామిక పార్కుపై..

సర్కారు దూకుడు!

తాజాగా మరో నోటిఫికేషన్ జారీ

లగచర్ల, హకీంపేట గ్రామాల పరిధిలో 643.34 ఎకరాల సేకరణ

తొలి నోటిఫికేషన్‌లో 182.31 ఎకరాలు

అభ్యంతరాలు 2 నెలల్లో కలెక్టర్ దృష్టికి..

పార్కులో పలు రకాల పరిశ్రమల ఏర్పాటు

25 వేల మందికి ఉపాధి కల్పనే లక్ష్యం

టీజీఐఐసీకి మౌలిక వసతుల బాధ్యతలు

ప్రాజెక్టు విజయవంతానికి సీఎం పట్టుదల

వికారాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వికారాబాద్ జిల్లాలోని కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన బహుళార్థ సాధక పారిశ్రామికవాడ(మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్క్) ఏర్పాటుకు శరవేగంగా అడుగులు పడుతున్నాయి. భూసేకరణకు శనివారం తొలి నోటిఫికేషన్ విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం.. ఆదివారం మరో నోటిఫికేషన్ జారీ చేసింది. లగచర్ల, హకీంపేట గ్రామాల పరిధిలో 643.34 ఎకరాల భూమి సేకరించనున్నట్లుగా ఈ నోటిఫికేషన్‌లో వెల్లడించింది. దీంట్లో లగచర్లలో 497 ఎకరాలు, హకీంపేటలో 146.34 ఎకరాలు ఉన్నాయి. శనివారం విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం.. పోలేపల్లి, లగచర్ల

మిగతా 12వ పేజీలో...

రైతు భరోసా..

సంక్రాంతి తర్వాత

అసెంబ్లీలో చర్చించి విధివిధానాల ఖరారు

మారీచులు చెప్పే అబద్ధాలను నమ్మొద్దు

గత ప్రభుత్వం ఎగ్గొట్టిన 2023 వానాకాలం రైతుబంధు సాయాన్ని మేం చెల్లించాం

7,625 కోట్లను తొలి విడతగా అందించాం

మేం వచ్చేనాటికి రూ.7లక్షల కోట్ల అప్పులు

ఐనా.. రుణమాఫీ పథకాన్ని అమలు చేశాం

నాలుగు విడతల్లో 20,616.89 కోట్ల మాఫీ

బీఆర్ఎస్ చేసింది కేవలం రూ.3,331 కోట్లే

సన్న ధాన్యానికి వచ్చే సీజన్‌లోనూ బోనస్

రైతులు హెచ్ఎంటీ, తెలంగాణ సోనా, బీపీటీ రకం సన్నాలను సాగు చేయాలి

కిషన్‌రెడ్డి.. హామీలపై ప్రత్యేకంగా చర్చిద్దాం

మోదీ చేసిందీ.. మేం చేసిందీ తేలుద్దాం

ఈ ప్రభుత్వం ఇంకా తొమ్మిదేళ్లు ఉంటుంది

ఎన్నో విజయాలు సాధిస్తుంది: సీఎం రేవంత్



మీడియా సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు తుమ్మల, దామోదర, పొంగులేటి

హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర రైతాంగానికి రైతు భరోసా పథకాన్ని అందించి తీరతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎలాంటి సందేహాలు అవసరం లేదన్నారు. సంక్రాంతి తర్వాత రైతుల ఖాతాల్లో భరోసా సొమ్మును జమ చేస్తామని తెలిపారు. ఈ పథకం అమలుకు సంబంధించి విధివిధానాలను ఖరారు చేసేందుకు ఇప్పటికే మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించామని గుర్తు చేశారు. ఉపసంఘం చేసే సూచనలపై ఈ నెలలో

మిగతా 13వ పేజీలో...

అనారోగ్యంతో ఎవరూ అప్పులపాలు కావొద్దు!

అదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

సర్కారీ వైద్యంపై నమ్మకం పెంచాం

ఏడాదిలో ఓపీ, ఐపీ 10 రెట్లు

జనాభా ఆధారంగా సబ్‌సెంటర్లు, పీహెచ్‌సీలు, బస్తీ దవాఖానాలు

ఉద్యోగులు కోరినట్లు ఈహెచ్ఎస్

వైద్య కళాశాలల్లో 600 అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీకి త్వరలో నోటిఫికేషన్

'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో మంత్రి దామోదర రాజనర్సింహ 14

నేడు ఆరోగ్య ఉత్సవాలు

28 పారా, 16 నర్సింగ్ కాలేజీలను వర్చువల్‌గా ప్రారంభించనున్న సీఎం రేవంత్

సీఏఎస్, ఫుడ్ఇన్‌స్పెక్టర్లకు నియామకపత్రాలు 13

ఉస్మా'నయా' ఆస్పత్రిపై సీఎం సమీక్ష

రోడ్ల నిర్మాణానికి తక్షణమే సర్వే

సమగ్ర ప్రణాళికలకు ఆదేశాలు



చర్ల మండలంలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

నెత్తురోడిన అడవి

ఏటూరునాగారంలో ఏడుగురు మావోయిస్టుల కాల్చివేత



మధు మృతదేహం

ఆదివారం తెల్లవారుజామున ఎన్‌కౌంటర్

నర్సంపేట ఏరియా, ఏటూరు నాగారం డివిజన్ కార్యదర్శులు భద్రు, మధు మృతి

చనిపోయిన వారిలో ఓ మహిళ కూడా

నిద్రిస్తున్న దళంపై పోలీసుల దాడి!?

ప్రతిఘటించలేక చెల్లాచెదురైన వైనం

మధుది పెద్దపల్లి, మిగతావారిది ఛత్తీస్‌గఢ్

అరణ్యంలో హైటెన్షన్..!

నేటి నుంచి పీఎల్‌జీఏ వారోత్సవాలు

వరుస ఎన్‌కౌంటర్ల తర్వాత తొలిసారి

పోలీసులు అలర్ట్.. ముమ్మర కూంబింగ్

మావోయిస్టుల వ్యూహం మార్పు 3

తెలంగాణలో విస్తరణ.. అర్బన్‌పై నజర్?

ములుగు/ఏటూరునాగారం రూరల్, కోల్‌సిటీ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా ఏటూరు నాగారం అడవుల్లో మరోమారు తుపాకీ గర్జించింది. ఆదివారం తెల్లవారుజామున జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు మృతిచెందారు. పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ(పీఎల్‌జీఏ) వారోత్సవాలకు ఒకరోజు ముందు మావోయిస్టులకు కోలుకోలేని ఎదురుదెబ్బ తగిలింది. మృతుల్లో ఓ మహిళ సహా.. నర్సంపేట-ఇల్లందు ఏరియా కమిటీ కార్యదర్శి కుర్సం మంగు అలియాస్ భద్రు, ఏటూరునాగారం-మహదేవ్‌పూర్ డివిజన్ కమిటీ కార్యదర్శి ఈగోలపు మల్లయ్య అలియాస్ మధు ఉన్నారు. వీరిలో మధు స్వస్థలం పెద్దపల్లి జిల్లా రాణాపూర్ కాగా.. మిగతా ఆరుగురు ఛత్తీస్‌గఢ్ వారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. పీఎల్‌జీఏ వారోత్సవాల నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన ములుగు

మిగతా 3వ పేజీలో...

రూ.3,875 కోట్ల గోనె సంచులను

మింగేశారు!



వడ్లతోపాటు తట్టు బస్తాలనూ అమ్ముకున్న మిల్లర్లు

పదేళ్లుగా ఆడిట్ చేయని వైనం

తిరిగివ్వాల్సిన సంచులు 250 కోట్లు

ధర చెబితే చెల్లిస్తామన్న మిల్లర్లు

బస్తాకు రూ. 15.50 చొప్పున ఖరారు

3 ఏళ్ల కిందటి ధరతో పోలిస్తే సగమే

పౌరసరఫరాల సంస్థకు భారీ నష్టం

రైస్ మిల్లర్లకు ప్రయోజనం!

హైదరాబాద్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రైస్‌మిల్లర్ల తీరు 'గుడితోపాటు గుడిలోని లింగాన్నీ మింగేసిన' చందంగా ఉంది. ప్రభుత్వానికి అప్పగించాల్సిన కోట్ల రూపాయల ధాన్యాన్ని అమ్ముకున్న మిల్లర్లు.. వడ్లతోపాటు గోనె సంచులను (తట్టు బస్తాలు) కూడా అమ్ముకొని సొమ్ము చేసుకున్నారు. తట్టు బస్తాయే కదా! అని అధికారులు లెక్క చేయకుండా వదిలేయడంతో.. రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ఆదాయానికి ఏకంగా రూ.3,875 కోట్ల గండి పడింది. ఈ బస్తాలకు సంబంధించి ఏకంగా పదేళ్లుగా ఆడిట్ అనేదే జరగడంలేదు. దీంతో వీటిని అమ్ముకోవడం అలవాటుగా మారి.. భారీ కుంభకోణం చోటుచేసుకుంది. ఇందులో డిప్యూటీ తహసీల్దార్ల నుంచి మొదలుకొని జిల్లా మేనేజర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులు, రాష్ట్ర స్థాయి అధికారుల దాకా అందరి హస్తం ఉందన్న ఆరోపణలు

మిగతా 13వ పేజీలో...



డాలర్‌తో పెట్టుకుంటే.. టాటా చెప్పాల్సిందే!

100 శాతం సుంకాలు విధిస్తాం

అమెరికా మార్కెట్లోకి అనుమతివ్వం

ప్రత్యేక కరెన్సీ సృష్టించబోమని హామీ ఇస్తేనే కఠిన చర్యలు ఉండవు

బ్రిక్స్ కూటమికి ట్రంప్ హెచ్చరిక 2



ఎఫ్‌బీఐ చీఫ్‌గా కశ్యప్ పటేల్

అమెరికా అత్యున్నత దర్యాప్తు సంస్థ అధిపతిగా భారత సంతతి వ్యక్తి

ఎందుకీ విజయోత్సవాలు?

ఏడాదిలో ఒక్క హామీనైనా నెరవేర్చారా..?

మహిళలకు తలా రూ.27,500 బాకీ

రూ.4 వేలు కాదు.. ఉన్న పింఛన్ రావట్లే

బీసీలకు 20 వేల కోట్లు ఏమయ్యాయి

10 పంటలకు బోనస్ ఎటుపోయింది

పుట్టిన బిడ్డలకు బంగారు లక్ష్మి ఇచ్చారా?

ఏం చేశారని రూ.46 వేల కోట్ల అప్పు

ఏడాది పాలనలో ఆర్థిక వ్యవస్థ దివాలా

సర్కార్‌పై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధ్వజం

6 గ్యారెంటీలు, వైఫల్యాలపై చార్జ్‌షీట్



హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఏడాది పాలనలో ఏ ఒక్క హామీనీ నెరవేర్చకుండా.. రూ.కోట్లు వెచ్చించి ఎందుకీ విజయోత్సవాలు..? అని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి.. సీఎం రేవంత్‌రెడ్డిని నిలదీశారు. 'మార్పు కావాలి.. కాంగ్రెస్ రావాలి..' అని ప్రజలతో ఓట్లు

మిగతా 3వ పేజీలో...



కనీసం ముగ్గురిని కనండి

జనాభా క్షీణిస్తే సమాజమే అంతరిస్తుంది!

భాషలు, సంస్కృతి కూడా కనుమరుగవుతాయి

ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ వ్యాఖ్యలు 2

కనీసం ముగ్గురిని కనండి



- జనాభా క్షీణిస్తే సమాజమే అంతరిస్తుంది!
- ఆరెస్సెస్ చీఫ్ భాగవత్ స్పష్టీకరణ

నాగ్‌పూర్, డిసెంబరు 1: ప్రతి భారతీయ కుటుంబం కనీసం ముగ్గురేసి పిల్లలను కనాలని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భాగవత్ పిలుపిచ్చారు. జనసంఖ్య క్షీణిస్తే సమాజమే అంతరిస్తుందని హెచ్చరించారు. ఆయన ఆదివారమిక్కడ నాగపూర్‌లో నిర్వహించిన 'కథాలే కుల్ సమ్మేళన్'లో ఆయన ప్రసంగించారు. ప్రస్తుత జనాభా విధానం పాతికేళ్లనాటిదని.. 1998లో లేదా 2002లో ఖరారు చేశారని.. జన సంఖ్య వృద్ధి రేటు 2.1కి తగ్గకూడదని అందులో స్పష్టం చేశారని గుర్తుచేశారు. 'కుటుంబం సమాజంలో భాగం. ప్రతి కుటుంబం ఓ యూనిట్. జనాభా తగ్గుదల ఆందోళన కలిగించే అంశం. వృద్ధి రేటు 2.1కి తక్కువగా ఉంటే. సమాజం అంతరించిపోతుంది. ఆ పరిస్థితుల్లో దానినెవరూ నాశనం చేయనక్కర్లేదు. తనంత తానే నాశనమవుతుంది. భాషలూ కనుమరుగవుతాయి. సంస్కృతీ నశిస్తుంది. ప్రతి జంటా ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలను.. కనీసం ముగ్గురిని కనాలి. ఈ విషయాన్ని జన సంఖ్య శాస్త్రమే చెబుతోంది. సమాజం మనుగడ సాగించాలంటే పిల్లల సంఖ్య ముఖ్యం' అని భాగవత్ పేర్కొన్నారు. జనాభా నియంత్రణ, మతపరమైన జనాభా.. ఈ రెండు అంశాలూ విస్మరించడానికి వీల్లేనివని చెప్పారు. గతంలో నాగపూర్‌లోనే జరిగిన దసరా ర్యాలీలో కూడా ఆయన జనాభా పెరుగుదల అవసరాన్ని నొక్కిచెప్పారు. ప్రతి కోణంలో ఆలోచించి అన్ని వర్గాలకు వర్తించేలా నూతన జనాభా విధానాన్ని రూపొందించాలని ఆ సందర్భంగా అన్నారు. వివిధ వర్గాల జనాభాలో అసమతుల్యం.. భౌగోళిక సరిహద్దులనూ ప్రభావితం చేస్తుందని తెలిపారు. 'జనాభా అత్యధికంగా ఉంటే భారం ఎక్కువగా ఉంటుందన్నది నిజమే. కానీ జనాభాను సక్రమంగా వినియోగించుకుంటే అదో వనరుగా మారుతుంది. 50 ఏళ్ల తర్వాత మన దేశం ఎంత మందికి ఆహారం అందించగలుగుతుందనేది కూడా పరిగణనలోకి తీసుకోవాలి' అని భాగవత్ అభిప్రాయపడ్డారు. మహిళను తల్లిగా పరిగణించడం మంచిదేనని.. అయితే వారిని ఇళ్లలో నాలుగు గోడలకే పరిమితం చేయడం మంచిది కాదని చెప్పారు.


మోదీపై ఒవైసీ ఫైర్

భాగవత్ వ్యాఖ్యలపై ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ స్పందిస్తూ.. ప్రధాని మోదీపై విమర్శలు గుప్పించారు. 'ముస్లిం మహిళలు ఎక్కువ మంది పిల్లలను కంటున్నారని ఆయన గతంలో అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తల్లులు, కుమార్తెల నుంచి బంగారం, మంగళసూత్రాలు లాక్కుని ముస్లింలకు పంచుతారని ప్రచారం చేశారు. ఇప్పుడు భాగవత్ ఎక్కువ మంది పిల్లల్ని కనాలంటున్నారు. ఇక ఆర్ఎస్ఎస్‌వాళ్లు పెళ్లిళ్లు చేసుకోవడం మొదలుపెట్టండి' అని అన్నారు.

ప్రపంచ జనాభా తగ్గుముఖం..

1960-2000 మధ్య ప్రపంచ జనాభా రెట్టింపైంది. ఆ తర్వాత నుంచి తగ్గుముఖం పడుతూ వస్తోందని పలు అధ్యయన నివేదికలు చెబుతున్నాయి. జనాభా భర్తీ రేటు 2.1కి సమీపంలో ఉన్న దేశాల్లో భారత్, అర్జెంటీనా, ట్యునీసియా.. 2.1 కంటే తక్కువ రేటు ఉన్న దేశాల్లో అమెరికా, మెక్సికో, బ్రెజిల్ ఉన్నాయి. చైనా, జపాన్, దక్షిణ కొరియాల్లో ఇంకా బాగా తక్కువగా ఉండడమే గాక వృద్ధుల జనాభా పెరిగిపోతోంది. భారత్‌లోని పలు రాష్ట్రాలకు కూడా ఆ ముప్పు పొంచి ఉండడంతో.. పిల్లలను ఎక్కువగా కనాలని ఏపీ సీఎం చంద్రబాబు ఇటీవల పదే పదే చెబుతున్నారు. గతంలో ఉమ్మడి రాష్ట్ర సీఎంగా ఉన్న సమయంలో జనాభా నియంత్రణకు గట్టి పట్టు పట్టిన ఆయన.. ఇప్పుడు సమీప భవిష్యత్‌లో యువజనుల సంఖ్య తగ్గే ప్రమాదం కనబడుతుండడంతో ఆంధ్ర ప్రజలు ఎక్కువ సంతానాన్ని కనాలని కోరుతున్నారు.

లోకం తీరు



ఐన్‌స్టీన్, హాకింగ్‌ను మించిన ఐక్యూ

- భారత సంతతి బ్రిటిష్ కుర్రాడు క్రిష్ అరోరా ఘనత



లండన్, డిసెంబరు 1: ఆ భారత సంతతి బ్రిటిష్ కుర్రాడి వయసు 10 ఏళ్లు..! పేరు క్రిష్ అరోరా. పిట్ట కొంచెం కూత ఘనం అన్నట్టుగా.. ఇంటెలిజెన్స్ కోషెంట్(ఐక్యూ)లో ఏకంగా అల్బర్ట్ ఐన్‌స్టీన్, కృష్ణబిలాలపై ఎన్నో పరిశోధనలు చేసిన స్టీఫెన్ హాకింగ్‌ను మించిపోయాడు. పదేళ్ల ప్రాయంలోనే 162 ఐక్యూ స్కోర్‌ను సాధించాడు. అంతేకాదు.. ఐక్యూ అధికంగా ఉన్న వారికి మాత్రమే పరిమితమైన 'మేన్సా' సొసైటీలో సభ్యుడైపోయాడు. త్వరలో క్వీన్ ఎలిజబెత్ స్కూల్‌లో చేరనున్నాడు. తనకు స్కూలుకు వెళ్లాలని ఉండదని.. అక్కడ కేవలం వాక్యాలను రాయడం.. చిన్నచిన్న లెక్కలపై సమస్యలను సాధించడంతోనే రోజంతా గడిచిపోతుందని.. తనకు ఆల్జీబ్రా అంటే ఇష్టమని క్రిష్ చెబుతున్నాడు. "క్రిష్‌కు లెక్కలంటే ఇష్టం. అయితే.. అతని నాలుగో ఏట మొత్తం లెక్కల పుస్తకాన్ని మూడు గంటల్లో పూర్తిచేశాడు. ఎనిమిదో ఏట.. తన క్లాస్ సబ్జెక్టులన్నింటినీ ఒక్కరోజులో చుట్టేశాడు" అని క్రిష్ తల్లిదండ్రులు వివరించారు. పియానో వాయించడంలో కూడా క్రిష్ దిట్ట.

18 ఏళ్లకే పైలట్.. కర్ణాటక యువతి రికార్డు



బెంగళూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని విజయపురకు చెందిన సమైరా హుల్లూరు అనే యువతి 18 ఏళ్ల వయసుకే పైలట్ అయ్యారు. ఈ ఘనత సాధించిన దేశంలోనే అత్యంత పిన్న వయస్కురాలిగా ఆమె రికార్డు సృష్టించారు. విజయపురలోనే శిక్షణ పూర్తి చేసిన సమైరా.. ఆరు నెలలపాటు ఢిల్లీలో పైలట్‌గా తర్ఫీదు పొందారు. 18 ఏళ్లకే కమర్షియల్ పైలట్ లైసెన్స్ సాధించారు. ఈ సందర్భంగా సమైరా మాట్లాడుతూ.. 25 ఏళ్ల వయసులో పైలట్ అయిన కెప్టెన్ తపేశ్ కుమార్ తనకు ప్రేరణ అని అన్నారు. సమైరా విజయంపై దేశవ్యాప్తంగా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

బ్రహ్మోస్ ఏరోస్పేస్ సీఈవోగా రాఘవేంద్ర జోషి బాధ్యతల స్వీకరణ



అల్వాల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మోస్ ఏరోస్పేస్ సీఈవోగా ప్రముఖ శాస్త్రవేత్త జైతీర్థ్ రాఘవేంద్ర జోషి ఆదివారం బాధ్యతలను స్వీకరించారు. ఇప్పటివరకు ఆయన హైదరాబాద్‌లోని 'రక్షణ రంగ పరిశోధన, అభివృద్ధి ప్రయోగశాల(డీఆర్‌డీఎల్)'లో ప్రోగ్రామ్ డైరెక్టర్‌గా ఉన్నారు. ప్రస్తుత సీఈవో అతుల్ దిన్‌కర్ పదవీకాలం ముగియడంతో రక్షణ శాఖ ఈ నెల 26న జోషిని బ్రహ్మోస్ ఏరోస్పేస్ సీఈవోగా నియమించింది. ఆదివారం ఆయన బాధ్యతలను స్వీకరించారు. జోషి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో బీటెక్ చేశారు. నిట్ వరంగల్‌లో పీహెచ్‌డీ చేశారు. క్షిపణి సాంకేతికతలో జోషికి 30ఏళ్లకు పైగా అనుభవం ఉంది. పృథ్వీ, అగ్ని క్షిపణుల తయారీలో ఆయన పాత్ర ఉంది. ఉపరితలం నుంచి గాల్లోని లక్ష్యాలను ఛేదించగల దీర్ఘశ్రేణి క్షిపణుల(ఎల్ఆర్‌సామ్) తయారీ ప్రాజెక్టుకు డైరెక్టర్‌గా జోషి ఆ క్షిపణుల తయారీలో అత్యంత కీలక పాత్ర పోషించారు.

కువైట్ ఎయిర్‌పోర్టులో భారతీయుల పడిగాపులు

న్యూఢిల్లీ, డిసెంబరు 1: కువైట్ విమానాశ్రయంలో భారతీయులు సుమారు 23 గంటలపాటు పడిగాపులు పడాల్సి వచ్చింది. బహ్రెయిన్ నుంచి మాంచస్టర్ వెళ్లాల్సిన గల్ఫ్ ఎయిర్ విమానంలో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో ఆదివారం వేకువజామున దాన్ని కువైట్ మళ్లించారు. అప్పటి నుంచి భారతీయ ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. కువైట్‌లో భారతీయులకు వీసా ఆన్ అరైవల్ (వీఓఏ) సౌకర్యం లేదు. ఆ సదుపాయం ఉంటే నగరంలోని హోటళ్లకు వెళ్లే సదుపాయం ఉండేది. బ్రిటన్, గల్ఫ్ దేశాల వారికి వీఓఏ ఉండడంతో వారు హోటళ్లకు వెళ్లారు. విమానాశ్రయంలోని హోటళ్లలో ఉందామంటే గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ సమావేశాల కారణంగా అవన్నీ నిండిపోయాయి. చివరకు భారతీయ రాయబార కార్యాలయం జోక్యం చేసుకొని వారిని విమానాశ్రయం లాంజ్‌లో విశ్రమించే ఏర్పాటు చేసింది. దీనిపై హైదరాబాద్‌కు చెందిన ఆనందపు సాయి స్వరూప్ అనే ప్రయాణికుడు ట్వీట్ ద్వారా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

తుఫానులో అదుపు తప్పిన ఇండిగో విమానం

చెన్నై, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాను వల్ల ఏర్పడిన ప్రతికూల వాతావరణంలో విమానం ల్యాండింగ్‌కు ప్రయత్నించి అదుపు తప్పింది. అయితే, పైలట్ అప్రమత్తంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. శనివారం సాయంత్రం చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయంలో ఇండిగో సంస్థకు చెందిన ఎయిర్‌బస్ ఏ320 నియో విమానానికి ఎదురైన పరిస్థితి ఇది. ఈ వీడియో వైరల్ అయింది. విమానం రన్‌వేపై దిగేందుకు ప్రయత్నించడం, దాని చక్రాలు నేలకు అంగుళాల దూరంలో ఉండగా విమానం కుదుపులకు లోనవడం, వెంటనే విమానం తిరిగి గాల్లోకి లేవడం వీడియోలో కనిపించింది.

రష్యా రక్షణ బడ్జెట్ రూ.10.66 లక్షల కోట్లు!

మాస్కో, డిసెంబరు 1 : ఉక్రెయిన్‌తో జరుగుతున్న పోరులో పైచేయి సాధించడమే లక్ష్యంగా రష్యా తన రక్షణ రంగానికి బడ్జెట్‌లో రికార్డు స్థాయిలో నిధులు కేటాయించింది. రష్యా ప్రభుత్వ వెబ్‌సైట్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం 2025 బడ్జెట్‌లో రక్షణ రంగానికి 13.5 ట్రిలియన్ రుబెల్స్. భారత కరెన్సీలో రూ.10.66 లక్షల కోట్లకు పైగా మొత్తాన్ని కేటాయించారు. మొత్తం బడ్జెట్‌లో రక్షణ రంగానికే దాదాపు 32.5 శాతం నిధులు కేటాయించడం విశేషం. 2024 రక్షణ బడ్జెట్‌తో పోలిస్తే ఇది 28.3 శాతం అధికం. ఈ రూ.10.66 లక్షల కోట్ల బడ్జెట్‌కు రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆమోదం కూడా తెలిపారు. కాగా, రష్యా.. ఉక్రెయిన్‌పై శనివారం జరిపిన క్షిపణి దాడిలో క్షతగాత్రుల సంఖ్య 24కు చేరింది. రష్యా సైన్యం ఆదివారం 78 డ్రోన్లతో దాడి చేయగా వాటిలో 32 డ్రోన్లను కూల్చివేశామని ఉక్రెయిన్ వాయుసేన ప్రకటించింది. ఉక్రెయిన్‌లో ఓ మినీ బస్సుపై ఆదివారం ఉదయం జరిగిన డ్రోన్ దాడిలో ముగ్గురు మరణించగా, ఏడుగురు గాయపడ్డారు.

సిరియాలో 300 మంది రెబల్స్ హతం

అలెప్పో, డిసెంబరు 1: సిరియాలో మళ్లీ అంతర్యుద్ధ భయాందోళనలు నెలకొంటున్న వేళ ఆ దేశానికి రష్యా మద్దతుగా నిలిచింది. సిరియా అధ్యక్షుడు బషర్ అల్- అస్సద్‌కు వ్యతిరేకంగా ఒకప్పటి అల్‌ఖైదా అనుబంధ సంస్థ హయాత్ తహ్రీర్ అల్- షమ్ తిరుగుబాటు జెండా ఎగురవేసి ఒక్కో పట్టణాన్ని ఆక్రమిస్తూ వెళుతున్న క్రమంలో ఆదివారం తాము సిరియాలో తిరుగుబాటుదారులపై వైమానిక దాడులు జరిపినట్లు రష్యా రక్షణ మంత్రిత్వశాఖ తెలిపింది. ఈ దాడుల్లో హయాత్ తహ్రీర్ అల్- షమ్ సంస్థ ముఖ్య నాయకులు అహ్మద్ హుస్సేన్ అల్ షరా, అకా అబూ మహమ్మద్ అల్ జులానీ సహా 300 మంది తిరుగుబాటుదారులు మృతి చెందినట్లు వెల్లడించింది. కాగా, ఆదివారం తిరుగుబాటుదారులు సిరియాలో రెండో అతిపెద్ద నగరమైన అలెప్పోను ఆక్రమించారు.

ఎఫ్‌బీఐ చీఫ్‌గా కశ్యప్

అమెరికా అత్యున్నత దర్యాప్తు సంస్థకు అధిపతిగా భారతీయ మూలాలున్న కాష్ పటేల్ నియామకం!

- ఆయనో తెలివైన న్యాయవాది: ట్రంప్
- ఎఫ్‌బీఐ చీఫ్ నియామకానికి సెనెట్ ఆమోదం తప్పనిసరి



న్యూయార్క్, డిసెంబరు 1: అమెరికాలో 'ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ)'.. అంటే మన దేశంలో సీబీఐ లెక్క! అంతటి కీలకమైన విభాగానికి అధిపతిగా భారత సంతతికి చెందిన కశ్యప్ పటేల్ (44)ను నియమించనున్నట్లు ప్రెసిడెంట్ ఎలెక్ట్ డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. కశ్యప్ పటేల్ అమెరికాలో కాష్ పటేల్‌గా సుప్రసిద్ధుడు. ఈ నేపథ్యంలో.. "ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్‌కు తదుపరి డైరెక్టర్‌గా కశ్యప్.. కాష్ పటేల్.. సేవలందిస్తారని ప్రకటించడానికి నేను గర్విస్తున్నాను" అని ట్రంప్ తన సోషల్ మీడియా ఖాతా 'ట్రూత్ సోషల్'లో పోస్ట్ చేశారు. "కాష్ సూక్ష్మబుద్ధిగల న్యాయవాది, పరిశోధకుడు. అవినీతి గుట్టు రట్టు చేయడానికి, న్యాయాన్ని కాపాడడానికి, అమెరికా ప్రజల పరిరక్షణకే ఆయన కెరీర్ అంతా పాటుపడ్డారు" అని ట్రంప్ కొనియాడారు. "నా తొలి దఫా పాలనలో కాష్ రక్షణ శాఖలో చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా, నేషనల్ ఇంటెలిజెన్స్ విభాగం డిప్యూటీ డైరెక్టర్‌గా, జాతీయ భద్రత మండలిలోని ఉగ్రవాద నిరోధక విభాగంలో సీనియర్ డైరెక్టర్‌గా అద్భుతంగా పనిచేశారు. ఎఫ్‌బీఐకి గతంలో ఉన్న విశ్వసనీయతను, ధైర్యాన్ని, నైతిక నిష్ఠను కాష్ పటేల్ తిరిగి తీసుకొస్తారు" అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. అమెరికా పాలనా యంత్రాంగంలోనూ, నిఘా, దర్యాప్తు సంస్థల్లోనూ విప్లవాత్మక మార్పులు అవసరమనే భావనలో ఉన్న ట్రంప్.. తనకు వీరవిధేయుడిగా పేరున్న కశ్యప్ పటేల్‌ను ఈ పదవికి ఎంచుకోవడం విశేషం. ఈ ప్రకటన నేపథ్యంలో.. ట్రంప్ జనవరి 20న అమెరికా అధ్యక్ష పదవి చేపట్టగానే, ఎఫ్‌బీఐ ప్రస్తుత డైరెక్టర్ క్రిస్టఫర్ రే తన పదవికి రాజీనామా చేయాల్సి ఉంటుంది. నిజానికి 2017లో ఆయన్ను నియమించింది ట్రంపే. కానీ, ఎన్నికల్లో ఓడిపోయాక ఎఫ్‌బీఐ అధికారులు తన కార్యాలయాలపై దాడులు చేయడంతో.. ట్రంప్ ఆ సంస్థపై ద్వేషం పెంచుకున్నారు. కాగా.. కాష్ పటేల్ నియామకానికి సెనెట్ ఆమోదం పొందాల్సి ఉంది.

గుజరాతీ మూలాలు

కాష్ పటేల్ తల్లిదండ్రులు తొలుత ఉగాండాలో ఉండేవారు. అక్కడ ఈదీ అమీన్ పాలనలో ప్రబలిన అరాచకాలను భరించలేక వారు 1970ల్లో అక్కణ్నుంచీ పారిపోయి అమెరికాలోని లాంగ్ ఐలండ్‌లో స్థిరపడ్డారు. కాష్ పటేల్ 1980లో న్యూయార్క్‌లోని గార్డెన్ సిటీలో కశ్యప్ జన్మించారు. 2005లో పేస్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ లా నుంచి 'జ్యూరిస్ డాక్టర్ (టీచర్ ఆఫ్ లా)' పట్టా పొందారు. అనంతరం ఫ్లోరిడాలో ఎనిమిదేళ్లపాటు పబ్లిక్ డిఫెండర్‌గా.. ఆ తర్వాత ఫెడరల్ పబ్లిక్ డిఫెండర్‌గా విధులు నిర్వర్తించారు. పబ్లిక్ డిఫెండర్‌గా ఆయన అంతర్జాతీయ మాదకద్రవ్యాల అక్రమ రవాణా, హత్య, మారణాయుధాలకు సంబంధించిన నేరాలు, ఆర్థిక నేరాలకు సంబంధించిన కేసులు వాదించారు. 2014లో.. అమెరికా న్యాయశాఖ జాతీయ భద్రత విభాగంలో ట్రయల్ అటార్నీగా చేరారు. ఆ సమయంలోనే.. జాయింట్ స్పెషల్ ఆపరేషన్స్ కమాండ్‌కు సేవలందించారు. 2017లో హౌస్ ఇంటెలిజెన్స్ కమిటీలో ఉగ్రవాద నిరోధక విభాగంలో సీనియర్ కౌన్సెల్‌గా నియమితులయ్యారు. హౌస్ పర్మనెంట్ సెలెక్ట్ కమిటీలో స్టాఫర్‌గా పనిచేస్తున్నప్పుడు ట్రంప్ దృష్టిలో పడి ఆయన బృందంలో చేరారు. 2016 ఎన్నికల్లో ట్రంప్ గెలుపునకు వీలుగా రష్యా జోక్యం చేసుకుందన్న ఆరోపణలపై జరిపిన దర్యాప్తును రిపబ్లికన్ల తరఫున వ్యతిరేకించడంలో కీలక పాత్ర పోషించారు. ట్రంప్‌పై బైడెన్ సర్కారు తీరును నిరసిస్తూ 'గవర్నమెంట్ గ్యాంగ్‌స్టర్స్' అనే పుస్తకాన్ని, ట్రంప్‌ను సింహంగా చిత్రీకరిస్తూ 'ద ప్లాట్ ఎగైనెస్ట్ ద కింగ్' అనే పుస్తకాన్ని రాశారు. ట్రంప్ గత ఎన్నికల్లో ఓడిపోయినా ఆయనతోనే ఉన్నారు.

చివరాఖరు: అయోధ్య రామాలయంలో బాల రాముడి ప్రతిష్ఠ కార్యక్రమ సమయంలో అమెరికన్ మీడియా అంతా భారతదేశంలో హిందూ జాతీయవాదం పెరిగిపోతోందంటూ వార్తాకథనాలు రాస్తే కాష్ వాటిని తీవ్రంగా ఖండించారు. గుజరాతీ మూలాలున్న కాష్.. మోదీ అభిమాని. అమెరికా అధ్యక్ష హోదాలో ట్రంప్ మనదేశానికి వచ్చినప్పుడు.. అహ్మదాబాద్‌లో ఆయన ప్రసంగంలో సచిన్, వివేకానందుడు వంటి పేర్లు వచ్చేలా చేయడంలో కీలక పాత్ర పోషించింది కాష్ పటేలే.

ప్రభుత్వాల ఆధీనంలోని వక్ఫ్ఆస్తుల వివరాలు ఇవ్వండి

- రాష్ట్రాలను కోరిన పార్లమెంటరీ కమిటీ

న్యూఢిల్లీ, డిసెంబరు 1: వక్ఫ్ సవరణ బిల్లుపై ఏర్పాటైన పార్లమెంటరీ కమిటీ... అనధికారికంగా రాష్ట్ర ప్రభుత్వాల ఆధీనంలోని వక్ఫ్ ఆస్తులపై దృష్టి సారించింది. వాటిపై వివరాలను అందించాల్సిందిగా అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను కమిటీ కోరింది. ఈ ఆస్తులకు సంబంధించిన వాస్తవ, తాజా వివరాలు సమర్పించాలని కోరింది. పలు రాష్ట్ర ప్రభుత్వాలు అనధికారిక పద్ధతుల్లో వక్ఫ్ ఆస్తులు, భూములను తమ స్వాధీనంలో ఉంచుకున్నాయని సచార్ కమిటీ తన నివేదికలో పేర్కొన్న విషయాన్ని కమిటీ ప్రస్తావించింది. అలాగే, వక్ఫ్ చట్టంలోని సెక్షన్ 40 ప్రకారం.. వక్ఫ్‌బోర్డు తనవిగా (క్లెయిమ్) చెబుతున్న భూముల వివరాలూ సమర్పించాలని కోరింది. రాష్ట్రాలకు చెందిన వేర్వేరు వక్ఫ్‌బోర్డులతో కలిపి 2005-06లో సచార్ కమిటీ ఏర్పాటైంది. వక్ఫ్ ఆస్తులు దేశవ్యాప్తంగా పెద్దఎత్తున ఆక్రమణలకు గురైనట్లు, కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఈ పనికి పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలను పరిశీలించడానికి ఈ కమిటీ ఏర్పాటైంది. తమ దృష్టికి వచ్చిన ఆరోపణలను పరిశీలించి తన నివేదికను కమిటీ సమర్పించింది. ఢిల్లీలో అత్యధికంగా 316 వక్ఫ్ ఆస్తులు ఆక్రమణలకు గురయ్యాయని నాడు గుర్తించింది. ఇక.. రాజస్థాన్‌లో 60, కర్ణాటకలో 42, మధ్యప్రదేశ్‌లో 53, యూపీలో 60, ఒడిశాలో 53 ఆస్తులు పరాధీనమయ్యాయని తేల్చింది. అప్పటి సచార్ కమిటీ నివేదికను తాజాపరచాలని పార్లమెంటరీ కమిటీ నిర్ణయించినట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వాల నుంచి తనకు కావాల్సిన సమాచారాన్ని కమిటీ తెప్పించుకొంటోంది. అలాగే, ఆస్తులపై యాజమాన్యం వంటి విషయాల్లో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు, వక్ఫ్‌బోర్డుకు మధ్య ఏమైనా న్యాయసంబంధ వివాదాలుంటే వాటి వివరాలూ అందించాలని సూచించారు.

డాలర్‌తో పెట్టుకుంటే.. టాటా చెప్పాల్సిందే!

100% సుంకాలు విధిస్తాం.. అమెరికా మార్కెట్లోకి అనుమతి ఉండదు

- బ్రిక్స్ కూటమికి ట్రంప్ హెచ్చరిక



ఫ్లోరిడా, డిసెంబరు 1: అమెరికా డాలర్ ప్రాభవాన్ని తగ్గించే ప్రయత్నాలు కొనసాగిస్తే బ్రిక్స్ కూటమి దేశాలపైన 100 శాతం సుంకాలు విధిస్తానని ఆ దేశ అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. అంతేగాక, ఆయా దేశాలకు అమెరికా మార్కెట్లోకి ప్రవేశం లేకుండా తలుపులు మూస్తానన్నారు. ఈ మేరకు శనివారం 'ట్రూత్ సోషల్' అనే సోషల్ మీడియా వేదికలో ఆయన ఒక పోస్ట్ పెట్టారు. 'కొత్తగా ఎటువంటి బ్రిక్స్ కరెన్సీని సృష్టించబోమని, బలమైన అమెరికా డాలర్‌కు ప్రత్యామ్నాయంగా మరే ఇతర కరెన్సీకి మద్దతు ఇవ్వబోమని బ్రిక్స్ దేశాలు మాకు హామీ ఇవ్వాలి. లేకపోతే వారు 100 శాతం సుంకాలు చెల్లించటానికి సిద్ధపడాలి. అంతేకాదు, అమెరికా ఆర్థిక వ్యవస్థలో ఎటువంటి అమ్మకాలు జరపకూడదు' అని పేర్కొన్నారు. అంతర్జాతీయ వాణిజ్యంలో అమెరికా డాలర్ స్థానాన్ని బ్రిక్స్ భర్తీ చేయటం సాధ్యం కాదన్నారు. ఏ దేశం ఈ దిశగా ప్రయత్నించినా.. అమెరికాకు టాటా చెప్పాల్సిందేనని ట్రంప్ స్పష్టం చేశారు. అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన అనంతరం ట్రంప్ సుంకాల మీద ప్రత్యేక దృష్టి పెట్టారు. అమెరికాలోకి పెద్ద ఎత్తున అక్రమ వలసలకు, డ్రగ్స్ సరఫరాకు మెక్సికో, కెనడా కారణమవుతున్నాయని.. ధోరణి మార్చుకోకపోతే వాటి ఎగుమతులపైన 25 శాతం సుంకం విధిస్తానని, ఇదే కారణాలతో చైనా మీద 10 శాతం సుంకం విధిస్తానని ట్రంప్ ఇటీవలే ప్రకటించారు. ఈ ఏడాది అక్టోబరులో రష్యాలో జరిగిన బ్రిక్స్ కూటమి సమావేశంలో.. సభ్యదేశాల మధ్య జరిగే వాణిజ్య లావాదేవీల్లో డాలర్లకు బదులు స్థానిక కరెన్సీలను ఉపయోగించాలన్న ప్రతిపాదన వచ్చింది. ఈ నేపథ్యంలోనే ట్రంప్ తాజా ప్రకటన చేశారు. ప్రస్తుతం బ్రిక్స్ కూటమిలో బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా, ఈజిప్టు, ఇథియోపియా, ఇరాన్, యూఏఈ సభ్యదేశాలుగా ఉన్నాయి. ప్రస్తుత ప్రపంచ వాణిజ్యంలో డాలర్ ప్రాభవం బలంగా ఉంది. చమురు వంటి కీలకమైన సరుకుల అమ్మకాలు, కొనుగోళ్లు డాలర్లలోనే జరుగుతున్నాయి. ప్రపంచ విదేశీ మారక నిల్వల్లో డాలర్ల వాటా దాదాపు 58 శాతం ఉంది.

అక్రమ వలసదారుల కోసం పాక్ హోటల్‌కు 1860కోట్లా!

జో బైడెన్ ప్రభుత్వంపై రిపబ్లికన్ పార్టీ నేత వివేక్ రామస్వామి తీవ్ర విమర్శలు చేశారు. అక్రమ వలసదారులకు ఆశ్రయం కల్పించేందుకు న్యూయార్క్‌లోని ఓ పాకిస్థాన్ హోటల్‌కు రూ.1,860 కోట్లు చెల్లించడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. న్యూయార్క్‌లోని మాన్‌హట్టన్‌లో రూజ్‌వెల్ట్ హోటల్ ప్రస్తుతం పాకిస్థాన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌లైన్స్(పీఐఏ) యాజమాన్యంలో ఉంది. అమెరికాకు చెందిన రచయిత జాన్ లెఫెవ్రే ఇటీవల సోషల్ మీడియా వేదికగా "రూజ్‌వెల్ట్ హోటల్‌లో అక్రమ వలసదారులకు ఆశ్రయం కల్పించేందుకు న్యూయార్క్ నగరం పాకిస్థాన్‌కు రూ.1,860 కోట్లు చెల్లిస్తోంది. సరైన పత్రాలు లేని వలసదారులంతా ప్రస్తుతం దీనిలో తక్కువ ధరకే ఉంటున్నారు. ఈ స్వీట్ డీల్ ద్వారా పాకిస్థాన్‌కు మంచి ఆదాయం సమకూరుతోంది" అన్నారు. దీనిపై వివేక్ స్పందిస్తూ.. "అమెరికాలోని పన్ను చెల్లింపుదారుల డబ్బుతో అక్రమ వలసదారులకు హోటల్‌లో విడిది ఏర్పాటు చేశారు. ఇది చాలా విడ్డూరంగా ఉంది" అని అన్నారు.

దేశం కోసమే మా పోరాటం

హక్కులను కేంద్రం కాలరాస్తోంది

- విమర్శలు గుప్పించిన ప్రియాంక



వయనాడ్, బెంగళూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): దేశం కోసమే తాము పోరాడుతున్నామని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, వయనాడ్ ఎంపీ ప్రియాంకాగాంధీ అన్నారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రజల హక్కులను కాలరాస్తోందని, కొద్దిమంది తమ వ్యాపార మిత్రులకు సంపదను దోచిపెడుతోందని విమర్శలు గుప్పించారు. వయనాడ్‌లో ఈ ఏడాది జూలై 30న సంభవించిన వరదలకు ఇక్కడి ప్రజలు సర్వస్వం కోల్పోయారని, వారిని ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని దుయ్యబట్టారు. వయనాడు పార్లమెంటు పరిధిలోని మనంతవాడీలో నిర్వహించిన సమావేశంలో ఆదివారం ప్రియాంకాగాంధీ ప్రసంగించారు. "ఏ వ్యవస్థలపై ఈ దేశ నిర్మాణం జరిగిందో ఆ వ్యవస్థలను అధికారంలో ఉన్నవారు నాశనం చేస్తున్నారు. అందుకే దేశం కోసం మేం పోరాటం చేస్తున్నాం" అని అన్నారు. వయనాడ్ విపత్తు బాధితులను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొండిచేయి చూపాయని దుయ్యబట్టారు. మరోవైపు, కొద్ది మంది కుబేరులే లబ్ధి పొందున్నంత కాలం దేశం ప్రగతి సాధించలేదని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఒకవైపు అభివృద్ధి ఫలాలు కొద్ది మంది కోటీశ్వరులే అందుకుంటూ మరోవైపు ఆర్థిక విపత్తుల కారణంగా రైతులు, కార్మికులు, మధ్యతరగతి ప్రజలు జీవనం కోసం పోరాడుతుంటే అది ప్రగతి అనిపించుకోదని తెలిపారు. జీడీపీ వృద్ధి బాగా తగ్గినట్టు వార్తలు వచ్చిన నేపథ్యంలో ఆదివారం ఆయన ఈ మేరకు ట్వీట్ చేశారు.

ఢిల్లీలో కాంగ్రెస్‌తో పొత్తు లేదు: కేజ్రీవాల్

న్యూఢిల్లీ, డిసెంబరు 1: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తులపై ఆమ్ ఆద్మీ పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. కాంగ్రెస్‌తో ఎలాంటి పొత్తూ ఉండబోదని ఆ పార్టీ అధినేత కేజ్రీవాల్ చెప్పారు. ఫిబ్రవరిలో జరగనున్న ఈ ఎన్నికల్లో కూటమి కట్టడం లేదన్నారు. ఆదివారమిక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేజ్రీవాల్ మాట్లాడుతూ.. తాము ఒంటరిగానే పోటీ చేస్తామని చెప్పారు. ఆప్, కాంగ్రెస్ పార్టీలు ఇండి కూటమిలో భాగస్వామ్యపక్షాలుగా ఉన్న సంగతి తెలిసిందే. లోక్‌సభ ఎన్నికల్లో ఈ పార్టీలు కలిసే పోటీ చేశాయి. కానీ, ఢిల్లీలో ఈ కూటమికి తీవ్ర నిరాశే మిగిలింది. మొత్తం 7 లోక్‌సభ స్థానాలూ బీజేపీ గెలుచుకుంది. ఇటీవల హరియాణా ఎన్నికల్లో కూడా ఆప్, కాంగ్రెస్ మధ్య పొత్తు కుదరలేదు. ఢిల్లీ ఎన్నికల్లో పొత్తులు లేకుండా పోటీ చేస్తామని కాంగ్రెస్ ఇప్పటికే ప్రకటించింది.

మహా సీఎం ఫడణవీస్?

బీజేపీ సీనియర్ నేత వెల్లడి.. మోదీ, షాలదే తుది నిర్ణయమన్న శిందే

- ముంబైలో నేడు మహాయుతి సమావేశం



ముంబై, డిసెంబరు1: మహారాష్ట్రకు కాబోయే ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీసేనని, ఒకటి రెండు రోజుల్లో లాంఛనంగా ఎన్నికవుతారని బీజేపీ సీనియర్ నేత ఒకరు వెల్లడించారు. మరోవైపు నేడు జరిగే మహాయుతి సమావేశంలో ఈ విషయంపై స్పష్టత వచ్చే అవకాశముంది. ఈ సమావేశానికి బీజేపీ సీనియర్ నేత దేవేంద్ర ఫడ్నవీస్, శివసేన అధ్యక్షుడు, ఆపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే, ఎన్సీపీ అధ్యక్షుడు అజిత్ పవార్ హాజరవుతారు. మంత్రిత్వ శాఖల కేటాయింపులపై ముగ్గురు నేతలు చర్చిస్తారు. హోం, పట్టణాభివృద్ధి, పీడబ్ల్యూడీ, ఆర్థిక శాఖలతో పాటు అసెంబ్లీ స్పీకర్ పదవిపై మూడు పార్టీల మధ్య గట్టి పోటీ ఉండటంతో ఈ సమావేశానికి ప్రాధాన్యత పెరిగింది. హోం, స్పీకర్ పదవి విషయంలో బీజేపీ పట్టు వదలడం లేదు. ఈ కారణం వల్లే కొత్త సీఎం ప్రకటన ఆలస్యం అవుతోందని సమాచారం. డిసెంబరు రెండులోగా దీనిపై తేల్చుకోవాలని, లేదంటే తామే నిర్ణయిస్తామని అమిత్ షా మహాయుతి కూటమి నేతలకు స్పష్టం చేసినట్లు తెలిసింది. దీంతో శాసనసభాపక్షను ఎన్నుకునేందుకు బీజేపీ ఎమ్మెల్యేలు నేడు లేదా రేపు సమావేశం కానున్నారు. దేవేంద్ర ఫడ్నవీస్‌ను బీజేపీ శాసనసభాపక్ష నేతగా ఎన్నుకుంటారని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి.

మౌనం వీడిన ఏక్‌నాథ్ శిందే

సొంతూరుకు వెళ్లిన శిందే తన మౌనాన్ని వీడారు. మహారాష్ట్ర కొత్త ముఖ్యమంత్రి విషయంలో ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలదే తుది నిర్ణయమన్నారు. మహాయుతి కూటమిలో ఎలాంటి విభేదాలు లేవని శిందే స్పష్టం చేశారు. తన ఆరోగ్యం మెరుగుపడిందని చెప్పారు.

డిప్యూటీ సీఎం రేసులో శిందే తనయుడు

మహారాష్ట్రలో కొత్తగా ఏర్పడే మహాయుతి ప్రభుత్వంలో ఏక్‌నాథ్ శిందే తనయుడు శ్రీకాంత్ శిందే డిప్యూటీ సీఎం రేసులో ఉన్నారని తెలుస్తోంది. మీడియాలో దీనిపై చర్చ జరుగుతోందన్న ఏక్‌నాథ్ శిందే ఈ ప్రతిపాదనను మాత్రం తోసిపుచ్చలేదు. దీంతో శ్రీకాంత్ శిందే డిప్యూటీ సీఎం అవుతారనే చర్చ ఊపందుకుంది. శ్రీకాంత్ శిందే ప్రస్తుతం లోక్‌సభ ఎంపీగా ఉన్నారు. శ్రీకాంత్ శిందేను డిప్యూటీ ముఖ్యమంత్రిని చేస్తే ఏక్‌నాథ్ శిందే ఏ బాధ్యత తీసుకుంటారనేది ఉత్కంఠ రేపుతోంది.

ఈవీఎంల ట్యాంపరింగ్ అసాధ్యం: ఈసీ

న్యూఢిల్లీ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఈవీఎంలను ట్యాంపరింగ్ చేయడం అసాధ్యమని భారత ఎన్నికల సంఘం(ఈసీఐ) మరోసారి స్పష్టం చేసింది. ఈవీఎంలను హ్యాక్ చేయవచ్చంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంలో ఏ మాత్రం వాస్తవం లేదని పేర్కొంది. ఈవీఎంను హ్యాక్.. ట్యాంపరింగ్ చేయగలనంటూ ఓ వ్యక్తి చెబుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారిందని, దీనిపై కఠినంగా వ్యవహరిస్తామని వెల్లడించింది. ఇటీవల మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఈవీఎంలను హ్యాక్ చేయడం గురించి చెప్పినట్లు తెలుస్తోందని స్పష్టంచేసింది. నిందితుడిని సయ్యద్ షుజాగా గుర్తించామని, ఇతడిపై మహారాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈవో) ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముంబై సైబర్ క్రైమ్ పోలీసులు శనివారం ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు వివరించింది. 2019లోనూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు షుజాపై ఢిల్లీలోనూ కేసు నమోదైనట్లు ఈసీ గుర్తుచేసింది.

నెత్తుర్రోడిన అడవి

(మొదటి పేజీ తరువాయి)

జిల్లా వాజేడు, వెంకటాపురం, ఏటూరునాగారం అభయారణ్యాన్ని గ్రేహౌండ్స్, స్పెషల్‌పార్టీ పోలీసులు జల్లెడ పడుతున్నారు. ఈ క్రమంలో.. ఆదివారం ఉదయం 6.16 గంటల సమయంలో ఏటూరు నాగారం మండలం చెల్పాక-ఐలాపూర్ అభయారణ్యంలోని పోలకమ్మవాగు సమీపంలో నక్సల్స్ ఉన్నట్లు గుర్తించారు. ఇరువైపులా అరగంట పాటు కాల్పులు జరిగాయి. మావోయిస్టుల వైపు కాల్పులు ఆగిపోయిన కాసేపటికి.. పోలీసులు ఏడు మృతదేహాలను గుర్తించారు. మృతుల్లో భద్రు, మధుతో పాటు.. ఏరియా కమిటీ సభ్యులు ముస్సాకి దేవల్ అలియాస్ కర్ణాకర్, ముస్సాకి జమునలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మిగతా ముగ్గురిని దళసభ్యులు జైసింగ్, కిశోర్, కామేశ్‌గా భావిస్తున్నారు. ఘటనాస్థలిలో రెండు ఏకే-47 తుపాకులు, జీ3, 303-రైఫిల్, ఇన్సాస్ తుపాకీ, ఎస్‌బీబీఎల్ గన్, సింగిల్‌షాట్ తుపాకీ, తపంచా, కిట్ బ్యాగులు, విప్లవ సాహిత్యం, వంట సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఏటూరునాగారం, మంగపేట తహసీల్దార్‌లు శవపంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పలువురు మావోయిస్టులు తప్పించుకొని పారిపోయినట్లు భావిస్తున్న పోలీసులు.. కూంబింగ్‌ను ముమ్మరం చేశారు. జిల్లా ఎస్పీ శబరీశ్ సంఘటనాస్థలాన్ని సందర్శించారు. ఎస్పీ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతుండగానే.. ఉదయం 11.47గంటలకు ఒకసారి, 11.49గంటలకు మరోసారి రెండేసి రౌండ్లు, మధ్యాహ్నం 12.14 గంటలకు మూడురౌండ్ల కాల్పులు జరిగాయి.

తప్పించుకోలేని స్థితిలో..

భద్రు దళం నిద్రలో ఉన్నప్పుడు పోలీసులు కాల్పులు జరపగా వారు తూటాలకు బలైనట్లు సమాచారం. మృతదేహాలు పొదల్లో పడి ఉన్న తీరు.. కాళ్లకు బూట్లు/చెప్పులు లేకపోవడం ఈ అనుమానాలకు బలాన్ని చేకూరుస్తోందని పౌరహక్కుల నేతలు చెబుతున్నారు.

బూటకపు ఎన్‌కౌంటర్: పౌరహక్కుల సంఘం

ఏటూరునాగారంలో జరిగింది బూటకపు ఎన్‌కౌంటర్ అని పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్ ఆరోపించారు. ఆదివారం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. తెలంగాణలో ఇప్పటి వరకు మూడు ఎన్‌కౌంటర్లు జరిగాయని, 16 మంది మావోయిస్టులు మరణించారని గుర్తుచేశారు. ఈ ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఎన్‌కౌంటర్లలో పాల్గొన్న పోలీసులపై హత్యకేసు నమోదు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఏటూరు నాగారం ఎన్‌కౌంటర్‌కు ముందు భద్రు దళానికి విషాహారం పెట్టారని ఆరోపించారు. స్పృహ కోల్పోయిన మావోయిస్టులను చిత్రహింసలకు గురిచేసి, కాల్చి చంపారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనలపై సిటింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, నిపుణులైన వైద్య బృందంతో హైదరాబాద్‌లో పోస్టుమార్టం నిర్వహించాలని డిమాండ్ చేశారు. పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణ కూడా ఇది బూటకపు ఎన్‌కౌంటర్ అని ఆరోపించారు.



ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన నక్సల్స్ భద్రు, దేవల్, జమున, మల్లయ్య అలియాస్ మధు(ఫైల్)

మధుపై రూ.8 లక్షల రివార్డు

ఏటూరునాగారం ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మల్లయ్య అలియాస్ మధు స్వస్థలం పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం రాణాపూర్ గ్రామం. 1995లో.. 18 ఏళ్ల వయసులోనే ఆయన అజ్ఞాతంలోకి వెళ్లారు. దళ సభ్యుడిగా..ఆ తర్వాత ఛత్తీస్‌గఢ్‌లో పనిచేశాడు. ఉత్తర తెలంగాణలో మావోయిస్టు పార్టీ విస్తరణ బాధ్యతలు తీసుకున్నాడు. అయితే.. మధు మృతదేహాన్ని ఆయన కుటుంబ సభ్యులు గుర్తించలేకపోతున్నారు. 30 ఏళ్ల క్రితం అజ్ఞాతంలోకి వెళ్లడంతో.. స్థానికులూ పోల్చుకోలేకపోతున్నట్లు తెలుస్తోంది. కాగా.. తెలంగాణ పోలీసులు గతంలోనే మధు తలపై రూ.8 లక్షల రివార్డును ప్రకటించారు.

అదే పులి!

» యువతి, రైతుపై దాడి చేసింది ఒక్కటే : పీసీసీఎఫ్



గ్రామస్తులకు మాస్కులిస్తున్న పీసీసీఎఫ్

సిర్పూర్(టి), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా సంచరిస్తున్న పెద్ద పులి కోసం అన్వేషణ కొనసాగుతోంది. అయితే, కాగజ్‌నగర్ మండలం నజ్రూల్‌నగర్‌లో యువతి మరణానికి కారణమైన పులి, సిర్పూర్(టి) మండలంలో రైతుపై దాడి చేసిన పులి ఒక్కటేనని పీసీసీఎఫ్ (ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్) ఏలుసింగ్ మేరు ఆదివారం తెలిపారు. సిర్పూర్(టి) మండలం ఇటిక్యాలపహాడ్, దుబ్బగూడ ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. పులి దాడి జరిగిన ప్రదేశాలను, పులి పాదముద్రలను పరిశీలించారు. అటవీ సమీప ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పత్తి ఏరడానికి, అటవీ ప్రాంతానికి గుంపులుగా వెళ్లాలని, తల వెనుక భాగంలో మాస్కులు ధరించాలని సూచన చేశారు. ఇటిక్యాల పహాడ్ ప్రజలకు ప్రత్యేక మాస్కులను పంపిణీ చేశారు.

అరణ్యంలో హైటెన్షన్!

నేటి నుంచి మావోయిస్టు పీఎల్‌జీఏ వారోత్సవాలు..వరుస ఎన్‌కౌంటర్ల తరువాత మొదటిసారి నిర్వహణ

- » పోలీసుల అప్రమత్తం.. ముమ్మర కూంబింగ్
- » సమస్యాత్మక ప్రాంతాల్లో అభివృద్ధి పనుల నిలిపివేత
- » హిట్‌లిస్టులో ఉన్నవారికి హెచ్చరికలు జారీ
- » అర్బన్‌పై మావోయిస్టుల నజర్?
- » తెలంగాణలో విస్తరణపై ఫోకస్
- » అనుబంధ సంఘాల పునర్నిర్మాణంపై దృష్టి



భూపాలపల్లి, వరంగల్ ప్రతినిధి, చర్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని అడవుల్లో హైటెన్షన్ నెలకొంది. సోమవారం నుంచి జరగనున్న మావోయిస్టు పార్టీ పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ(పీఎల్‌జీఏ) వారోత్సవాలకు దండకారణ్యం వేదిక కావడంతో.. పోలీసులు అప్రమత్తమై.. ఏజెన్సీలు, అడవుల్లో నక్సల్స్ కోసం జల్లెడపడుతున్నారు. మండలాల్లో.. సరిహద్దులకు దారి తీసే మార్గాల్లో తనిఖీలను ముమ్మరం చేశారు. ఎక్కడికక్కడ నాకాబందీ నిర్వహిస్తున్నారు. ముందు జాగ్రత్తగా అభివృద్ధి కార్యక్రమాలను నిలిపివేయించి.. హిట్‌లిస్టులో ఉన్న నేతలను అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఈ ఏడాది జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్లలో 261 మంది నక్సల్స్ చనిపోయిన నేపథ్యంలో భవిష్యత్ కార్యాచరణకు మావోయిస్టు పార్టీ ఈ వారోత్సవాలను వేదికగా చేసుకుంటుండగా.. ఆ ప్రయత్నాలను భగ్నం చేయాలని పోలీసులు కంకణంకట్టుకున్నారు. దీంతో.. అడవుల్లో ఉద్రిక్త వాతావరణ నెలకొంటోంది.

ఇదీ.. పీఎల్‌జీఏ చరిత్ర..!

పాతికేళ్ల క్రితం(1999 డిసెంబరు 2న) కొయ్యూరులో జరిగిన భారీ ఎన్‌కౌంటర్ నక్సల్స్‌కు తీరని నష్టాన్ని కలిగించింది. ఆ ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన అగ్ర నేతల సంస్మరణ సందర్భంగా.. డిసెంబరు 2, 2000 సంవత్సరంలో పీఎల్‌జీఏ ఏర్పాటైంది. అప్పటి నుంచి ఏటా పీఎల్‌జీఏ వారోత్సవాలు జరుగుతున్నాయి. 2004లో మావోయిస్టు పార్టీ అవతరించిన తర్వాత.. పీఎల్‌జీఏ అందులో విలీనమైంది. దాడుల్లో.. భద్రతాబలగాలను మట్టుబెట్టడంలో పీఎల్‌జీఏ ముందు వరుసలో ఉంటుంది. తుపాకులతోపాటు.. అవసరాన్ని బట్టి విల్లంబులను, కత్తులను వినియోగించేలా పీఎల్‌జీఏ సభ్యులకు శిక్షణనిస్తారు. పీఎల్‌జీఏ ఒకటో బెటాలియన్‌కు మాద్వి హిడ్మా నేతృత్వం వహిస్తుండగా.. మరో 20 బెటాలియన్ల వివరాలు పోలీసులకు కూడా పెద్దగా తెలియదు. 2010 ఏప్రిల్ 6న తాడిమెట్లలో 76 మంది జవాన్లను హతమార్చింది కూడా పీఎల్‌జీఏనే. 2013 సల్వా జుడుం వ్యవస్థాపకుడు మహేంద్ర కర్మ, మరో 26 మంది హత్య మొదలు.. 2021 ఏప్రిల్ 4న తెర్రాం ఘటన(హిడ్మా నేతృత్వం) వరకు కూడా పీఎల్‌జీఏ కార్యాచరణే..! కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌తో భద్రతాబలగాలు నక్సల్స్ కంచుకోటగా పేరున్న అబుజ్‌మడ్‌కూ చేరడంతో కకావికలం అవుతున్న పీఎల్‌జీఏ.. తిరిగి పూర్వవైభవాన్ని నిలబెట్టుకునేందుకు సోమవారం నుంచి జరగనున్న వారోత్సవాలను వేదికగా చేసుకుంటున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. కొవిడ్ కల్లోలం కూడా పీఎల్‌జీఏను కోలుకోలేని దెబ్బకొట్టిందని పోలీసులు భావిస్తుంటారు. గడిచిన ఐదేళ్లలో 467 మందికి పైగా నక్సల్స్ హతమవ్వగా.. వారిలో 95% మంది ఆదివాసీలే కావడం గమనార్హం..! ఛత్తీస్‌గఢ్‌లో గడ్డుకాలం ఉండడంతో తెలంగాణ వైపు చూస్తున్న మావోయిస్టులకు ఇక్కడి భూభాగంపై కాలుపెట్టగానే.. కాల్పులు స్వాగతం పలుకుతాయి అన్నట్లుగా నిఘా పెరుగుతోంది. ఈ ఏడాది తెలంగాణలో 4 ఎన్‌కౌంటర్లు జరగ్గా.. 15 మంది నక్సల్స్ మృతిచెందారు. వీరిలో ముగ్గురు మాత్రమే తెలంగాణకు చెందినవారు. మిగతావారంతా ఛత్తీస్‌గఢ్‌కు చెందినవారే..!

నక్సల్స్ మరణాలు ఇలా..

సంవత్సరం	మృతుల సంఖ్య
2019	65
2020	40
2021	51
2022	30
2023	22
2024 (డిసెంబరు 1వరకు)	261
మొత్తం	467

ముమ్మరంగా కూంబింగ్

పీఎల్‌జీఏ వారోత్సవాల నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దుల్లో గ్రేహౌండ్స్, స్పెషల్‌పార్టీ, సీఆర్పీఎఫ్ బలగాలు ముమ్మరంగా కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. పట్టణాలు, మండల కేంద్రాల్లో తనిఖీలు చేస్తున్నాయి. దుమ్ముగూడెం, వెంకటాపురం, వాజేడు, చర్ల మండలాల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి, నాకాబందీ నిర్వహిస్తున్నాయి. సమస్యాత్మక ప్రాంతాల్లో అభివృద్ధి పనులను నిలిపివేయాలని పోలీసులు సూచించారు. ఆర్టీసీ బస్సులను కూడా రాత్రిళ్లు నడపకూడదని అధికారులకు విజ్ఞప్తి చేశారు. దీంతో.. భద్రాచలం ఏజెన్సీలోని చర్ల, దుమ్ముగూడెం, వాజేడు, వెంకటాపురం మండలాలకు రాత్రిళ్లు బస్ సేవలు నిలిచిపోనున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలు, సెల్ టవర్ల వద్ద పోలీసులు గస్తీని పెంచారు. కల్వర్టులు, సమస్యాత్మక రహదారుల వద్ద మందుపాతరలు, బాంబులను గుర్తించేందుకు డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్ తనిఖీలు చేస్తున్నాయి. మావోయిస్టు హిట్‌లిస్టులో ఉన్నవారు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

పట్టణ ప్రాంతాలపై గురి

అడవుల్లో నిఘా పెరుగుతుండడం.. ఒకప్పుడు మావోయిస్టులకు కంచుకోటలుగా ఉన్న ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిసాల్లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడడంతో నక్సల్స్ ఇప్పుడు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వైపు దృష్టిపెడుతున్నారు. దండకారణ్యంపై ఫోకస్ తగ్గించి, అర్బన్ ప్రాంతాలపై దృష్టిసారించాలని మావోయిస్టు అగ్రనేతలు నిర్ణయించినట్లు తెలుస్తోంది. అర్బన్‌లో ఉండే నిద్రాణ దళాలను(స్లీపర్‌సెల్స్) యాక్టివేట్ చేసి, పట్టణ ప్రాంతాల్లో పార్టీని పునర్నిర్మించాలని భావిస్తున్నట్లు సమాచారం. తెలంగాణలో పెరుగుతున్న ఆర్థిక, సామాజిక అసమానతలను ఆసరాగా చేసుకుని, ఇక్కడి యువతను విప్లవం వైపు ఆకర్షితులయ్యేలా చేయాలని మావోయిస్టులు భావిస్తున్నారని, పీఎల్‌జీఏ వారోత్సవాలను ఇందుకు వేదికగా మలచుకుంటున్నారని భద్రతా బలగాలు అనుమానిస్తున్నాయి. పట్టున్న మూడు రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో ఉండడంతో.. కాంగ్రెస్ పాలన ఉన్న తెలంగాణ తమకు సేఫ్‌జోన్‌గా నక్సల్స్ భావిస్తున్నారు. దండకారణ్యం నుంచి నల్లమల వరకు మళ్లీ సామ్రాజ్యాన్ని విస్తరించే దిశలో వడివడిగా అడుగులు వేస్తున్నారు. అయితే.. తెలంగాణలోకి ప్రవేశ మార్గాలుగా భావించే చర్ల, వాజేడు, దుమ్ముగూడెం, వెంకటాపురం తోపాటు.. ములుగు జిల్లాల్లో పోలీసుల నిఘా పెరగడం నక్సల్స్‌కు కొంత ఇబ్బందికరంగా ఉన్నట్లు తెలుస్తోంది.

ట్యూటర్ మాటలు నమ్మి.. బావిలో ఈతకు దిగి హాస్టల్ విద్యార్థి మృతి

» సూర్యాపేట జిల్లా అనంతగిరిలో ఘటన



తిరుమలేశ్(ఫైల్)

అనంతగిరి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తనకు ఈత రాదని విద్యార్థి చెప్పినా వినని ఓ ట్యూటర్ 'నేనున్నాను నీకేమీ కాదు దూకు' అంటూ అతడిని రెచ్చగొట్టి బావిలోకి దింపి విద్యార్థి మృతికి కారణమయ్యాడు. ఆదివారం సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం శాంతినగర్‌లో ఈ ఘటన జరిగింది. చింతలపాలెం మండలం నక్కగూడెం గ్రామానికి చెందిన గుగులోతు తిరుమలేశ్ (15) శాంతినగర్‌లోని సమీకృత హాస్టల్‌లో ఉంటూ పదో తరగతి చదువుతున్నాడు. ఇదే హాస్టల్‌లో శాంతినగర్ గ్రామానికి చెందిన వీరబాబు విద్యార్థులకు రోజూ ట్యూషన్ చెబుతుంటాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం ట్యూషన్ పూర్తయిన అనంతరం విద్యార్థులు తిరుమలేశ్, రాజేశ్‌లను పొలంలో టేకు చెట్లు నరికేందుకు వీరబాబు తీసుకెళ్లాడు. చెట్లు నరికిన అనంతరం పొలం పక్కన ఉన్న బావిలో స్నానం చేసేందుకు వీరబాబు మొదట దిగాడు. తిరుమలేశ్‌ని కూడా బావిలో దిగి స్నానం చేయాలని కోరాడు. తనకు ఈత రాదని తిరుమలేశ్ చెప్పినా వినకుండా 'నేనున్నాను నీకేమి కాదు దూకు' అంటూ వీరబాబు అతడిని రెచ్చగొట్టాడు. వీరబాబు మాటలు నమ్మిన తిరుమలేశ్ బావిలో దూకి ఈత రాక ప్రాణాలు కోల్పోయాడు. గజ ఈతగాళ్లు, గ్రామస్థులు బావి వద్దకు చేరుకుని తిరుమలేశ్ మృతదేహాన్ని బయటికి తీశారు. విషయం తెలుసుకున్న విద్యార్థి తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు హాస్టల్ ఎదుట ధర్నా నిర్వహించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇవ్వటంతో ఆందోళన విరమించారు.

మృత్యువులోనూ వీడని బంధం

» చేవేళ్ల వద్ద లారీని కారు ఢీకొని భార్యాభర్త మృతి

చేవెళ్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆదివారం సెలవు రోజు కావడంతో బంధువుల ఇంటికి కారులో బయలుదేరిన భార్యాభర్తను లారీ రూపంలో మృత్యువు కబళించింది. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల సమీపంలో హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై ఈఘటన జరిగింది. శంకర్‌పల్లి మండలం ప్రొద్దటూర్‌కు చెందిన మేకల లక్ష్మారెడ్డి (58) సంగారెడ్డి జిల్లాలోని బీడీఎల్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. ఆదివారం సెలవు కావడంతో తన భార్య భాగ్యలక్ష్మి (50)తో కలిసి చేవెళ్ల మండలం దేవరంపల్లిలో ఉన్న బంధువుల ఇంటికి కారులో బయలుదేరారు. మీర్జాగూడ గేటు సమీపంలోకి రాగానే వికారాబాద్ నుంచి ఎదురుగా వస్తున్న లారీని కారు వేగంగా ఢీకొట్టి అదే వేగంతో రోడ్డుపక్కన ఉన్న మర్రి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భాగ్యలక్ష్మి ఎగిరి కింద పడి అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రగాయాలైన లక్ష్మారెడ్డిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. దంపతులకు ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహం కాగా పెద్ద కుమారుడు లండన్‌లో చదువుకుంటున్నారు. తల్లిదండ్రుల వద్ద ఉంటున్న చిన్నకుమారుడికి ఎయిర్ ఇండియాలో జాబ్ వచ్చింది. ఆయనకు సోమవారం జాయినింగ్ ఉంది. మృతదేహాలకు చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కీచక ఉపాధ్యాయుడి సస్పెన్షన్

» ప్రిన్సిపాల్‌కూ నోటీసులు.. నల్లగొండ జిల్లాలో ఘటన

నిడమనూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విద్యాబుద్ధులు చెబుతూ వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయవల్సిన టీచర్లు గాడి తప్పుతున్నారు. విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ నీచంగా వ్యవహరిస్తున్నారు. తాజాగా నల్లగొండ జిల్లా నిడమనూరు ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయుడు దొడ్డా అంజనేయులు తమ పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని 6, 7, 8 తరగతుల బాలికలు వారి తల్లిదండ్రులకు చెప్పారు. దీంతో వారు విద్యార్థి సంఘం నాయకులతో కలిసి పాఠశాల ఎదుట ఆందోళనకు దిగారు. ప్రసార మాధ్యమాల్లో వచ్చిన వార్తల నేపథ్యంలో సదరు ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తున్నట్లు డీఈవో ప్రకటించారు. అలాగే నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు ప్రిన్సిపాల్ బూరుగు నిర్మలకు సైతం నోటీసులు జారీ చేసినట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

అనుమానంతో.. భార్యను ఉరి వేసి చంపి బావిలో వేలాడదీసిన భర్త

» హత్య కేసు నమోదు చేసిన పోలీసులు

» మహబూబాబాద్ జిల్లాలో ఘటన



అనూష(ఫైల్)

కేసముద్రం(మహబూబాబాద్ జిల్లా), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం స్టేషన్‌లోని ఉప్పరపల్లి రోడ్‌లో ఆదివారం బత్తుల అనూష(30)ను ఆమె భర్త ఉరి వేసి చంపి, ఆత్మహత్య చేసుకున్నట్లుగా చిత్రీకరించినట్లు రూరల్ సీఐ సర్వయ్య తెలిపారు. కేసముద్రం స్టేషన్‌కు చెందిన బత్తుల వీరన్నకు ఇదే మండలం బేరువాడ బోడ మంచ్యా తండాకు చెందిన కాముని కుమారస్వామి పెద్ద కుమార్తె అనూషతో 2011లో వివాహం జరిగింది. వీరికి 11 ఏళ్ల కుమారుడు రాజేష్ సంతానం. కుమారుడు జన్మించిన అనంతరం అనూషను అనుమానిస్తూ వీరన్న తరచూ గొడవ పడుతున్నాడు. నాలుగు రోజుల క్రితం రాజేష్ తన అమ్మమ్మ ఇంటికి వెళ్లగా వీరన్న అర్ధరాత్రి దాటిన తర్వాత అనూష మెడకు చీరను బిగించి చంపాడు. మృతదేహాన్ని ఇంటి వెనుకనున్న చేదబావి వద్దకు లాక్కెళ్లి చీరతో మెడకు, బావి గిరక దూలానికి కట్టి మృతదేహాన్ని బావిలోకి నెట్టి వేలాడదీసి ఆత్మహత్య చేసుకున్నట్లుగా చిత్రీకరించాడు. తర్వాత తన భార్య ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుందని బంధువు ఒకరికి తెలిపి పరారయ్యాడు. ఈ సమాచారం తెలిసిన పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని శవపరీక్షకు పంపించారు. హత్య చేసిన అనంతరమే మృతదేహానికి ఉరి వేసినట్లు శవపరీక్షలో ప్రాథమికంగా తేలిందని సీఐ వెల్లడించారు. అనూష తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఇష్టం లేని పెళ్లి నిశ్చయం.. యువకుడి బలవన్మరణం



వేణుగోపాల్‌రెడ్డి

నార్కట్‌పల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో వాళ్లు కుదిర్చిన పెళ్లి ఇష్టంలేక ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం గోపలాయపల్లిలో శనివారం జరిగింది. గ్రామానికి చెందిన కామసాని గోపాల్‌రెడ్డి, సైదమ్మ దంపతుల మూడో కుమారుడైన వేణుగోపాల్‌రెడ్డి(29) ఐటీఐ చదివాడు. వేణు కొన్ని మాసాలుగా దక్షిణాఫ్రికాలో ఉంటున్న పెద్దన్నతో పాటే ఉంటూ అతని బోర్‌వెల్స్ వ్యాపారంలో సహాయం చేస్తున్నాడు. ఐదు నెలల క్రితం గ్రామానికి తిరిగి వచ్చిన వేణుకు ఇటీవలే ఒడిశాకు చెందిన అమ్మాయితో వివాహం నిశ్చయమైంది. వేణుకు ఈ పెళ్లి ఇష్టం లేక శనివారం రాత్రి 9 గంటల సమయంలో గ్రామంలోని రైల్వే ట్రాక్ వద్దకు వెళ్లి రెండో సోదరుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి వాయిస్ మెసేజ్ పంపాడు. ప్రవీణ్.. వెంటనే గ్రామంలో ఉన్న తన స్నేహితులకు సమాచారమిచ్చాడు. వారు అక్కడికి వెళ్లి చూసేసరికే దురంతో ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి వేణుగోపాల్‌రెడ్డి చనిపోయినట్లు గుర్తించారు.



భీమునిపాదం వద్ద అరుదైన అతిథులు

వివిధ రంగుల్లో ఆకర్షణీయంగా కనిపిస్తున్న ఈ పక్షులు అరుదైన పక్షి జాతికి చెందినవి. ఇవి మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం సీతానగరం శివారు కొమ్ములవంచ అటవీ ప్రాంతంలోని భీమునిపాదం జలపాతం వద్ద పర్యాటకులకు కనువిందు చేస్తున్నాయి. గ్రేటర్‌రాకెట్- టెయిల్డ్‌డ్రోంగో, టికెల్ బ్లూ ఫ్లైక్యాచర్, అల్ట్రా మెరైన్ ఫ్లైక్యాచర్, ఇండియన్ ప్యారడైజ్ ఫ్లైక్యాచర్ జాతి పక్షులు ఎక్కడెక్కడ నుంచో వచ్చి ఇక్కడ ఆవాసం ఏర్పాటు చేసుకుంటున్నాయి. - గూడూరు, (ఆంధ్రజ్యోతి)

ఎందుకీ విజయోత్సవాలు?

(మొదటి పేజీ తరువాయి)



చార్జ్‌షీట్‌ను విడుదల చేస్తున్న కిషన్‌రెడ్డి, డీకే అరుణ, రఘునందన్, మహేశ్వర్‌రెడ్డి తదితరులు

వేయించుకున్న కాంగ్రెస్‌తో, ఏ మార్పూ సాధ్యం కాదని ఏడాదిలోనే తేలిపోయిందని అన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనకు, ఏడాది కాంగ్రెస్ పాలనకు ఏమాత్రం తేడాలేదని స్పష్టం చేశారు. ఆదివారం క్షత్రియా హోటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ.. కిషన్ రెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు, ఏడాది పాలనా వైఫల్యాలపై చార్జ్‌షీట్ విడుదల చేశారు. అనంతరం కాంగ్రెస్ ఏడాది పాలనలో వైఫల్యాలను ఎండగడుతూ కిషన్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. "ఏడాది పాలనలో ఆర్థిక వ్యవస్థ దివాలా తీసింది. ఒక్క ప్రాజెక్టు కూడా కట్టకుండానే సర్కారు ఆర్‌బీఐ నుంచి 9 నెలల్లో రూ.46 వేల కోట్లు అప్పు తీసుకుంది. చేయూత కింద రూ.4వేల పింఛన్ ఇస్తామన్నారు. దాని సంగతేమోగానీ ఉన్న రూ.2వేల పింఛన్ కూడా సక్రమంగా ఇవ్వడం లేదు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అని చెప్పి, ఉన్న బస్సులను రద్దుచేశారు. మహాలక్ష్మి పథకం కింద ప్రతి నెలా ఒక్కో మహిళకు రూ.2,500 చొప్పున ఇప్పటి వరకు రూ.27,500 బాకీ పడ్డారు. పుట్టిన ఆడబిడ్డలకు బంగారు లక్ష్మి పథకం అమలు చేస్తామని చెప్పి, ఇప్పటికీ ఇవ్వలేదు. బీసీ సంక్షేమానికి ఏటా రూ.20వేల కోట్లు కేటాయిస్తామని ఇచ్చిన హామీ ఏమైంది. గురుకుల విద్యార్థులకు మంచి భోజనం కూడా పెట్టలేని దుస్థితి నెలకొంది. విద్యా భరోసా కింద రూ.5 లక్షల బ్యాంకు గ్యారెంటీ కార్డు ఇస్తామన్న హామీ ఎందుకు అమలుచేయలేదు..? పది పంటలకు బోనస్ ఇస్తామని రాహుల్, రేవంత్ గొప్పగా ప్రకటించారు. ఇప్పుడు వరి పంటకు మాత్రమే, అది కూడా సన్న వడ్లకే అంటున్నారు. భూ కబ్జాలు చేసిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకుంటామని ఎన్నికల ముందు చెప్పిన రేవంత్.. వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదు. భూ దందా కోసమే మూసీ పునరుజ్జీవం చేపట్టారు. పేదల ఇళ్లు కూల్చకుండా కూడా మూసీ పునరుజ్జీవం చేపట్టవచ్చు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలుకు సంబంధించి ఆర్థిక వనరుల సమీకరణపై కాంగ్రెస్‌కు రూట్‌మ్యాప్ లేదు" అని కిషన్‌రెడ్డి విమర్శించారు. హామీల అమలుపై ప్రశ్నిస్తే, వ్యక్తిగత విమర్శలు చేయడం సీఎం రేవంత్‌కు అలవాటైపోయిందని మండిపడ్డారు. భాష సరిగా ఉంటే.. రుణమాఫీపై చర్చకు తాను సిద్ధమని రేవంత్‌కు సవాల్ విసిరారు. ఏం సాధించారని విజయోత్సవాలు జరుపుకుంటున్నారని ఎంపీ డీకే అరుణ.. కాంగ్రెస్‌పై మండిపడ్డారు.

చార్జ్‌షీట్‌లోని ప్రధానాంశాలు..


"కాళేశ్వరం పేరుతో అప్పుడు లక్ష కోట్ల దోపిడీ.. ఇప్పుడు మూసీ పేరుతో లక్షన్నర కోట్లకు ఎసరు. అప్పుడు పదేళ్లపాటు కే టాక్సు.. ఇప్పుడు అన్నింటా ఆర్‌ఆర్ టాక్సు పేదలకు అందని ఉచిత వైద్య ఫలాలు.. మార్పు రాలే.. బతుకు మారలే" అంటూ కాంగ్రెస్ వైఫల్యాలను బీజేపీ తన చార్జ్‌షీట్‌లో ఎండగట్టింది. ఎంపీలు ఈటల రాజేందర్, రఘునందన్‌రావు, నగేశ్, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు డాక్టర్ పాల్వాయి హరీశ్ బాబు, కె. వెంకటరమణారెడ్డితో పాటు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రైతు పండుగలు రైతులు చేసుకోవాలి: కొండా

వికారాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రైతు పండుగలను రైతులు చేసుకోవాలని, రాజకీయ పార్టీలు కాదని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విమర్శించారు. ఈ రోజు తెలంగాణ రైతాంగం బతికి ఉందంటే అది బీజేపీ చలవే అన్నారు. ధాన్యానికి మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ పాలనకు వ్యతిరేకంగా బీజేపీ చేపడుతున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం వికారాబాద్‌లో బైక్ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ యాత్రను ఎన్టీఆర్ చౌరస్తాలో ఎంపీ జెండా ఊపి ప్రారంభించారు.

"ప్రక్రియ కంటే కవిత్వగుణం ముఖ్యం!"

– సన్నిధానం నరసింహశర్మ



కవిగా, రచయితగా, విమర్శకునిగా, పరిశోధక సేవకునిగా, రాజమండ్రి గౌతమీ గ్రంథాలయం గ్రంథభాండారిగా, ఆత్మీయ స్నేహపరిమళాల్ని పంచిన గంధహృదయునిగా వైవిధ్య పాత్రల సమ్మేళనంతో సన్నిధానం నరసింహశర్మ గారి జీవనప్రస్థానం సాగుతోంది.

పశ్చిమ గోదావరి జిల్లా కుమారదేవంలో 1945 డిసెంబర్ 7న ఆయన జన్మించారు. గౌతమీ గ్రంథాలయంలో నాలుగు దశాబ్దాల పాటు వివిధ హోదాల్లో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించారు. లెక్కకుమిక్కిలి పరిశోధకులకు గ్రంథాలయ సేవలు అందించారు. 'అతడె గౌతమి, గౌతమి అతడు' అని అద్దేపల్లి రామ్మోహనరావు గారు ప్రస్తుతించేంతగా ఆయన ఆ లైబ్రరీతో మమేకమయ్యారు.

సన్నిధానం 'ప్రాణహిత', 'బ్రౌను ఉదాహరణం' కావ్యాల కర్త. 'పాతూరి నాగభూషణం జీవిత చరిత్ర', మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రిపై 'మధుస్మృతి', కేంద్ర సాహిత్య అకాడమీ భారతీయ సాహిత్య నిర్మాతలు పరంపరలో 'నేదునూరి గంగాధరం' మోనోగ్రాఫ్ రాశారు. 'ప్రమేయ ఝరి' ఆయన సాహిత్య వ్యాస సంపుటి. ఆరుద్ర, చలసాని ప్రసాద్ తనకి రాసిన లేఖల్ని పుస్తకాలుగా ప్రచురించారు. తెలుగు భాషలో అచ్చు అయిన మొదటి గ్రంథం 'నూరు జ్ఞానవచనాలు' (1747) పునర్ముద్రించారు. 'కాశ్మీర్ కీ లోక్ కథాయే', 'పంజాబ్ కీ లోక్ కథాయే', 'నలదమయంతి' హిందీ గ్రంథాలను తెలుగులోకి అనువదించారు.

వాడ్రేవు చినవీరభద్రుడు గారు ఒకచోట రాసినట్టుగా ఆయన 'ఎందరో మహాకవుల పద్యాలకు పల్లకిగా జీవిస్తున్న మనిషి.' పండిత శ్రేణికి ఆధునిక కవులకి వారధి వంటి సన్నిధానం ఈ ఏడాది డిసెంబర్ ఏడున ఎనభయ్యో సంవత్సరంలో అడుగిడనున్నారు. ఆ సందర్భంగా ఆయనతో సంభాషణ.

ఇంటర్వ్యూ ■ **నామాడి శ్రీధర్, ఒమ్మి రమేష్ బాబు**

సాహిత్యంతో మీకు ఏ వయస్సులో స్నేహం కుదిరింది? అది ఎలా వర్ధిల్లుతోంది?

నా 17వ ఏట అంటే 1962లో దేశభక్తి కవిత్వంగా కొన్ని కంద పద్యాల్ని రాశాను. కేవల పద్యనిర్మాణ సౌందర్యం నుండి నూతన భావభవనంలో ప్రవేశించడానికి కొంత కాలం పట్టింది. పద్యాలు కాక పద్య కవిత్వాలు రాయాలని తెలిసింది. క్రమంగా ఓ వైపు పత్రికల్లో వ్యాసాలు, మరో వైపు పుస్తక రచన సాగాయి. తొలి నాళ్ళలో శ్రీశ్రీ, సి.నా.రె ప్రభావం పడింది. నేదునూరి గంగాధరం, మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి, మల్లంపల్లి శరభయ్య ప్రోత్సహించారు. కొత్తపల్లి సత్యశ్రీమన్నారాయణ, జయధీర్ తిరుమలరావు, సతీష్ చందర్‌ల స్నేహ పరిమళాలు ఆఘ్రాణించాను. పరిశోధక వ్యాసాలు రాయడంతోపాటు పరిశోధక సమాచార సేవలు చేయడం, గౌతమీ జ్ఞాన ప్రవాహవేగంలో నిత్యం పునీత మయ్యాను.

రాజమండ్రి సాహిత్య వాతావరణం ప్రత్యేకతలు ఏమిటి?

విభిన్న సాహిత్యాభిప్రాయాలు, భావవైవిధ్యాలూ ఉన్నప్పటికీ ఒక సహజీవన వాతావరణం కొనసాగడం గొప్ప స్థాయి గల అంశం. వైయక్తిక శత్రుత్వం లేకుండా భాషా సాహిత్యాల భావతీవ్రతలు, చర్చలూ ఉండడం రాజమండ్రి ప్రత్యేకత. సాహిత్య విషయాల గురించి సీరియస్‌గా పట్టించుకుని కోర్టులకి వెళ్ళడం మామూలు సంగతి కాదు. సాహిత్య ఆలోచనా వైవిధ్యాలు మానవ విరోధాలు కాకపోవడం ఎంతో ఆహ్వానించదగ్గ విషయం!

ప్రాచీన సాహిత్యం, ఆధునిక సాహిత్యం ఈ విభాగాలపై మీ ప్రాధాన్యాలు, అభిప్రాయాలు ఎటువంటివి?

ప్రాచీన సాహిత్యం అది ఉద్భవించిన నాటికి ఆధునిక సాహిత్యం; ఆధునిక సాహిత్యం అది వచ్చిన తర్వాత కాలానికి ప్రాచీన సాహిత్యం. ఇవి కాల సంబంధితాలైనప్పుడు రెండిటికీ సమ ప్రాధాన్యం ఇవ్వాలి. కిటికీలు తెరచుకునే ఉండాలి. అన్నిటినీ అధ్యయనం చేసి మన సంపద ఇంతటిదా అని గర్వించగలగాలి.

పద్య కవిత్వం, వచన కవిత్వం – ఈ ప్రక్రియలపై మీకు నిర్దిష్టమైన అభిప్రాయాలు ఏమైనా ఉన్నాయా?

ఫలానా ప్రక్రియ నాదే అని కానీ మాదే అని కానీ అనుకోవడం సరైనది కాదు. ఒక్కొక్కళ్ళకీ ఒక్కొక్క ప్రక్రియా ప్రావీణ్యం ఉంటుంది. కాలాన్ని బట్టి, చదువుల్ని బట్టి కొన్ని ప్రక్రియలు సన్నిహితం అవుతాయి. అయితే నేడున్నది వచన కవితాయుగం అనడానికి సందేహం లేదు. సాహిత్య ప్రక్రియా స్వాతంత్ర్యం రచయితల జన్మహక్కుల్లాంటివి.

పండిత శ్రేణికి ఆధునిక కవులకి పొసగని కాలంలో మీరు ఇరుపక్షాలు మెచ్చే వారధి ఎలా అయ్యారు?

పద్యమంటే ఆధునిక కవులకి గిట్టదు. వచన కవిత్వమంటే పండిత శ్రేణికి పొసగదు. పద్యానికి వేయి ఏళ్ళ చరిత్ర ఉంది. వచన కవిత్వం కొన్ని ఏళ్ళ లోనే చరిత్ర సృష్టించుకుంది. ఆధునిక కవులు కాలానుగుణంగా, భావానుగుణంగా ప్రక్రియల్ని ఉపయోగించుకున్నారు. నిజానికి ప్రక్రియల మధ్య వైరం లేదు. పద్యం చచ్చిపోవాలని కోరుకోకూడదు. ఈ కాలానికి, ఈ చదువులకి, ఈ వర్తమాన భావజాలాలకూ పద్యం ప్రక్రియ సరిపోదని భావించేవారిని తప్పుపట్టకూడదు. ప్రక్రియను ఎన్నుకోవడం కవి స్వాతంత్ర్యానికి సంబంధించిన అంశం. అనుభూతి, నూతన భావన, వర్ణన, వ్యక్తీకరణలో కొత్తదనం తదితర కవిత్వగుణాల వల్ల కవిత్వాలు బతికి బట్టకడతాయి కాని ప్రక్రియల వల్లనే బతకవు. నా నవ్య భావావిష్కరణ ప్రయత్నాల వల్లనే ఇరుపక్షాలకీ వారధి అయ్యాను.

గౌతమీ గ్రంథాలయానికి వచ్చిన పరిశోధకుల్లో ప్రసిద్ధులు ఎవరు, వారి పరిశోధనా వైశిష్ట్యాల గురించి చెప్పండి?

సి.నా.రె మాకందాలు రాసే ముందు కొక్కొండ వారి బిల్వేశ్వరీయం జిరాక్స్ ప్రతిని నా ద్వారా తెప్పించుకుని చదివారు. కె.వి.ఆర్ పత్రికారంగంలో వివిధ కులాల పత్రికల్ని

> "ఫలానా ప్రక్రియ నాదే అని కానీ మాదే అని కానీ అనుకోవడం సరైనది కాదు. ఒక్కొక్కళ్ళకీ ఒక్కొక్క ప్రక్రియా ప్రావీణ్యం ఉంటుంది. కాలాన్ని బట్టి, చదువుల్ని బట్టి కొన్ని ప్రక్రియలు సన్నిహితం అవుతాయి. అయితే నేడున్నది వచన కవితాయుగం అనడానికి సందేహం లేదు. సాహిత్య ప్రక్రియా స్వాతంత్ర్యం రచయితల జన్మహక్కుల్లాంటివి."

అధ్యయనం చేశారు. ఆరుద్ర గౌతమీ గ్రంథాలయంలోని పాత పత్రికల్లో మరెక్కడా లేనివేమిటో చెప్పారు. బంగోరె ప్రాచీన గ్రంథాల ముఖపత్రాల పరిణామాల్ని తెలిపారు. దుమ్ము పట్టిన ఇరుకు గదిలో ఫ్యాన్ లేక ఊపిరి సలపని వాతావరణంలో చలసాని ప్రసాద్ చొక్కా తీసి ఒక బీరువా కొక్కెంకి పెట్టి శరీరంపై చెమటలు కమ్మిన అసౌకర్యంలో నేలమీద కూర్చుని పాత పత్రికల్లో శ్రీశ్రీని, కొడవటిగంటిని శోధించుకునే దృశ్యం మరచిపోలేనిది. జయధీర్ తిరుమలరావు తెలుగులో నిషేధ సాహిత్యంపై గొప్ప పరిశోధన చేశారు. జర్మనీ కొలోన్ విశ్వవిద్యాలయం నుండి మరియా మీస్ అనే పరిశోధకురాలు వచ్చారు. భారతీయ గ్రామీణ మహిళల మీద, పాలకొల్లు లేసు పరిశ్రమ మీద ఆమె పరిశోధన చేశారు.

గ్రంథాలయోద్యమం అనేది నిరంతరం సాగే ఉద్యమం కదా! ఇప్పటి పరిస్థితులు ఎలా ఉన్నాయి?

ప్రభుత్వ గ్రంథాలయాలు; గ్రంథాలయ సంస్థల శాఖా గ్రంథాలయాలు; కళాశాల, విశ్వవిద్యాలయ గ్రంథాలయాలు; ప్రయివేటు గ్రంథాలయాలు ఉన్నాయి. అయితే వీటి మధ్య సమన్వయం, ఇచ్చిపుచ్చుకోవడాలు, ధన సహాయాలు, గ్రాంట్లు విషయంలో చురుకైన పాత్ర వహించవలసిన పౌర గ్రంథాలయాల శాఖ ఆర్థికంగా సంపన్నం కానిదే నిరాశా అంశాలు మిగులుతూనే ఉంటాయి.

జానపద సాహిత్య వికాసంలో నేదునూరి గంగాధరం కృషి ఎటువంటిది?

నేదునూరి జానపద సాహిత్య సేవలు అనుపమానాలు. నేను ఆయన శిష్యుణ్ణి. అయిదారు సంవత్సరాలు ఆయనతో గడిపే మహాభాగ్యం నాకు లభించింది. కేంద్ర సాహిత్య అకాడమీ కోసం ఆయన మోనోగ్రాఫ్ రాశాను. గంగాధరం కాలంలో అంతా పద్య వాతావరణం. జానపద గేయాలను లొల్లాయి పదాలుగా తక్కువ పరచిన వారి ధోరణులతో విభేదించకుండానే తన జానపద సాహిత్య ఉద్ధరణ కార్యక్రమం కొనసాగించారు. వందల జానపద గేయాలను బాణీలతో పాడేవారు. ప్రాచీన కవుల పద్యాలనేకం కంఠస్థం చేశారు. అరసంలో గంగాధరం సభ్యులన్నది చాలామందికి తెలియదు. ఆయన జానపదాలను తొలిసారిగా ప్రకటించినది తెలంగాణా వారే.

'వెలుతురు పిట్టలు' కవి కొత్తపల్లి సత్యశ్రీమన్నారాయణ, మీరూ జంట కవుల్లా ఉండేవారు. ఆయన జ్ఞాపకాల్ని పంచుకోండి!

నిజానికి ఆయన పరిచయం నాకు ఏర్పడడం నా జీవితంలో కొత్త అధ్యాయమే. ఇద్దరం 'వాగర్థ సమాఖ్య' అనే సంస్థ పెట్టాం. సి.నా.రె, వేల్చేరు నారాయణరావు, బూదరాజు రాధాకృష్ణ ఇలా కొంతమంది ప్రముఖ కవి, పండిత, విమర్శకులతో సాహిత్య సభలు నిర్వహించాం. మైకులో సాహిత్య సభా ప్రచారం చేసేవాళ్ళం, వాల్ పోస్టర్లు వేసేవాళ్ళం కూడా. నేను నా 'ప్రాణహిత' కవితా సంపుటిని సత్యశ్రీమన్నారాయణకి అంకితం ఇచ్చాను. ఆయనతో నా అనుభవాలు రాస్తే ఓ పుస్తకమే అవుతుంది.

కొత్త తరం విద్యార్థులకి పూర్వ గ్రంథాల పట్ల మక్కువ కలిగించడానికి ఏదైనా ఉపాయం చెప్పండి!

పాఠ్య పుస్తకాల్లో పూర్వగ్రంథాల అవగాహనా పాఠాలు చేర్చాలి. ప్రాకృతిక వర్ణనలు, ప్రాచీన సంస్కృతిని వెల్లడించే పూర్వ కవిత్వాలు చిన్న చిన్న భాగాలుగా ఉండేటట్లు చూడాలి. ■

బొమ్మలు: అక్బర్

'అసిపె' పరిచయ సభ

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక సంయుక్త ఆధ్వర్యంలో వనపట్ల సుబ్బయ్య దీర్ఘకావ్యం 'అసిపె' పరిచయ సభ డిసెంబర్ 3 మధ్యాహ్నం 2గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. సభాధ్యక్షత పి. వహీద్ ఖాన్, అతిథులు గోరటి వెంకన్న, జూలూరు గౌరిశంకర్, గుంటూరు లక్ష్మీ నరసయ్య, ఎస్. రఘు, యాకూబ్, సంగిశెట్టి శ్రీనివాస్, సీతారాం, కోట్ల వెంకటేశ్వర రెడ్డి తదితరులు. వివరాలకు: 94927 65358.

నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక

దళిత కథ 2023 'కొమ్ము'

జంబూ సాహితి ప్రతి ఏటా వెలువరించే కథా వార్షిక సిరీస్‌లో భాగంగా కొమ్ము దళిత కథ 2023 ఆవిష్కరణ సభ డిసెంబర్ 5న పీజీ సెమినార్ హాల్, కోఠి ఉమెన్స్ కాలేజ్, హైదరాబాద్‌లో జరుగుతుంది. ఆవిష్కర్త సూర్యా ధనంజయ, ముఖ్య అతిథి తిప్పర్తి యాదయ్య, గౌరవ అతిథి సతీష్ చందర్, వక్త కాశీం, అధ్యక్షత సిద్దెంకి యాదగిరి. సభలో జూలూరి గౌరీ శంకర్, కోయి కోటేశ్వర రావు, గడ్డం మోహన్ రావులు పాల్గొంటారు.

జంబూ సాహితీ

కథా ఉత్సవం

నాలుగు కథా సంకలనాల ఆవిష్కరణ ఒకేసారి జరుగుతున్నది. 'దీపావళి ప్రత్యేక కథలు 2024', 'ఈ కాలపు తెలుగు కథ', 'ఆధునిక తెలుగు కథ', 'అపురూప చింతన కథలు' – ఈ కథా సంకలనాల ఆవిష్కరణ సభ 'కథా ఉత్సవం' పేరుతో డిసెంబర్ 7 సాయంత్రం 6 గంటల నుంచి హైదరాబాద్ నాంపల్లి తెలుగు యూనివర్సిటీలో జరుగుతుంది. వీటి సంపాదకులైన మహమ్మద్ ఖదీర్ బాబు, కుమార్ కూనపరాజు, వెంకట్ సిద్ధారెడ్డి, మహి బెజవాడ, అరిపిరాల సత్యప్రసాద్, అజయ్ ప్రసాద్ ఈ సంకలనాల లోని రచయితల కృషిని వివరిస్తారు.


కుమార్ కూనపరాజు

తెరసం పదేళ్ళ సాహిత్య సభలు

తెలంగాణ రచయితల సంఘం పదేళ్ళ సాహిత్య సభలు డిసెంబర్ 8 ఉ.10.30 నుంచి సా.7.30వరకు రవీంద్రభారతి, హైదరాబాద్‌లో జరుగుతాయి. ప్రారంభ సమావేశంలో నాళేశ్వరం శంకర్, నందిని సిధారెడ్డి, దేశపతి శ్రీనివాస్ తదితరులు పాల్గొంటారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 'తెలంగాణ అస్తిత్వ సాహిత్యం – వర్తమాన సందర్భం' అంశంపై సాహిత్య సదస్సు ఉంటుంది. పొట్లపల్లి శ్రీనివాస రావు, సి. కాశీం తదితరులు పాల్గొంటారు. సాయత్రం పలు పుస్తకావిష్కరణలు, కవి సమ్మేళనం ఉంటాయి.

తెలంగాణ రచయితల సంఘం

సారవంతం



ముత్తైమంత సేపైనా
కరిగిపోతున్న ఆ దృశ్యాలని అల్లుకోని
ఒలికిపోని భయాన్ని
దిగూట్లో ఆరిపోయిన దీపం కింద దాచిపెట్టి
కొంచమైనా సారవంతమవుతాను

నక్షత్రాల వెలుతురు పడను అంటని దోసిళ్ళు
కన్నీటి శబ్దం వినని శ్రవణాలు
నిరంతరం జీవధారను వెక్కిరిస్తూనే ఉంటాయి
ఐనా చూపులను ఒడిసిపట్టుకుని
మరో రూపంలోకి నడిచిపోవాలి
ఈ మట్టి రోజొక కొత్త నిర్వచనం ఇస్తూనే ఉంటుంది

గతాలు చూర చూరైన ఆకుల శబ్దమై
పలుకరిస్తాయి
మెత్తటి పూలలాంటి సన్నివేశాలు
కేవలం నిద్రలోనే మెలుకువతో కదులుతాయి

దుఃఖంతో ఒంటికాలి నడక ఎత్తుగడ్డ కొసకే
నీడలు మనిషి ఆలోచనలను
అపసవ్య దిశలోకి మలపనంతవరకే

ఒక్కొక్క దేహపు వాసనలు కరిగిపోతూ
నడిచే తొవ్వల మీది ముళ్లను సవరిస్తాయి
సంకేతాలను అర్థం చేసుకోవడమే జీవితం

■ **వేముగంటి మురళి**
93922 56475

హరిశ్చంద్రుడి కథాకమామిషు

పురాణాల ప్రకారం హరిశ్చంద్రుడు షట్చక్రవర్తులలో మొదటివాడు. ఈ చక్రవర్తి అస్తిత్వం లోని నిజానిజాలు ఏమైనా అన్ని భారతీయ భాషల్లోనూ హరిశ్చంద్రుని గురించి అనేక కావ్యాలు వచ్చాయి. తెలుగుకు సంబంధించినంత వరకు 15వ శతాబ్దిలో గౌరన రాసిన 'హరిశ్చంద్రోపాఖ్యానము' మొదటిది కాగా, 17వ శతాబ్దిలో రామరాజు భూషణుడు రాసిన 'హరిశ్చంద్ర నలోపాఖ్యానం' అనే కావ్యం రెండవది. ఆధునిక కాలంలో కందుకూరి వీరేశలింగం రాసిన నాటకం 1899లో వచ్చింది. ఒక నాటక కంపెనీ వాళ్ల శంకర కవి రాసిన హరిశ్చంద్రోపాఖ్యానాన్ని నాటకీకరించమని కోరగా కందుకూరి రెండు వారాల్లో నాలుగు అంకాలు పూర్తి చేశారు. కానీ ఎందు చేతనో నాటక కంపెనీవాళ్లు ఆ నాటకాన్ని ప్రదర్శించలేదు. అసమగ్రంగా ఉన్న నాటకాన్ని కాకినాడ లోని మరో నాటక కంపెనీ వారి కోరిక మేరకు వీరేశలింగం పూర్తిచేయగా ఆ ఐదు అంకాల ఆ నాటకాన్ని ప్రదర్శించారు. బలిజేపల్లి లక్ష్మీకాంతం నాటకం వచ్చే వరకు కందుకూరి రాసిన నాటకమే తెలుగు ప్రాంతాల్లో ప్రదర్శింపబడేది. ఆంధ్ర వాఙ్మయ చరిత్ర ప్రకారం తెలుగులో వచ్చిన హరిశ్చంద్ర నాటకాలు 26గా గతంలో రికార్డు కాగా, ఈ విషయంలో పరిశోధన చేసిన డా. జ్యోతుల కృష్ణబాబు 50 నాటకాల్ని సేకరించాడు. హరిశ్చంద్ర నాటకంపై ఇంకా వాసా ప్రభావతి, పి.యస్.ఆర్. అప్పారావు కూడా పరిశోధన చేశారు.

"హరిశ్చంద్రుని కథ దాన్ని కల్పించిన నాటి జాతి హృదయానికి ప్రతిబింబం" అని గురజాడ అన్నారు. ఇది కేవలం కల్పిత కథగా గురజాడ భావించారని దీని అర్థం. అలాగే నార్ల వెంకటేశ్వరరావు కూడా 'నరకంలో హరిశ్చంద్రుడు' అనే తన 26 పేజీల నాటకానికి 36 పేజీల పీఠిక రాసి దీన్ని కల్పితగాథగా సశాస్త్రీయంగా నిరూపించే ప్రయత్నం చేశారు. ఐతరేయ బ్రాహ్మణం, రామాయణం, భారతం, భాగవతం, మార్కండేయ పురాణం, వాయుపురాణం, పద్మపురాణం, శివ పురాణం, దేవీ భాగవతం తదితర పురాణాల్లో హరిశ్చంద్రుని ప్రసక్తి వస్తుంది. ఈ పురాణాల ప్రకారం సత్యహరిశ్చంద్రుడు, అసత్య హరిశ్చంద్రుడు, రాజర్షి హరిశ్చంద్రుడు ముగ్గురు వేర్వేరు హరిశ్చంద్రులు కన్పిస్తారు. ఐతరేయ బ్రాహ్మణంలో ప్రస్తావనకు వచ్చిన హరిశ్చంద్రుడు సత్యవంతుడు కాదు. ఇతనికి వందమంది భార్యలున్నా సంతానం లేదు. నారదుని సలహాపై వరుణ దేవుణ్ణి ప్రార్థించి "నాకొక పుత్రుణ్ణి ప్రసాదిస్తే వాడిని యజ్ఞపశువుగా నీకు సమర్పిస్తానని" సంతానాన్ని పొందుతాడు. కాని వాగ్దానాన్ని నెరవేర్చకుండా వాయిదాలు వేస్తుండటంతో వరుణుడు కోపగించి ఇతనికి 'జలోదర' వ్యాధిని సంక్రమింప చేస్తాడు. చివరకు హరిశ్చంద్రుడి కొడుకు రోహితుడు ఒక బ్రాహ్మణ కుమారుణ్ణి నూరు ఆవులిచ్చి కొనుక్కొని తనకు బదులుగా అతణ్ణి బలి ఇవ్వటానికి పూనుకోగా దేవతలు ప్రత్యక్షమై ఆ బాలుణ్ణి రక్షించి హరిశ్చంద్రుడికి వ్యాధి నుంచి విముక్తి కలిగిస్తారు. హరిశ్చంద్రుని భార్య, కుమారుడి పేర్లలోనూ వివిధ పురాణాల్లో వ్యత్యాసాలున్నాయి. 'శివపురాణం' హరిశ్చంద్రుని భార్య సత్యవతి అని పేర్కొనగా, 'మార్కండేయ పురాణం' శైబ్య అని, గౌరన కావ్యం చంద్రమతి అని పేర్కొన్నాయి. మహాభారతంలో 'ఔసీనరి' అని చెప్పబడింది. వంద మంది భార్యల్లో ఒక్కరి పేరు కూడా ఐతరేయ బ్రాహ్మణం చెప్పలేదు.

> "హరిశ్చంద్రుని కథ దాన్ని కల్పించిన నాటి జాతి హృదయానికి ప్రతిబింబం" అని గురజాడ అన్నారు. ఇది కేవలం కల్పిత కథగా గురజాడ భావించారని దీని అర్థం. అలాగే నార్ల వెంకటేశ్వరరావు కూడా 'నరకంలో హరిశ్చంద్రుడు' అనే తన 26 పేజీల నాటకానికి 36 పేజీల పీఠిక రాసి దీన్ని కల్పిత గాథగా సశాస్త్రీయంగా నిరూపించే ప్రయత్నం చేశారు. ఐతరేయ బ్రాహ్మణం, రామాయణం, భారతం, భాగవతం, మార్కండేయ పురాణం, వాయుపురాణం, పద్మపురాణం, శివ పురాణం, దేవీభాగవతం తదితర పురాణాల్లో హరిశ్చంద్రుని ప్రసక్తి వస్తుంది.

తెలుగులో యక్షగానాలుగా, హరికథలుగా, వచన కావ్యాలుగా కూడా హరిశ్చంద్రుడి కథలు వచ్చాయి. విశ్వనాథ సత్యనారాయణ కూడా 'కావ్య – వేద హరిశ్చంద్ర నాటకములు' అని ఒక పుస్తకం వెలువరించారు.



ఎన్ని నాటకాలున్నా తెలుగునాట బలిజేపల్లి లక్ష్మీకాంతం నాటకమే ప్రాచుర్యంలో ఉన్నది. అందులోని పద్యాలు ప్రజల నాలికలపై నాట్యమాడాయి. హరిశ్చంద్ర పాత్రధారులుగా బందా కనకలింగేశ్వరరావు, పూవుల సూర్యనారాయణ, చీమకుర్తి నాగేశ్వరరావు లాంటివారు విస్తృతంగా నటించినా అబ్బూరి వరప్రసాద్ అనే నటుడు హరిశ్చంద్రుని పాత్రలోకి వచ్చిన 50వ దశకంలో బలిజేపల్లి వారి పద్యాలతో పాటు గుర్రం జాషువా స్మశాన వాటిక కావ్యం లోని 6 పద్యాల్ని కాటిసీనులో జొప్పించి పాడటం ప్రారంభించాడు. ఆ తర్వాత బండారు రామారావు అనే నటుడు వాటికి అద్భుతమైన బాణీలు సమకూర్చుకుని తెలుగు నాటక రంగంలో హరిశ్చంద్ర నాటకానికి ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చాడు. "ఇచ్చోటనే సత్కవీంద్రుల కమ్మని కలము..."; "ఆకాశంబున కారుమబ్బులు ఆవరించె"; "ముదురు తమస్సులో మునిగిపోయిన..."; "ఇచట అస్పృశ్యత సంచరించుటకు తావే లేదు"; "ఎన్నో యేళ్లు గతించిపోయినవి గాని ఈ స్మశాన స్థలిన్"; "మొన్న మొన్ననే దేహంబొర్చి" –ఈ ఆరు జాషువా పద్యాలతో బలిజేపల్లివారి హరిశ్చంద్ర నాటకం మరింత సంపద్వంతమైంది.

తన అనుమతి లేకుండా తన కావ్యంలోని పద్యాలు వాడుకుంటున్నాడని కొంత ఆగ్రహం చెందిన జాషువా వినుకొండలో జరిగిన నాటక ప్రదర్శనకు ప్రేక్షకునిగా వెళ్లి బండారు రామారావు పాడిన పద్యాలు విని పరమానందం చెంది వేదికపైకి వెళ్లి "నా పద్యాలకు సార్థకత కల్పించావు. వాటిని నీ ఇష్టం వచ్చినట్లు వాడుకో" అని చెప్పాడట. బండారు రామారావు తర్వాతి కాలంలో హరిశ్చంద్ర పాత్రధారిగా వచ్చిన డి.వి. సుబ్బారావు ఈ పద్యాల బాణీని మరింత మెరుగు పరచటమేగాక ఆనాటికి ఉచ్ఛస్థితిలో ఉన్న తిరుపతి వెంకటకవుల పాండవోద్యోగ విజయాన్ని సైతం వెనక్కునెట్టి హరిశ్చంద్ర నాటకాన్ని ప్రథమ స్థానంలోకి తెచ్చాడు. డి.వి. సుబ్బారావు తర్వాత అతని మనుమడు జూనియర్ డి.వి. సుబ్బారావు కూడా ప్రస్తుతం ఆ పాత్రలో రాణిస్తున్నాడు. ఇంకా మారంరెడ్డి సుబ్బారెడ్డి, బండారు రవి కుమార్, సైదులు, చల్లా వెంకటేశ్వర్లు తదితర నటులు హరిశ్చంద్ర పాత్రలు ధరిస్తున్నారు. హరిశ్చంద్ర పాత్రధారి శ్రీకాకుళానికి చెందిన మంగాదేవిని ప్రత్యేకంగా పేర్కొనాలి. స్త్రీ పాత్రల్ని పురుషులు ధరించటం చాలాసార్లు జరిగినా ఒక స్త్రీ హరిశ్చంద్ర పాత్ర ధరించటంతోపాటు ఖ్యాతినొందిన పురుష పాత్రధారుల కన్నా మిన్నగా పేరుపొందుతున్నది.

■ **చెరుకూరి సత్యనారాయణ**


మెచ్చుకున్నాడో, తిట్టాడో అర్థం కాలేదు!

నా మొదటి పుస్తకం

■ కొండేపూడి నిర్మల



నా మొదటి కవితా సంకలనం సందిగ్ధ సంధ్య 1988లో వచ్చింది. అందులో 15 కవితలున్నాయి. 'ఒక్క నేనే ఇన్ని ముక్కలు', 'హలోలు', 'ముల్లు' లాంటి కవితలు జనం లోకి బాగా వెళ్ళాయి. 'ఈ సంప్రదాయం మాకొద్దు' అనే కవితకి తాపీ ధర్మారావు అవార్డు వచ్చింది. అయినా కానీ సంకలనం వేసే ఆలోచన, చొరవా నాకు రాలేదు. "పుస్తకం వెయ్యాల్సిందే" అన్న ప్రతిపాదన తెచ్చింది పోనుగోటి కృష్ణారెడ్డి. ప్రచురణ బాధ్యత కూడా అతనే తీసుకున్నాడు. ఆరోజు అతను పట్టుబట్టి వుండకపోతే నాకున్న సంశయాలకి, బద్ధకానికి మొదటి పుస్తకం ఎన్నాళ్ళకి వచ్చేదో తెలియదు. సరే, పుస్తకం పేరు మొదట 'అల' అని అనుకున్నాం. "బాలేదు మరీ ఫ్లాట్‌గా వుంది" అన్నాడు అఫ్సర్. ముందుమాట ఎవరు రాయాలి అని ఆలోచన వచ్చేసరికి వేగుంట మోహన ప్రసాద్ గుర్తొచ్చారు. ఒక మిట్ట మధ్యాహ్నం ఎండలో వాళ్ళింటికి వెళ్ళి, పుస్తకం చేతిలో పెట్టి వచ్చేస్తుంటే, "ఆగమ్మా, ఆ ఫేన్ కింద కూచో? కవిత్వానికి అంత చెమట పడితే ఎలా" అని మందలించి కూచో పెట్టారు. మొహమాటంగా కూచున్నాను. పుస్తకంలో కొన్ని పేజీలు తిరగేసి, "ఓహో, బాగా రాస్తున్నావు కంటిన్యూ చెయ్యి" అనగానే అంత పెద్ద కవి మెచ్చుకున్నాడన్న సంతోషమో కంగారో ఏమిటో గాని చేతిలో నీళ్ళ గ్లాసు ఒలికిపోయింది. "సారీ సారీ సారీ" అంటూ తల వెనక్కి తిప్పకుండా వచ్చేశాను. వారం రోజుల కల్లా 'మో' ఒక పెద్ద వ్యాసం అధివాస్తవిక ధోరణిలో రాశారు. "ఈయన తిడుతున్నారో, మెచ్చుకున్నారో చెప్పవా?" అని కొంత మందిని అడిగాను. "దటీజ్ మో" అన్నారు అందరూ. తిరువూరులో ఉన్న నేను పుస్తకం పని కోసం హైదరాబాద్ వచ్చినప్పుడల్లా ఆంధ్రజ్యోతిలో కలిసే వాళ్ళం. కృష్ణారెడ్డి, అఫ్సర్, నేను, ఘంటసాల నిర్మల కలిసి ప్రూఫ్ రీడింగ్ చేశాం.



కవర్ పేజీ కోసం చేతికి దొరికిన ఒక సముద్రం బొమ్మ సెలక్ట్ చేశాం. సముద్రం మీద వున్న సంధ్య ఉదయం అయితే బావుంటుందా సాయంత్రం అయితే బావుంటుందా అని మళ్ళీ సందేహం. చివరికి 'సందిగ్ధ సంధ్య' అని పెట్టేసాను. విజయవాడ బస్టాండ్ దగ్గర మమతా హోటల్‌లో ఆవిష్కరణ. సభకి పిలవడానికి పురాణం సుబ్రహ్మణ్య శర్మ దగ్గరికి వెడితే ఆయన ఎడాపెడా మెచ్చుకుని తను మాట్లాడతానని ప్రకటించారు. సభలో నండూరి సుబ్బారావు, పురాణం, పన్నాల సుబ్రహ్మణ్యం, తుర్లపాటి కుటుంబరావు గార్లు మాట్లాడారు. తర్వాత ఒకసారి ఏదో సభలో మో గారు కనిపించి "ఆ పుస్తకం పేరు భలే పెట్టావే, కవిత్వం కంటే నీకే బాగా మ్యాచవుతుంది" అన్నారు. అది కూడా పొగడ్తా తెగడ్తా అనేది అర్థం కాలేదు. మొత్తానికి ఆ చిన్న పుస్తకం చాలా గుర్తింపు తెచ్చిపెట్టింది. దాని స్ఫూర్తితో రెండేళ్లలోనే 'నడిచే గాయాలు' వేశాను.



మిస్సెస్ మామ్..

సహజ గర్భధారణతో పాటు సహజ ప్రసవంపై అవగాహన కల్పిస్తూ కిమ్స్ కడల్స్ ఆస్పత్రి గైనకాలజీ విభాగం ఆధ్వర్యంలో ఫ్యాషన్ షో నిర్వహించారు. డాక్టర్ కె.శిల్పిరెడ్డి నార్మల్ డెలివరీ ప్రాధాన్యతను వివరించారు.

- నార్సింగ్ (ఆంధ్రజ్యోతి)



రెజీనా

ఈషారెబ్బా

ఫ్యాషన్ మెరుపులు.. తారల తళుకులు..

నగరంలోని ఓ హోటల్‌లో జరిగిన ఫ్యాషన్ షో ఆకట్టుకుంది. చీరకట్టులో కొందరు.. మోడ్రన్ డ్రెస్సుల్లో ఇంకొందరు క్యాట్‌వాక్ చేస్తూ మోడళ్లు ఆకట్టుకున్నారు. సినీ తారలు రెజీనా, ఈషారెబ్బా ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.



చల్లటి గాలులతో జర భద్రం

- పెరుగుతున్న ఆస్తమా, సీవోపీడీ సమస్యలు
- వాకింగ్, జాగింగ్, స్నానం చేసే సమయాల్లో జాగ్రత్తలు అవసరం

హైదరాబాద్ సిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): శీతల గాలులతో వాతావరణం చల్లగా ఉంటోంది. ఇలాంటి వాతావరణంలో వాకింగ్, చల్లటి నీళ్లతో స్నానం అంత శ్రేయస్కరం కాదని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. శరీర ఉష్ణోగ్రత సహజంగా 97.7 ఫారెన్‌హీట్ నుంచి 98.5 ఫారెన్‌హీట్ వరకు సాధారణంగా భావిస్తామని, చల్లటి వాతావరణంతో కొన్నిసార్లు 95 ఫారెన్‌హీట్ కంటే తక్కువ ఉష్ణోగ్రత ఉండే అవకాశాలు ఉన్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. దీనివల్ల రోగులు వణికిపోవడం, గుండె స్పందనలు, బీపీ తగ్గడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు వంటివి వస్తాయని తెలిపారు. రక్తనాళాల్లో సరఫరా తగ్గి కాళ్లు, చేతి వేళ్ల తిమ్మిర్లు

మిగతా 8వ పేజీలో..

ఇన్‌హేలర్ వెంట ఉండాలి



ఆస్తమా బాధితులు ప్రయాణ సమయంలో ఇన్‌హేలర్‌ను వెంట ఉంచుకోవాలి. ఆస్తమా తీవ్రత పెరిగితే వెంటనే ఉపయోగించాలి. చల్లటి గాలులతో సీవోపీడీ, ఆస్తమా తీవ్రత పెరుగుతాయి. రైనో వైరస్, ఇన్‌ఫ్లూఎంజా, ఫ్లూ వైరస్ దాడి చేసే ప్రమాదం ఉంది. గొంతునొప్పి ఉంటే వేడి చేసిన నీటిలో కొంచెం ఉప్పు వేసి పుకిలించి ఉమ్మేయాలి. ఇలా ఉదయం, సాయంత్రం చేస్తే గొంతు నొప్పి తగ్గే అవకాశముంది. దగ్గు, జలుబుతో పాటు ముక్కు కారుతున్నా గోరువెచ్చటి నీటినే తాగాలి.

- డాక్టర్ మేఘనా సుభాష్, ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్టు, మెడికవర్ ఆస్పత్రి

హాస్టళ్లు.. సురక్షితమేనా?

పరిశీలనకు జీహెచ్ఎంసీ నిర్ణయం



రాష్ట్రంలోని పలుచోట్ల ప్రభుత్వ గురుకులాలు, వసతి గృహాల్లో విద్యార్థులు అస్వస్థతకు గురవుతోన్న నేపథ్యంలో జీహెచ్ఎంసీ అప్రమత్తమైంది. గ్రేటర్‌లోని గురుకులాలు, వసతి గృహాల్లోని పరిస్థితుల పరిశీలనకు రంగం సిద్ధం చేస్తోంది. అకస్మిక తనిఖీలు చేపట్టాలని హెల్త్ విభాగం నిర్ణయించింది. ఏ ప్రాంతంలో.. ఏ రోజు తనిఖీలు నిర్వహించాలన్నది ఉన్నతాధికారులు నిర్ణయిస్తారు.

- త్వరలో ఆకస్మిక తనిఖీలు
- మెజార్టీ వసతి గృహాలు, గురుకులాల్లో అధ్వాన పరిస్థితులు
- మెరుగుపర్చాలని ఇప్పటికే నోటీసులు
- నగరం హాస్టళ్లలో 37 వేల మంది విద్యార్థులు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని హాస్టళ్ల తనిఖీలకు యంత్రాంగం సిద్ధమవుతోంది. ఆగస్టులో నిర్వహించిన తనిఖీల్లో మెజార్టీ వసతి గృహాల్లో పరిస్థితులు అధ్వానంగా ఉన్నట్టు అధికారులు గుర్తించారు. పరిస్థితి మెరుగుపరుచుకోవాలని సూచిస్తూ 23 హాస్టళ్లకు నోటీసులిచ్చారు. ఆయా హాస్టళ్లలో పరిస్థితులు మెరుగయ్యాయా? పిల్లలకు నాణ్యమైన ఆహారం అందుతోందా.. లేదా..? అన్నది మరోసారి పరిశీలించాలని భావిస్తున్నారు. నగరంలో మైనార్టీ రెసిడెన్షియల్స్, ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లు, గురుకులాల్లో దాదాపు 37 వేల మంది చదువుతున్నారు. ఒకటో తరగతి నుంచి డిగ్రీ వరకు చదివే విద్యార్థులు ఆయా హాస్టళ్లలో ఉంటున్నారు.

పురుగులు పట్టిన..

జీహెచ్ఎంసీ అధికారులు గతంలో నిర్వహించిన తనిఖీల్లో నగరంలోని మెజార్టీ ప్రభుత్వ వసతి గృహాల్లో అధ్వాన పరిస్థితులున్నాయని గుర్తించారు. కిచెన్‌లలో అపరిశుభ్రత, కాలం చెల్లిన ఆహార పదార్థాల వాడకం, ప్రాంగణాల్లో చెత్తా చెదారం.. దుర్వాసన.. కూరగాయలు, ఇతరత్రా రా మెటీరియల్‌ను ప్రమాణాలు పాటించకుండా నిల్వ చేస్తున్నట్టు ఫుడ్ సేఫ్టీ అధికారులు(ఎఫ్ఎస్ఓ) గుర్తించారు. 28 హాస్టళ్లలో తనిఖీలు నిర్వహించగా కొన్నిచోట్ల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. భోజనం తయారీకి వినియోగిస్తున్న ఆహార పదార్థాలతోపాటు బియ్యం, తాగునీరు, వంట గదులు, వసతి గృహాల్లో పరిసరాలను అధికారులు పరిశీలించారు. వంటలో వినియోగించే పిండి, పప్పులో పురుగులున్నాయని, చట్నీ, ఇతర అవసరాల కోసం వినియోగిస్తోన్న పల్లీలు, పుట్నాల పప్పు సరిగా లేదని గతంలో గుర్తించారు. రెండు హాస్టళ్లలో తాగునీరూ ప్రమాణాల ప్రకారం లేదని తేలింది. కూరలు, సాంబార్ కొన్ని చోట్ల నాణ్యంగా లేవని నిర్ధారించారు. కూరగాయలు సరిగా నిల్వ చేయకుండా.. కుళ్లినవీ వంటలో వినియోగిస్తున్నట్టు తేల్చారు. చాలా చోట్ల సిబ్బందికి యాప్రాన్‌లు, గ్లోవ్స్ లేవని గుర్తించారు. ఈ నేపథ్యంలో ప్రమాణాలు పాటించాలని, పరిశుభ్రతకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. నాణ్యమైన, తాజా కూరగాయలు, ఆహార పదార్థాలతో భోజనం తయారు చేయాలని పేర్కొన్నారు. కొన్ని చోట్ల దోమల తీవ్రతా ఎక్కువగా ఉన్నట్టు గుర్తించిన అధికారులు.. యాంటీ లార్వల్ ఆపరేషన్ చేపట్టాలని ఎంటమాలజీ విభాగానికి సూచించారు. తనిఖీల ద్వారా హాస్టళ్లలో పరిస్థితి ఎలా ఉందన్నది తెలుతుందని, మార్పు లేని పక్షంలో నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించిన అనంతరం చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారొకరు చెప్పారు.

గతంలో తనిఖీలు నిర్వహించిన అధికారులు (ఫైల్)

గతంలో తనిఖీ చేసిన ప్రభుత్వ హాస్టళ్లలో కొన్ని..

- గోల్కొండ, కుషాయిగూడ, నాచారం, మౌలాలి, గోకుల్ ప్లాట్స్ చందానగర్, ఇబ్రహీంబాగ్, బహదూర్‌పురా, అసిఫ్‌నగర్, ముషీరాబాద్, మొహల్లా ప్రాంతాల్లోని తెలంగాణ మైనార్టీ స్కూల్/కాలేజ్ రెసిడెన్షియల్స్
- తెలంగాణ ఎస్టీ హాస్టల్, కుత్బుల్లాపూర్.
- సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహం, గౌలిదొడ్డి
- జవహర్ నవోదయ విద్యాలయ, నల్లగండ్ల

ఇవీ వివరాలు..

హాస్టల్/ గురుకులం	సంఖ్య	విద్యార్థులు
మైనార్టీ	80	16000
ఎస్టీ	9	3800
ఎస్సీ	6	4200
బీసీ	32	12960

మాలల సింహగర్జన సైడ్‌లైట్స్



రెజిమెంటల్‌బజార్, తిరుమలగిరి, మారేడుపల్లి, అడ్డగుట్ట, డిసెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహించిన మాలల సింహగర్జనకు జనం అధిక సంఖ్యలో తరలివచ్చారు. వర్షం సైతం లెక్కచేయకుండా సభలో పాల్గొన్నారు.

- రైళ్లలోనే ఎక్కువ మంది సభకు వచ్చారు.
- సభకు వచ్చిన వారితో పికెట్ పరిసరాలు కిక్కిరిసిపోయాయి.
- నారాయణఖేడ్‌కు చెందిన ఓ వ్యక్తి తన ద్విచక్ర వాహనంపై ఏసుక్రీస్తు అందరి ప్రభువు అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ సభా ప్రాంగణం చుట్టూ తిరుగుతూ కనిపించాడు.
- సభాప్రాంగణంలో కాకా వెంకటస్వామికి చెందిన హోర్డింగ్స్ ఎక్కువగా కనిపించాయి.



నమఃశివాయ

కార్తీకమాసం చివరిరోజు కావడంతో ఆదివారం నగరంలోని శివాలయాలు భక్తులతో కళకళలాడాయి. కూకట్‌పల్లి వివేకానందనగర్ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ఇలా శివుడికి క్షీరాభిషేకం చేశారు.

మీ ఆస్తులు మెట్రోరైలు కోసం..

- ఓల్డ్‌సిటీలో అధికారుల పర్యటన
- బాధితులకు ఇళ్లు, భవనాలపై వివరాల అందజేత
- తాజాగా మరో 200 ఆస్తులకు నోటిఫికేషన్ జారీ

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పాతబస్తీలో మెట్రో రైలు నిర్మాణానికి సంబంధించిన పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రెండోదశలో ప్రతిపాదించిన 5 కారిడార్లలో ఒకటైన ఓల్డ్‌సిటీ మార్గంపై హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రోరైల్ లిమిటెడ్ (హెచ్ఏఎంఎల్) అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేర కు హెచ్ఏఎంఎల్ అధికారులు వడివడిగా ముందుకు సాగుతున్నారు. ఇందులో భాగంగా 7.5 కిలోమీటర్ల నిర్మాణానికి కావాల్సిన ఆస్తుల నోటిఫికేషన్‌ను విడతల వారీగా విడుదల చేస్తూ వస్తున్నారు. మొత్తం 1100 ఆస్తుల సేకరణలో భాగంగా నవంబరు 16 వరకు 600 ఆస్తులకు నోటిఫికేషన్ ఇవ్వగా, శనివారం మరో 200కు జారీ చేశారు. ఇప్పటివరకు మొత్తం 800 ఆస్తులకు నోటిఫికేషన్ ఇవ్వగా.. మరో 300 వరకు మిగిలి ఉన్నాయి.

కొలతలు, మ్యాపులతో లెక్కలు

పాతబస్తీలో ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల పనులను చేపడుతున్న విషయం తెలిసిందే. రూ.2,741 కోట్ల వ్యయంతో ఈ మార్గంలో పనులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఎంజీబీఎస్ స్టేషన్ దాటిన తర్వాత దారుల్‌షిఫా, ఆలిజా కోట్ల, హరిబౌలి, మీర్ మోమిన్‌దైరా, లాల్‌దర్వాజా మోడ్, అలియాబాద్ జెండా, ఫలక్‌నుమా మీదుగా చాంద్రాయణగుట్ట వరకు కారిడార్‌ను నిర్మిస్తున్నారు. అయితే ఈ మార్గంలో రోడ్డు మధ్య నుంచి రెండు వైపులా 100 మీటర్ల చొప్పున ఉన్న ఆస్తులు సేకరిస్తున్నట్లు హెచ్ఏఎంఎల్ అధికారులు ఇప్పటికే ప్రకటించారు. ఈ క్రమంలో గతంలో డ్రోన్, ఫిజికల్ సర్వేలో పరిశీలించిన ఆస్తులను మరోసారి యజమానులకు తెలియజేస్తున్నారు. మెట్రో

మిగతా 8వ పేజీలో..



దారుల్‌షిఫా ప్రాంతంలో పరిశీలిస్తున్న అధికారులు

సీరియల్ నటి శోభిత ఆత్మహత్య

- ఏడాదిన్నర క్రితమే పెళ్లి
- ఆమె మృతిపై అనుమానాలు



శోభిత ఫైల్

రాయదుర్గం/హైదరాబాద్ సిటీ, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): కన్నడ సీరియల్‌నటి శోభిత కొండాపూర్‌లోని తన ఫ్లాట్‌లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె మృతిపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం హస్సన్ జిల్లా సకిలేష్‌పూర్‌కు చెందిన శోభిత పేద కుటుంబానికి చెందినవారు. నలుగురు అక్కాచెల్లెళ్లు, ఒక అన్న ఉన్నారు. తండ్రిలేరు. తల్లి కష్టపడి కొడుకు, కూతుళ్లను పెద్ద చేసింది. పదోతరగతి వరకు మాత్రమే చదివిన శోభిత కొంతకాలం కన్నడంలో పలు సీరియల్స్‌లో నటించింది.

మ్యాట్రిమోనీ పరిచయంతో పెళ్లి..

తుక్కుగూడకు చెందిన సుధీర్‌రెడ్డి గచ్చిబౌలిలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి తల్లిదండ్రులు లేరు. సోదరి మాత్రమే ఉంది. పెళ్లి సంబంధాలు చూసేవారు లేకపోవడంతో సుధీర్‌రెడ్డి తన ప్రొఫైల్‌ను మ్యాట్రిమోనీలో అప్‌లోడ్ చేశాడు. అప్పటికే కన్నడ నటి శోభిత సైతం తన ప్రొఫైల్‌ను మ్యాట్రిమోనీలో అప్‌లోడ్ చేసింది. సుధీర్‌రెడ్డి ప్రొఫైల్ చూసిన శోభిత అతన్ని

మిగతా 8వ పేజీలో..

డ్రగ్స్ కేసులో పట్టుబడ్డ డాన్సర్..

- హోటల్ రూములో పార్టీ
- ఇద్దరు పెడ్లర్లు, ఇద్దరు కస్టమర్ల అరెస్ట్
- రూ. 4.18 లక్షల విలువైన డ్రగ్స్ స్వాధీనం

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఓ హోటల్ రూములో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న డ్రగ్స్ పార్టీపై సైబరాబాద్ ఎస్ఓటీ, గచ్చిబౌలి పోలీసులు దాడిచేసిన ఘటనలో ఓ ప్రముఖ డాన్స్ షోలోని కొరియోగ్రాఫర్‌తో పాటు మరో ముగ్గురు అరెస్ట్ అయ్యారు. వీరిలో ఇద్దరు యువకులు, ఇద్దరు యువతులు ఉన్నారు. గచ్చిబౌలిలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీసీపీ డాక్టర్ వినీత్ కేసు వివరాలను వెల్లడించారు. విజయనగరం ప్రాంతానికి చెందిన గుల్లపల్లి గంగాధర్ (28) డ్రగ్స్ సేవించడంతోపాటు విక్రయాలు చేస్తున్నాడు. ఇతడికి మూసాపేటలో ఉంటున్న భువనేశ్వర్‌కు చెందిన కొరియోగ్రాఫర్ కన్హా మొహంతి (24) పరిచయమయ్యాడు. ఇతడు ఓ టీవీచానల్‌లో ప్రసారమయ్యే డాన్స్ పోటీల్లో కొరియోగ్రాఫర్‌గా, కంటెస్టెంట్‌గా కూడా ఉన్నాడు. వీరిద్దరూ కలిసి బెంగళూరు నుంచి తక్కువ ధరకు డ్రగ్స్ కొనుగోలు చేసి, సేవించడంతోపాటు నగరంలో కన్హా బొటిక్ హోటల్‌లో రూమ్‌నెంబర్ 303లో ఉండి అధిక ధరలకు డ్రగ్స్‌ను విక్రయిస్తున్నారు. వీరివద్దకు మాదాపూర్ హాస్టల్‌లో ఉంటున్న కొందం ప్రియాంక రెడ్డి (28), ఒరిగాల షాకి (22)లు డ్రగ్స్ కొనుగోలు చేసేందుకు వచ్చారు. పక్కా సమాచారంతో హోటల్‌పై దాడిచేసిన పోలీసులు నలుగురిని అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.4.18 లక్షల విలువైన 18 గ్రాముల ఎండీఎంఏ, 1 గ్రాము ఓజీ కుష్, 7 గ్రాముల ఛరస్, ఎల్ఎస్‌డీ పేపర్, 6 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో 172 మందిపై కేసులు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో శని, ఆదివారాల్లో నిర్వహించిన ప్రత్యేక డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో 172 మంది మందుబాబులపై ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేశారు. ఇందులో 123 మంది ద్విచక్రవాహనదారులు, 11 మంది ఆటోడ్రైవర్లు, 37 మంది కార్లు నడిపేవారు పట్టుబడ్డారు. కేసులు నమోదు చేసిన పోలీసులు వారి వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

ఒడిశా టు హైదరాబాద్.. గంజాయి సరఫరా

● వేర్వేరు ఘటనల్లో 77 కిలోలు పట్టివేత ● ముగ్గురి అరెస్ట్.. పరారీలో సూత్రధారి


నిందితులతోపాటు స్వాధీనం చేసుకున్న గంజాయి, వాహనం

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు సంఘటనల్లో ఒడిశా నుంచి నగరానికి సరఫరా చేస్తున్న 77 కిలోల గంజాయి పట్టుబడింది. కారులో రవాణా చేస్తూ ముగ్గురు నిందితులు అరెస్ట్ కాగా.. సూత్రధారి పరారీలో ఉన్నారు. మరో ఘటనలో కారు ఇంజన్, మడ్‌గార్డ్ లోపలి భాగంలో గంజాయిని తరలిస్తుండగా పోలీసులకు పట్టుబడింది. వీటికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గచ్చిబౌలిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ డాక్టర్ వినీత్ వివరాలు వెల్లడించారు. హరియాణాకు చెందిన రాకేష్ కుమార్, చమన్, బోయినపల్లికి చెందిన శివంపేట ఉమాకాంత్ అలియాస్ చిన్ను, అర్జున సాయి కృష్ణ ముఠాగా ఏర్పడి గంజాయి విక్రయాలు చేస్తున్నారు. రాకేష్ ఒడిశా నుంచి 57 కిలోల గంజాయి కొనుగోలు చేయగా.. మహీంద్రా ఎక్స్‌యూవీ వాహనంలో చమన్ ఒడిశా నుంచి నగరానికి తీసుకువచ్చాడు. పటాన్‌చెరు ఔటర్ వద్దకు కారు చేరుకోగానే ఉమాకాంత్, అర్జున్‌లు కారులోకి ఎక్కారు. రాకేష్ పల్సర్ బైక్‌పై ముందు వెళుతుండగా, కారులో వీరు ముగ్గురు రాకేష్‌ను అనుసరిస్తున్నారు. గంగారం హనుమాన్ టెంపుల్ ప్రాంతంలో వాహనాల తనిఖీలు చేస్తున్న చందానగర్ పోలీసులు కారును ఆపి తనిఖీ చేశారు. గంజాయి ప్యాకెట్లు కనిపించడంతో వాహనంలో ప్రయాణిస్తున్న చమన్, ఉమాకాంత్, అర్జున్‌లను అరెస్ట్ చేశారు. వారి నుంచి 60 ప్యాకెట్లలో ఉన్న 57 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ముఠాలోని కీలక పాత్రధారి రాకేష్ పరారీలో ఉన్నాడని డీసీపీ తెలిపారు.

కారు ఇంజన్, మడ్‌గార్డ్‌లలో..


స్వాధీనం చేసుకున్న గంజాయి, కారుతో ఎక్సైజ్ పోలీసులు

మరో కేసులో కారు ఇంజన్, నంబర్ ప్లేట్ ఉండే మడ్‌గార్డ్ లోపలి భాగంలో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని ఎక్సైజ్ పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. ఒడిశా రాష్ట్రం మల్కాన్‌గిరి జిల్లాకు చెందిన బిక్రమ్ హీరా కారులో 20 కేజీల గంజాయిని హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు రంగారెడ్డి ఎక్సైజ్ పోలీసులకు సమాచారం అందింది. దాంతో డిప్యూటీ కమిషనర్ దశరథ్ ఆదేశాల మేరకు నానక్‌రామ్‌గూడ సర్కిల్ ఏరియాలో ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ సీఐ ప్రవీణ్‌కుమార్ తన టీమ్ సభ్యులు ఎస్సై శంకర్, శ్రీకాంత్, యాదయ్య ప్రదీప్, శేఖర్‌లు కారును వెంబడించారు. దీనిని గుర్తించిన కారు డ్రైవర్ బిక్రమ్ హీరా కారును ముళ్ల పొదల్లోకి నెట్టి పరారయ్యాడు. పోలీసులు కారును బయటకు తీసి చూడగా ఇంజన్‌లో, నంబర్‌ప్లేట్ మడ్‌గార్‌లో రహస్యంగా దాచిన 20 కేజీల గంజాయి బయటపడింది. దానిని స్వాధీనం చేసుకొని, కారును సీజ్ చేశారు. పరాలో ఉన్న నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

హైడ్రా, మూసీ పేరుతో రాజకీయాలు

● సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య.



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య.

పంజాగుట్ట,డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని హైడ్రా, మూసీ సుందరీకరణ పేరుతో రాజకీయాలు చేస్తోందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య ఆరోపించారు. అమీర్‌పేట శ్రీనివాసనగర్ వెస్ట్ కమ్యూనిటీ హాలులో రెండు రోజులుగా సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ 23వ మహాసభలు జరుగుతున్నాయి. ఆదివారం మహాసభల ముగింపు సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. అనంతరం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ నగరంలో ప్రజా సమస్యలపై నిరంతర పోరాటాలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డీజీ నరసింహారావు, పి.ప్రభాకర్, జిల్లా కార్యదర్శి ఎం. శ్రీనివాస్, కార్యదర్శివర్గ సభ్యులు ఎం. వెంకటేష్, ఎం.దశరథ్, కే.ఎస్ రాజన్న, నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

చుక్కా రామయ్యను పరామర్శించిన హరీశ్ రావు



ప్రముఖ విద్యావేత్త, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు చుక్కా రామయ్యను ఆదివారం విద్యానగర్‌లోని ఆయన స్వగృహంలో మాజీమంత్రి హరీష్ రావు పరామర్శించారు. అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ తదితరులు ఆయనను పరామర్శించిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా సిద్దిపేటతో తనకున్న అనుబంధాన్ని రామయ్య గుర్తుచేసుకున్నట్లు హరీష్ వెల్లడించారు. తెలంగాణ ఉద్యమానికి బాసటగా నిలిచిన చుక్కా రామయ్యను కలవడం సంతోషంగా ఉందని సామాజిక మాధ్యమాల వేదికగా హరీష్ తెలిపారు.

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) :

కార్పొరేట్ దోపిడీదారుల కోసమే బ్యాంకుల ప్రైవేటీకరణ



సదస్సులో ప్రసంగిస్తున్న బి.ఎస్.రాంబాబు

బర్కత్‌పుర, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కార్పొరేట్ దోపిడీదారుల కోసమే కేంద్రం బ్యాంకులను ప్రైవేటీకరణ చేస్తోందని అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం జాతీయ కార్యదర్శి బి.ఎస్.రాంబాబు ఆరోపించారు. ప్రభుత్వ బ్యాంకుల పరిరక్షణకు మహిళా ఉద్యోగులు ప్రతిఘటించాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం నారాయణగూడ తాజ్‌మహల్ హోటల్‌లో ఇండియన్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (టీఎస్, ఏపీ) ఆధ్వర్యంలో బ్యాంకు మహిళా ఉద్యోగుల సదస్సు నిర్వహించారు. బ్యాంకు మహిళా విభాగం కన్వీనర్ జి.పద్మ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఇండియన్ బ్యాంక్ ఫీల్డ్ జీఎం జి.రాజేశ్వర్‌రెడ్డి, ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణురాలు డాక్టర్ మౌనిక బోపన్న, ప్రముఖ పాత్రికేయురాలు కాండ్రగడ్డ అజిత, ఇండియన్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఛైర్మన్ కె.రాధాకృష్ణ, అధ్యక్షుడు ఎం.ఎస్.కుమార్, ప్రధాన కార్యదర్శి పి.వి.కృష్ణారావు పాల్గొన్నారు.



కామన్ వెల్త్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలో ఇండియాకు కాంస్యం సాధించిన సయ్యద్ ఫరీదా సుల్తానా

11వ కామన్ వెల్త్ కరాటే చాంపియన్‌షిప్‌లో ఫరీదా సుల్తానాకు కాంస్య పతకం

చార్మినార్ డిసెంబర్ 1 (ఆంధ్రజ్యోతి) : 11వ కామన్ వెల్త్ కరాటే చాంపియన్‌షిప్ షిప్ పోటీల్లో హైదరాబాద్ పాతబస్తీకి చెందిన సయ్యద్ ఫరీదా సుల్తానా కాంస్య పతకం సాధించి సత్తా చాటింది. శుక్రవారం సౌత్ ఆఫ్రికాలోని డర్బన్‌లో ఓలివ్ కన్వెన్షన్ సెంటర్ (ఎలీట్)లో సౌత్ ఆఫ్రికా కరాటే ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ప్రపంచంలోని పదహారు దేశాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో అండర్ - 21 కేటగిరీ 61 కేజీల విభాగంలో సయ్యద్ ఫరీదా సుల్తానా ఇండియా తరఫున పాల్గొని బ్రెంజ్ పతకం సాధించింది. గతంలో రెండుసార్లు యూఎస్ఏలో ఓపెన్ కరాటే చాంపియన్, మలేషియా, థాయిలాండ్, షార్జా, యూఏఈలలో నిర్వహించిన పోటీలలో చాంపియన్‌గా గెలుపొందింది. ఈ సందర్భంగా షాకో మార్షల్ ఆర్ట్స్ అండ్ సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ కోచ్ శిహన్ సయ్యద్ ఇస్తేకార్ హుస్సేన్ మాట్లాడుతూ సౌత్ ఆఫ్రికాలో జరిగిన కరాటే పోటీలకు తెలంగాణ కరాటే జూడో అసోసియేషన్ అధ్యక్షుడు మహేష్‌గౌడ్ సహకరించగా, ఈవెంట్ కోఆర్డినేటర్‌గా కామన్ వెల్త్ ఫెడరేషన్ అధ్యక్షులు హ్యాంపి సోనీపిల్లయ్ వ్యవహరించారన్నారు.

ఏఐటీఏ రన్నరప్‌గా శ్రీమాన్య జోడీ



శ్రీమాన్య జోడీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఏఐటీఏ మహిళల డబుల్స్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ అమ్మాయి ఎ.శ్రీమాన్య రెడ్డి జోడీ రన్నరప్‌గా నిలిచింది. భువనేశ్వర్‌లో జరిగిన ఈ పోటీల్లో డబుల్స్ ఫైనల్లో శ్రీమాన్య-శ్రీతన్వీ (కర్ణాటక) 3-6, 5-7తో దివా భాటియా-చందన ద్వయం చేతిలో పోరాడి ఓడింది. సింగిల్స్‌లోనూ ఆడిన శ్రీమాన్య సెమీస్‌లో 3-6, 4-6తో మనోజ్ఞయ చేతిలో పరాజయం పాలైంది.


నేహకు ప్రథమ బహుమతి అందజేస్తున్న జిల్లా స్థాయి విద్యాశాఖ అధికారులు

సైన్స్ ఫెయిర్‌లో ప్రభుత్వ విద్యార్థిని ఫస్ట్

రాజేంద్రనగర్, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): నవంబరు 29, 30వ తేదీల్లో శంషాబాద్‌లో జరిగిన రంగారెడ్డి జిల్లా సైన్స్ ఫెయిర్‌లో రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ప్రథమ బహుమతి లభించింది. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ థీమ్‌లో టెంపరేచర్ అండ్ హుమిడిటీ డిస్‌ప్లే రోబోట్ అనే ప్రదర్శనను నిర్వహించిన విద్యార్థిని నేహ ప్రథమ స్థానంలో నిలిచింది. దీంతో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ ఎం.సుగుణారెడ్డి హర్షం వ్యక్తంచేశారు. నేహను ఉపాధ్యాయులు ఎం.శ్రీనివాస్‌తో పాటు ఆమె అభినందించారు.

పిల్లలతో ఖురాన్ పఠనం చేయించాలి

ఎమ్మెల్యే మీర్ జుల్ఫేకర్ అలీ


ర్యాలీని ప్రారంభిస్తున్న చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫేకర్ అలీ తదితరులు

చార్మినార్ డిసెంబరు 1 (ఆంధ్ర జ్యోతి): ప్రతి ముస్లిం తమ పిల్లలను ఇంగ్లిష్ మీడియంతో పాటు ఖురాన్ పఠనం కూడా చేయించాలని అంజుమన్ ఏ ఖాద్రియ అధ్యక్షుడు మౌలానా గులాం సందని అలీ పాషా అన్నారు. ఆదివారం చార్మినార్ వద్ద చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫేకర్ అలీతో కలిసి దిని తాళిమి ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీని గుల్జర్ హౌస్, పత్తర్ గట్టి, మదీనా, హైకోర్టు, సిటీకాలేజీ, గుండా ఖులి ఖుతుబ్ షా స్టేడియం వరకు నిర్వహించారు. స్టేడియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తియడానికి ప్రతి సంవత్సరం ఈ ర్యాలీని నిర్వహిస్తున్నమన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పాఠశాలలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ పాషా, ఆగా మొహ్మద్‌ఖాసీం, మౌలానా హైదర్ పాషా, అతిక్ మదని, షూజ ఇఫ్టేకరి, అలీ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

బాలమల్లేశ్ మృతి సీపీఐకి తీరనిలోటు


బాలమల్లేశ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

రాజేంద్రనగర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్.బాలమల్లేశ్ మృతి సీపీఐకి తీరని లోటని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు పుస్తకాల నర్సింగ్‌రావు, సయ్యద్ అఫ్సర్, వనంపల్లి జైపాల్‌రెడ్డి అన్నారు. బాల మల్లేశ్ శనివారం గుండెపోటుతో మరణించడంతో ఆయన మృతికి సీపీఐ నాయకులు ఆదివారం సంతాపం వ్యక్తం చేశారు. బుద్వేల్‌లో గల రంగారెడ్డి జిల్లా సీపీఐ కార్యాలయం(ఏఆర్ దేవరాజ్ భవన్)లో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఎంఏ.రియాజ్, ఎస్.మల్లేశ్, విజయానంద్‌గౌడ్, టి.ఆనంద్, ఆనంద్‌గౌడ్, ఎస్.సత్యం, శంకరయ్య, బాబురావు, ఎ.రాజు, సాయిలు, నర్సింహ, శ్రీకాంత్ పాల్గొన్నారు. బాలమల్లేశ్ ల మరణం బాధాకరమని సీపీఐ మాజీ నాయకులు పి.శ్రీనివాసులు నాయుడు అన్నారు.

ఘనంగా బిగ్ ఇంపాక్ట్ అవార్డు వేడుక


వేడుకల్లో పాల్గొన్న అతిథులు, నిర్వాహకులు

నార్సింగ్, డిసెంబర్ 1 (ఆంధ్ర జ్యోతి): గండిపేట రీసార్ట్‌లో ప్రముఖ రేడియో నెట్‌వర్క్‌లలో ఒకటైన బిగ్ ఎంఎఫ్ఎం ఆధ్వర్యంలో బిగ్ ఇంపాక్ట్ అవార్డు హైదరాబాద్-2024 కార్యక్రమాన్ని శనివారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బాలీవుడ్ స్టార్ అమీషాపటేల్, నటుడు సుధీర్‌బాబు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నగరంలోని పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు. అనంతరం పీఎంజే జ్యూవెల్స్ డైమండ్స్ అండ్ గోల్డ్, ఏ2ఏ హోమ్‌ల్యాండ్(గ్లోబల్ హోమ్స్ అండ్ హైట్స్ ఎల్ఎల్‌పీ) స్పాన్సర్‌లను అమీషాపటేల్, సుధీర్‌బాబు సత్కరించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ


లబ్ధిదారుకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కౌసర్ తదితరులు

నార్సింగ్, డిసెంబరు 1 (ఆంధ్ర జ్యోతి): కార్వాన్ నియోజకవర్గంలోని హకీంపేట్ ఏఐఎంఐఎం పార్టీ కార్యాలయంలో అర్హులైన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కార్వాన్ ఎమ్మెల్యే మహ్మద్ కౌసర్ మొహియుద్దీన్ హాజరై చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, మజ్లిస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక మాస వేడుకల ముగింపు

చాంద్రాయణగుట్ట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పాతనగర ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం చత్రినాక లక్ష్మణేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాస వేడుకల ముగింపు కార్యక్రమాలు ఆదివారం కనులపండువగా ముగిశాయి. అలయ కమిటీ ట్రస్ట్‌చైర్మన్ మారెడ్డి దామోదర్‌రెడ్డి లాల్‌దర్వాజ గౌలిపురా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సరాబు సంతోష్‌కుమార్ గుప్తా నేతృత్వంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సలహాదారులు వరకాలయాదగిరి, పి.రాజుయాదవ్, సరాబువిశ్వేశ్వరయ్య, ఆలయ ట్రస్టీలు పోతుగంటి రమేశ్‌కుమార్, సత్యనారాయణ, బాలాచారి తదితరులు పాల్గొన్నారు.

'షిరిడీసాయి గానయజ్ఞం, నాలో నేను' ఆవిష్కరణ


అవార్డులను ప్రదానం చేస్తున్న అతిథులు

రవీంద్రభారతి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): భక్తి గీతాలను రచించడమే కాకుండా 108 వారాలపాటు 108 పాటల వీడియోలను విడుదల చేయడం అభినందనీయమని వక్తలు అన్నారు. ఆదివారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో మాధవ వెంకటకృష్ణ కోసూరు రచించిన షిరిడీ సాయి గాన యజ్ఞం, నాలో నేను పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తి పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో 108 వారాల పాటు 108 గీతాలు విడుదల చేయడం రికార్డు సృష్టించిందని, దీనికి గాను ఇండియా ఇంటర్నేషనల్ వరల్డ్ రికార్డ్స్, టాలెంట్ బుక్ ఆఫ్ రికార్డ్స్ తో పాటు పలు రికార్డుల సంబంధించిన పత్రాలను రచయిత మాధవ వెంకటకృష్ణకు ప్రదానం చేశారు. యన్ కేవీ.రమణారావు సమక్షంలో ఈ ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో బ్రహ్మయ్య, ప్రభాకర్, ఓంప్రకాశ్, వీవీ.ప్రసాద్, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.


దివ్యాంగులకు ట్రైసైకిళ్లను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, కార్పొరేటర్ సంగీతాగౌరీశంకర్, డిప్యూటీ కమిషనర్ రవికుమార్


రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని నస్రీన్‌కు ప్రథమ బహుమతి అందజేస్తున్న రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకట్‌రెడ్డి

దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ

ప్రజాపాలన విజయోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

రాజేంద్రనగర్, డిసెంబరు1 (ఆంధ్ర జ్యోతి): ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె.రవికుమార్ ఆధ్వర్యంలో ఆదివారం రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో దివ్యాంగులకు ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్, అత్తాపూర్ కార్పొరేటర్ మోండ్ర సంగీత గౌరీశంకర్ పాల్గొని 17 మంది దివ్యాంగులకు ట్రైసైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఉన్న దివ్యాంగులకు తన పూర్తి సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. ప్రజాపాలకు సంవత్సరం కావస్తున్న సందర్భంగా దివ్యాంగులకు ట్రై సైకిళ్లు ఇచ్చే కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన డిప్యూటీ కమిషనర్‌ను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో డీపీఓ యాదగిరి, కమ్యూనిటీ ఆర్గనైజర్స్ ఉపేందర్, లక్ష్మణ్, రేణుక, రాజేంద్రనగర్ సర్కిల్ దివ్యాంగుల సంఘం అధ్యక్షులు మహబూబ్, సిద్ధప్ప, కాంగ్రెస్ నాయకులు పలుగుచెరువు మహేశ్, సరికొండ వెంకటేశ్, సయ్యద్ ముజమ్మిల్ అహ్మద్, బొక్క ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఆదివారం రాజేంద్రనగర్ మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో గణేశ్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రీనవబుల్ ఎనర్జీ సోర్సెస్ అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. తెలుగు, ఇంగ్లిస్, ఉర్దూ మీడియాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు బహుమతులను అందజేశారు. బహుమతి ప్రదానోత్సవానికి రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ బి.రాములు, మండల విద్యాధికారి శంకర్‌రాథోడ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గణేశ్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.మాధవీలత, రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ ఎం.సుగుణరెడ్డి, బుద్వేల్, అత్తాపూర్, మైలార్‌దేవుపల్లి, ఎన్‌టీఆర్‌నగర్, శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎం.ఝాన్సీరాణి, శ్రీలత, చంద్రశేఖర్, సత్యనారాయణరాజు, కిషన్‌నాయక్, మాణిక్యంరెడ్డి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పులిపాటి రాజేశ్‌కుమార్

వారం రోజుల పాటు వేడుకలు

మదీన: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వారంరోజులపాటు విజయోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు పార్టీ బహదూర్‌పుర నియోజకవర్గ ఇన్‌చార్జి పులిపాటి రాజేశ్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజాపాలన విజయవంతంగా సాగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతిష్ఠతను దెబ్బతీయడానికి బీఆర్ఎస్ నాయకులు చిల్లర రాజకీయాలు చేస్తున్నారన్నారు.


ఓ దుస్తుల షాప్‌లో షేర్వాని ధరించిన తురకిష్ హైకమిషనర్

పత్తర్‌గట్టిలో తురకిష్ హైకమిషనర్ షాపింగ్

చార్మినార్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తురకిష్ హై కమిషనర్, ఇండియా, నేపాల్, భూటన్, ఫిరాట్ సునెల్, ఓరహన్ యల్మాన్ ఒక్కాన్ ఆదివారం పాతబస్తీ పత్తర్‌గట్టి ప్రాంతంలోని ఓ దుస్తుల షాపును సందర్శించారు. షేర్వాని, కుర్తా, పైజమాలను కుటుంబ సమేతంగా కొనుగోలు చేశారు. తురకిష్ కమిషనర్లు దుస్తులు కొనుగోలు చేస్తున్నారని తెలుసుకున్న ప్రజలు ఆ షాప్ ముందు భారీగా గుమి గూడారు. వారు కొనుగోలు చేసి వెళుతున్న సమయంలో వారితో సెల్ఫీలు తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మీడియతో మాట్లాడుతూ ఇక్కడ దుస్తులు తమను ఎంతగానో ఆకట్టు కున్నాయన్నాయన్నారు. కార్యక్రమంలో బ్రిటిష్ హైకమిషనర్ కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే నగరం అభివృద్ధి

● మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు


మాట్లాడుతున్న టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి నర్సింహులు

చార్మినార్ డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ వెళ్లి టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను ప్రచారం చేస్తూ సభ్యత్వ నమోదు కార్యక్రమాలను కొనసాగించాలని టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు, నాగు నాగేష్ అన్నారు. ఆదివారం చాంద్రయణ గుట్ట నియోజకవర్గం రక్షపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణలో కొంతమంది భూస్వాముల ఆధిపత్యాన్ని నియంత్రించి పేద, బడుగు, బలహీన వర్గాలను ప్రోత్సహిస్తూ.. అనేక అవకాశాలను టీడీపీ కల్పించిందన్నారు. హైదరాబాద్ పార్లమెంటరీ టీడీపీ సమన్వయ కమిటీ ప్రతినిధి నాగు నాగేష్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయా అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా నరసింహులు సమీక్షించారు. కార్యక్రమంలో వి.సాయికుమార్.. చేనేత సహకార సంఘం చైర్‌పర్సన్ వి.ప్రమీలారాణి తదితరులు పాల్గొన్నారు

● బీజేపీ బైక్ ర్యాలీ



కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలుపర్చకుండా ప్రజలను మోసం చేస్తున్నదని బీజేపీ రాష్ట్ర కార్యాలయ ప్రోగ్రామ్ ఇన్‌చార్జి డి.గోపాల్‌జీ విమర్శించారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు విఫలమైనందుకు నిరసనగా బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. - గోషామహల్

ఓలలాడించిన భక్తిగీతాల ఆలాపన


సంగీత కచేరీ చేస్తున్న కళాకారులు

రవీంద్రభారతి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య, త్యాగరాజు కీర్తనలను గాయనీగాయకులు ఆలపించి, శ్రోతల్ని ఓలలాడించారు. కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా తిరుపతిలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో మహతి ఆర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో సంగీత కచేరి నిర్వహించారు. సంగీత గురువు వింజమూరి లక్ష్మి నేతృత్వంలోని శిష్య బృందం సంకీర్తలను ఆలపించారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు వింజమూరి లక్ష్మిని ఘనంగా సత్కరించి అభినందించారు.


అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు

పోచమ్మ దేవాలయంలో అన్నదానం

రాజేంద్రనగర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం చివరి ఆదివారం అమవాస్య సందర్భంగా బాబుల్‌రెడ్డినగర్ లోని వీరభద్రస్వామి దేవాలయంలో భక్తిశ్రద్ధలతో అభిషేకం నిర్వహించారు. శ్రీపోచమ్మ దేవాలయ ఆవరణలో దాతల సహకారంతో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీకౌన్సిలర్ ఎస్.వెంకటేశ్, పోతరాజు మల్లేశ్ గురుస్వామి, శేఖర్, మల్లేశ్, జగన్, రాజ్‌కుమార్, ప్రవీణ్, సన్ని, ఆనంద్, మూర్తి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

అఫ్జల్‌గంజ్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జాంబాగ్ డివిజన్‌లోని హనుమాన్ టేకిడి వద్ద గల ఉమా మహేశ్వర్ మహంకాళి అమ్మవారి దేవాలయం ఆధ్వర్యంలో ఆలయ కమిటీ చైర్మన్ జక్కుల మహేశ్‌కుమార్ యాదవ్, జె.అశోక్ కుమార్ యాదవ్‌ల నేతృత్వంలో ఆదివారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ పూజలకు జాంబాగ్ కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు కార్పొరేటర్‌ను ఘనంగా సన్మానించారు.


పూజలలో పాల్గొన్న కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్

విద్యతోపాటు జనరల్ నాలెడ్జ్ కూడా అవసరం


ప్రదర్శనను తిలకిస్తున్న ఉదయ్‌కిరణ్‌రెడ్డి

చాంద్రాయణగుట్ట, డిసెంబరు 1 (ఆంధ్ర జ్యోతి): విద్యార్థులకు విద్యతోపాటు జనరల్ నాలెడ్జ్ కూడా అవసరమని బీజేపీ బహదూర్‌పురా నియోజకవర్గ కోకన్వీనర్ ఉదయ్‌కిరణ్‌రెడ్డి అన్నారు. శంషీర్‌గంజ్ కాల్వగడ్డలోని శారద వంహా విద్యాలయంలో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనను ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు.

రాష్ట్ర టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మహేశ్



చాంద్రాయణగుట్ట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పాతబస్తీ గౌలిపురాకు చెందిన ఆదర్ల మహేశ్ ఎన్నికయ్యారు. ఆదివారం ఎల్బీ స్టేడియంలో జరిగిన ఎన్నికల్లో సభ్యులు ఆయనను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.


అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు

వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం

నార్సింగ్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మణికొండ గ్రామంలోని వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అమావాస్యను పురస్కరించుకొని స్థానిక ప్రజలకు అన్నదాన ం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఓలం యాదగిరి హాజరయ్యారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, మణికొండ గ్రామస్తులు పాల్గొన్నారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/x7P4egkలో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

హాస్టళ్లలో మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలి


అత్తాపూర్ బీసీ జూనియర్ కళాశాల హాస్టల్‌లో ఆహారాన్ని పరిశీలిస్తున్న లక్ష్మీనివాస్

రాజేంద్రనగర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వ్యాప్తంగా మధ్యాహ్న భోజనంతో విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారని టీఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు మీసాల లక్ష్మీనివాస్ అన్నారు. టీఎస్ఎస్ఓ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అత్తాపూర్‌లోని బీసీ బాలుర వసతి గృహం(జూనియర్ కళాశాల)ను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమకు నాణ్యమైన ఆహారం అందడం లేదని లక్ష్మీనివాస్‌కు తెలిపారు. హాస్టళ్లలో భోజనం నాణ్యతగా ఉండే విధంగా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని లక్ష్మీనివాస్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ మండల టీఎస్ఎస్ఓ అధ్యక్షుడు సంతోష్, వంశీక్రిష్ణ, సాయికిరణ్ గౌడ్, నిఖిత్ కుమార్, శ్రీకాంత్, శివ ప్రసాద్ నాయుడు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.


రాజేంద్రనగర్ అంబేద్కర్ విగ్రహం వద్ద సమావేశమైన మాల సంఘాల నాయకులు

మాలల సింహ గర్జనకు తరలిన నాయకులు

రాజేంద్రనగర్, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): పరేడ్ గ్రౌండ్స్‌లో ఆదివారం జరిగిన మాలల సింహగర్జన బహిరంగ సభకు రాజేంద్రనగర్ సర్కిల్ నుంచి మాలలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. రాజేంద్రనగర్ అంబేద్కర్ విగ్రహం ఆవరణ నుంచి మాల సంఘాల నాయకులు ర్యాలీగా పరేడ్ గ్రౌండ్స్‌కు వెళ్లారు. అంతకుముందు వారు రాజేంద్రనగర్‌లోని డాక్టర్ బీఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి మాలల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మాల సంఘాల నాయకులు గొడుగు సంజీవ, పచ్చ శ్రీనివాసులు, పచ్చ నర్సింగ్‌రావు. పంబాల రాజు, మంత్రి చంద్రశేఖర్, రాములు, పెంటయ్య, రాజు, గణేశ్ తదితరులు ఉన్నారు.



బషీర్‌బాగ్‌లో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తున్న మాల మహానాడు నాయకులు

మాలల ఉద్యమ విచ్ఛిన్నానికి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర

బర్కత్‌పుర, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న మాలల ఉద్యమం విచ్ఛిన్నానికి కాంగ్రెస్ ప్రభుత్వం మాల ఎమ్మెల్యేల ద్వారా కుట్రలు చేస్తోందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వీఎల్.రాజు, రాష్ట్ర అధ్యక్షుడు జేఎల్.రావు ఆరోపించారు. వర్గీకరణ, క్రిమిలేయర్ అమలు చేయడం ద్వారా మాలలను అణచివేయడానికి కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు రకరకాల కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు ఆధ్వర్యంలో ఆదివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు సీహెచ్.రోజాలీల, రమేష్, దేవేందర్‌రావు, ఎన్.పద్మ, హేమలత తదితరులు పాల్గొన్నారు.

7న టీజీసీసీఐ ఎగ్జిబిషన్


ఎగ్జిబిషన్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క

బర్కత్‌పుర, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(టీజీసీసీఐ) ఎగ్జిబిషన్‌ను ఈనెల 7న నిర్వహిస్తున్నట్లు టీఈసీసీఐడబ్ల్యూబీసీ చైర్మన్ బెల్లం మాధవి, అధ్యక్షుడు మహేశ్వరం కార్తీక్ తెలిపారు. ఎగ్జిబిషన్ వాల్‌పోస్టర్‌ను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. ఈ మేరకు ఆదివారం బషీర్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌ను బేగంపేటలోని పర్యాటక భవన్‌లో నిర్వహిస్తున్నామన్నారు.

జాంబాగ్ డివిజన్‌లో సమస్యల పరిష్కారానికి కృషి


డ్రైనేజీ నీటిని పరిశీలిస్తున్న ఆనంద్‌కుమార్ గౌడ్

అఫ్జల్‌గంజ్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జాంబాగ్ డివిజన్ పరిధిలో గోషామహల్ బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్ పర్యటించి ప్రజలెదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆదివారం ఆయన పార్టీ నాయకులతో కలిసి డివిజన్ పరిధిలోని ఇడ్లీ గల్లీ, పత్తర్ కీ మసీదు, పూసల బస్తీ, జాంబాగ్, సిర్ గల్లీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. కచ్చా మోరీలు, గుంతలమయమైన రోడ్లు, డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయని, వీధిదీపాలు వెలగడంలేదని స్థానికులు ఫిర్యాదు చేశారు. సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు భజన్‌సింగ్, మహేశ్‌గౌడ్, నరేశ్‌గౌడ్, జయంత్, గిరీష్, మల్లేష్, సాయి ముదిరాజ్, విఠల్, రమేశ్‌గౌడ్, రాకేశ్ పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీలు కేంద్రం నుంచి నిధులు తెప్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్

అఫ్జల్‌గంజ్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఎంపీలు నిజంగా తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిని కోరుకునేవారైతే వారు కేంద్రం నుంచి నిధులు తెప్పించాలని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీసతీష్ డిమాండ్ చేశారు. ఆదివారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు అయినా విభజన చట్టంలో భాగంగా రాష్ట్రానికి రావల్సిన నిధులు మంజూరు చేయకుండా కేంద్రం సవతితల్లి ప్రేమ చూపిస్తోందన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఆకట్టుకుంటాడు.. ఆగం చేస్తాడు

- మోడళ్లు, సినీతారలకు వాటాలంటూ ప్రచారం
- ఆపై వాళ్లకు తెలియకుండానే మరొకరి పేరిట బదలాయింపు
- సుమారు రూ. 100 కోట్లు మోసం చేసిన కాంతిదత్
- నిందితుడి అరెస్ట్

బంజారాహిల్స్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నాలుగు కోట్ల రూపాయల విలువ చేసే రెండు విల్లాలు, రెండు బెంజ్ కార్లు, బిజినెస్ క్లాస్‌లో విదేశీ పర్యటనలు.. ఇలా చెప్పుకుంటూ పోతే విలాసమంతా అతడి లైఫ్‌స్టైల్‌లోనే కనిపిస్తుంది. సదరు యువకుడు తానో పెద్ద వ్యాపారవేత్తనంటూ అనేకమందిని మోసం చేసి కోట్ల రూపాయలు కొల్లగొట్టాడు. సీసీఎస్‌తోపాటు జూబ్లీహిల్స్‌లో రెండు చీటింగ్ కేసులు అతడిపై నమోదయ్యాయి. మాదాపూర్‌లో ఓ ర్యాపిడో డ్రైవర్ మరణానికి కారణమయ్యాడు. ఈ కేసుల్లో కొద్ది నెలలుగా తప్పించుకు తిరుగుతున్న యువకుడిని జూబ్లీహిల్స్ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేయగా, న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించింది. వ్యాపారవేత్త శ్రీజారెడ్డి సంతకాలను ఫోర్జరీ చేసి రూ.2.5 కోట్లు మోసం చేసిన కేసులో అరెస్టు అయిన కాంతిదత్ మోసాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి.


నిందితుడు క్రాంతి దత్

మోడల్స్‌తో హడావిడి

నగరంలో పెద్ద వ్యాపారవేత్తగా చలామణి కావాలని భావించిన విశాఖపట్నానికి చెందిన కాంతిదత్ కుట్రతో కూడిన ప్రణాళికలు రూపొందించుకున్నాడు. అందరినీ ఆకట్టుకోవాలంటే సినీ తారలు, మోడల్స్‌తోనే సాధ్యం అవుతుందని భావించాడు. ఇందుకోసం సస్టైయిన్ కార్ట్ పేరిట ఎకో ఫ్రెండ్లీ ఉత్పత్తులను అమ్మే ప్లాట్‌ఫాంను రూపొందించి దాని ప్రారంభోత్సవానికి మోడల్స్‌తో హడావిడి చేశాడు. ఇందులో హీరోయిన్‌లు కాజల్ అగర్వాల్, కీర్తిసురేష్, డిజైనర్ శిల్పారెడ్డికి కూడా వాటాలున్నాయని ప్రచారం చేశాడు. ఈ ప్లాట్‌ఫాం పేరిట ఎకో పరికరాలు అమ్ముతానని పలువురి వద్ద లక్షల రూపాయలు వసూలు చేసినట్టు, ఈ ఆన్‌లైన్ ప్లాట్‌ఫాం పేరిట సుమారు రూ. 20 కోట్లు కొల్లగొట్టినట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. అధికారికంగా పోలీసులు నిర్ధారించాల్సి ఉంది. ప్రపంచవ్యాప్తంగా కాంతిదత్ కొల్లగొట్టిన సొత్తు రూ. 100 కోట్ల వరకు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు.

కాపాడేందుకు రంగంలోకి యాడ్ ఏజెన్సీ యజమాని

కాంతిదత్‌ను కాపాడేందుకు ఓ ప్రముఖ యాడ్ ఏజెన్సీ యజమాని రంగంలోకి దిగినట్లు తెలిసింది. తన కంపెనీకి కాంతిదత్ గతంలో సహాయం చేసినందుకుగాను ఇప్పుడు అతడిని కాపాడేందుకు పెద్దవాళ్లతో మాట్లాడుతున్నట్లు సమాచారం.

హిట్ అండ్ రన్ కేసులో..

రోడ్డు ప్రమాదంలో ఓ ర్యాపిడో డ్రైవర్ మరణానికి కారణమై తప్పించుకు తిరుగుతున్న కాంతిదత్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్ రోడ్డు నంబరు 5 దేవరకొండ బస్తీకి చెందిన రాజశేఖర్ ర్యాపిడో డ్రైవర్, జూలై 14న రాజశేఖర్ కొత్తగూడ గూగుల్ కార్యాలయం వద్ద నుంచి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా వెనుక నుంచి బెంజ్ కారు వచ్చి ఢీకొట్టింది. చికిత్స పొందుతూ రాజశేఖర్ మృతి చెందాడు. మాదాపూర్ పోలీసులు దర్యాప్తు చేయగా బెంజ్ కారు కాంతిదత్‌దని తెలియడంతో సీజ్ చేశారు.

పెట్టుబడులు తీసుకొని.. సంతకాలు ఫోర్జరీ చేసి..

జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు 38లో తృతీయ ఫైన్ జువెలర్స్ పేరుతో స్టోర్ ప్రారంభిస్తున్నట్టు కాంతిదత్ ప్రచారం చేసుకున్నాడు. యర్రంశెట్టి అనిల్ అనే వ్యాపారవేత్త పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చాడు. అతడి వద్ద సుమారు నాలుగు కోట్ల రూపాయలు వసూలు చేశాడు. ఫోర్జరీ సంతకాలు చేసి అతడి పేరును సంస్థ డైరెక్టర్ నుంచి తప్పించాడు. వ్యాపారవేత్త శ్రీజారెడ్డి వ్యవహారంలో కూడా ఇదే జరిగింది. స్టోర్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా హీరోయిన్ పరిణీతి చోప్రా వ్యవహరించింది. ఆమెను కూడా కాంతిదత్ మోసం చేసినట్టు తెలుస్తోంది. ప్రవీణ్ అనే వ్యక్తి వద్ద పెట్టుబడి పేరిట రూ. 5.8 కోట్లు వసూలు చేసి మోసం చేసినట్టు తెలిసింది. నిజామాబాద్‌కు చెందిన ఓ వ్యాపారి వద్ద నాలుగు కోట్ల రూపాయలు తీసుకొని నకిలీ బాండ్‌లు ఇచ్చాడు. ఈ వ్యవహారంపై సీసీఎస్‌లో కేసు నమోదైంది.

సీరియల్ నటి శోభిత ఆత్మహత్య

(5వ పేజీ తరువాయి)

పరిచయం చేసుకుంది. ఇద్దరి మనసులు కలవడంతో పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. శోభిత సీరియల్స్‌లో నటిస్తున్న విషయం సుధీర్‌రెడ్డికి తెలియదు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ భర్తగా రావడంతో ఆమె నటనను వదులుకొని గతేడాది మే-21న సుధీర్‌రెడ్డిని పెళ్లిచేసుకుంది. కొండాపూర్ శ్రీరాంనగర్ కాలనీలోని ఓ అపార్టుమెంట్ ఫ్లాట్‌లో నివాసం ఉంటున్నారు. పెళ్లయిన తర్వాత శోభిత సినీ నటి అని భర్తకు తెలిసినా ఇద్దరి మధ్య ఎలాంటి పొరపచ్చాలు రాలేదు. కొద్దిరోజుల క్రితం గోవాలో జరిగిన ఫిలిం ఫెస్టివల్‌కు శోభిత వెళ్లివచ్చింది. ఇదిలా ఉండగా.. శనివారం రాత్రి 10 గంటలకు భోజనం చేసిన తర్వాత శోభిత ఒక బెడ్‌రూంలో పడుకోగా, సుధీర్‌రెడ్డి తన ఆఫీస్‌వర్క్ చేసుకుని మరో బెడ్‌రూంలో పడుకున్నాడు. ఆదివారం ఉదయం 8.30 గంటల సమయంలో లేచిన సుధీర్‌రెడ్డి శోభిత పడుకున్న గది తలుపు తట్టగా ఎంతకూ తలుపు తీయలేదు. దీంతో ఇరుగు, పొరుగు వారి సహాయంతో తలుపులు బద్దలుకొట్టి గదిలోకి వెళ్లి చూడగా శోభిత బెడ్‌రూంలో చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని విగతజీవిగా వేలాడుతూ కనిపించింది. వారు గచ్చిబౌలి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు శోభిత మృతదేహాన్ని కిందకు దింపి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఆమె మృతికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు. శోభిత కుటుంబసభ్యులను సైతం ఫోన్‌లో విచారించామని, భార్యాభర్తల మధ్య ఎలాంటి గొడవలూ లేవని తెలిపినట్లు పోలీసులు వెల్లడించారు. శోభిత ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదని, ఎలాంటి సూసైడ్‌నోట్ లభించలేదన్నారు. సుధీర్‌రెడ్డిని విచారించగా.. తమ మధ్య మనస్పర్థలు లేవని శోభిత ఇలా ఎందుకు ఆత్మహత్య చేసుకుందో అర్థం కావడం లేదని పోలీసులకు తెలిపాడు. మృతురాలి కుటుంబసభ్యులు బెంగళూరు నుంచి బయలుదేరి వస్తున్నారని, వారు వచ్చిన తర్వాత కేసుకు సంబంధించి మరిన్ని వివరాలు తెలిసే అవకాశం ఉందని ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

చల్లటి గాలులతో జర భద్రం

(5వ పేజీ తరువాయి)

పట్టడం సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉందన్నారు.

స్నానం చేయడంలో జాగ్రత్తలు

- చలికాలంలో తెల్లవారుజామున, రాత్రి సమయాల్లో స్నానం చేయవద్దు.
- కేవలం 5 నుంచి 10 నిమిషాల లోపే స్నానం ముగించాలి.
- గోరువెచ్చటి నీటితో స్నానం చేయాలి.
- సబ్బు కంటే సున్ని, శనగపిండి ఉపయోగించడం మంచిది.
- గ్లిసరిన్ సబ్బులను వాడాలి.

జాగింగ్ ఇలా..

- మంచు కురుస్తున్నప్పుడు బయటకు రావొద్దు.
- ఎండగా ఉన్నప్పుడు చెట్లు ఎక్కువ ఉన్న ప్రాంతంలో కాకుండా సూర్యరశ్మి తగిలే ప్రాంతంలో జాగింగ్ చేయాలి.
- శరీరం పూర్తిగా కవర్ అయ్యేలా దుస్తులు ధరించాలి.
- మంకీటోపీలు ధరించాలి. చెవుల్లో దూది పెట్టుకోవాలి.
- షూ, సాక్స్ తప్పనిసరిగా వేసుకోవాలి.
- జాగింగ్ తర్వాత శీతలపానీయాలు, బయట విక్రయించే జ్యూసులు తాగవద్దు.
- జాగింగ్ చేసి ఇంటికి రాగానే స్నానం చేయవద్దు. కొద్దిసేపటి తర్వాత గోరువెచ్చటి నీళ్లతో స్నానం చేయాలి.

వృద్ధులు, గర్భిణులు అప్రమత్తంగా ఉండాలి



చలికాలంలో వృద్ధులు మరింత అప్రమత్తంగా ఉండాలి. ఎక్కువగా వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. 65 నుంచి 70 ఏళ్లు దాటిన వారిలో రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. చలికాలంలో గర్భిణులు మొదటి 12 వారాల వరకు అప్రమత్తంగా ఉండాలి. నీటిని కాచి, చల్లార్చి వడపోసుకుని తాగాలి. చల్లటి పానీయాలు, ఐస్‌క్రీమ్‌లు తీసుకోవద్దు. బయటి నీళ్లు, ఆహారం వద్దు. వేడి ఆహారమే తీసుకోవాలి. బయటకు వెళ్లినప్పుడు చెవుల్లో దూది పెట్టుకోవాలి. ఏసీ గదుల్లో ఉండకపోవడం మంచిది. మంచినీళ్లు ఎక్కువగా తాగాలి.

- డాక్టర్ హరికిషన్, ఇంటర్నల్ మెడిసిన్, కామినేని ఆస్పత్రి

సీత అభిరుచులు స్ఫూర్తిదాయకం

సంస్మరణ సభలో వక్తలు


'టేల్స్ ఫ్రమ్ ది ట్రీ టాప్స్' భూటాన్ బర్డ్ ఫొటోగ్రఫీ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే, జీవన్‌కుమార్, వేణు, వనజ, శ్రీశ్రీ ప్రింటర్స్ విశ్వేశ్వరరావు, సోమంచి శ్రీనివాస్ తదితరులు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తన 65వ ఏట ఈత నేర్చుకొని గత ఈతగాళ్లు సైతం దిగడానికి వెనుకాడే తీర్థన్ నదిలో ఈదిన సాహసి కంభంపాటి సీత అని వక్తలు కొనియాడారు. నడుం నొప్పికి ఉపశమనంగా ఈత నేర్చుకున్న ఆమె, స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొని 30కి పైగా బంగారు పతకాలు గెలుచుకోవడం అసాధారణ విషయం అని శ్లాఘించారు. ఉద్యోగ విరమణ అనంతరం భర్త సోమంచి శ్రీనివాసరావుతో కలిసి బర్డ్, వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రఫీలో నిపుణత సాధించి, జాతీయస్థాయిలో గుర్తింపు పొందడం సీతకే సాధ్యమైందన్నారు. కంభంపాటి సీత అక్టోబరు 29న కన్నుమూసిన సంగతి తెలిసిందే. ఆమె సంస్మరణ సభ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా సీత, శ్రీనివాసరావు దంపతులు తీసిన భూటాన్ పక్షుల చిత్రాల సమాహారం "టేల్స్ ఫ్రమ్ ది ట్రీ టాప్స్" పుస్తకాన్ని ప్రముఖ రచయిత్రి ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే, మానవ హక్కుల వేదిక ప్రతినిధి జీవన్ కుమార్, వీక్షణం వేణుగోపాల్, వనజ తదితరులు ఆవిష్కరించారు. ప్రఖ్యాత విప్లవ కవి వరవరరావు ముంబై నుంచి పంపిన సంతాప సందేశాన్ని వేణుగోపాల్ సభలో చదివారు.

ఆంధ్రజ్యోతి పూర్వ ఎడిటర్ కె. శ్రీనివాస్ మాట్లాడుతూ.. "సీత, శ్రీనివాసరావు దంపతుల్లాగా పక్షుల పరిశీలన మీద అభిరుచి కలిగిన వారు చాలా తక్కువ. వైల్డ్ లైఫ్, బర్డ్ ఫొటోగ్రఫీ ద్వారా వైవిధ్య భరితమైన చిత్రాలు మనకు అందించారు. ఒక అభిరుచిని ఎంపిక చేసుకొని, సాధన చేయడం సాధారణమైన విషయం కాదు. ఈ విషయంలో సీత స్ఫూర్తిదాయకం" అన్నారు. సామాజిక కార్యకర్తలు సజయ, సుధా గోపరాజు, వరంగల్ సీకేఎం కళాశాల, ఆంధ్ర బాలికా కళాశాల విశ్రాంత అధ్యాపకులు, ఇతర సిబ్బంది, కవి అరణ్య కృష్ణ తదితరులు కంభంపాటి సీతతో తమకున్న ఆత్మీయానుబంధం గురించి చెబుతూ భావోద్వేగానికి లోనయ్యారు. సోమంచి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. "మా 55 ఏళ్ల వైవాహిక బంధంలో ఈ నెల రోజులకు మించి ఎన్నడూ ఒకరికొకరం దూరంగా లేము. ఇద్దరం కలిసి చివరిగా ఈ ఏడాది ఏప్రిల్‌లో భూటాన్ వెళ్లాం. అరుదైన పక్షుల ఫొటోలు తీశాం, అదే ఈ పుస్తకం" అని అన్నారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ సంధ్య, కవి అరణ్య కృష్ణ, సీనియర్ జర్నలిస్టు వనజ, సీత శ్రీనివాసరావు దంపతుల కుమారుడు విజయ్ పాల్గొన్నారు.


నాగాలాండ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిసిన ఆ రాష్ట్ర ప్రజలు

పోలీస్ కిష్టయ్య వర్ధంతిని తెలంగాణ అమరవీరుల దినంగా ప్రకటించాలి


పోలీస్ కిష్టయ్యకు నివాళులర్పిస్తున్న ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, అల్లం నారాయణ, పిట్టల రవీందర్, కిష్టయ్య భార్య పద్మ తదితరులు

పంజాగుట్ట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కిష్టయ్య వర్ధంతిని తెలంగాణ అమరవీరుల దినంగా ప్రకటించాలని, ఆయనను తొలి అమరుడిగా గుర్తించాలని వక్తలు డిమాండ్ చేశారు. పోలీస్ కిష్టయ్య స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కిష్టయ్య 15వ వర్ధంతి సందర్భంగా పిట్టల రవీందర్ అధ్యక్షతన స్మారకోపన్యాసం జరిగింది. టీజీఎస్పీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, రాష్ట్ర జైళ్ల శాఖ మాజీ ఐజీ ఆకుల నర్సింహ, ముదిరాజ్ సేవా సమితి అధ్యక్షుడు ఉప్పరి నారాయణ, యాదగిరి ముదిరాజ్, కిష్టయ్య భార్య పద్మ, కుమారుడు రాహుల్ తదితరులు ఆయనకు నివాళులర్పించారు. చక్రపాణి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమాన్ని అకడమిక్ అంశాలకు జోడించి, గ్రంథస్థం చేయలేకపోవడం పెద్ద వైఫల్యమని, ఉద్యమాన్ని మరింత విస్తృతం చేయడానికి పలువురు ఆత్మబలిదానాలు చేసుకున్నారని అన్నారు. కామారెడ్డిలో సెల్ టవర్ ఎక్కి తుపాకీతో కాల్చుకుని ఆత్మ బలిదానం చేసుకున్న తొలి అమరుడిగా పోలీస్ కిష్టయ్య నిలిచాడని కొనియాడారు. అల్లం నారాయణ మాట్లాడుతూ.. అమరుల త్యాగాలను పాఠ్యాంశంగా చేర్చాలని డిమాండ్ చేశారు. కిష్టయ్య విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ప్రతిష్ఠించాలని, పోలీస్ శాఖలో ఆయన పేరుతో స్మారక అవార్డు ప్రకటించి ఇవ్వాలని వక్తలు అన్నారు. త్వరలో సీఎం, సీఎస్, డీజీపీలను కలిసి వినతి పత్రం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో కిష్టయ్య కుటుంబ సభ్యులు, వివిధ సంఘాల నాయకులు, ట్రస్ట్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి క్షేత్రంలో శ్రీరామచంద్రుడి విగ్రహావిష్కరణ


శ్రీరామచంద్రుడి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ మల్లికార్జున్‌రావు, సత్యవాణి తదితరులు

మియాపూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అసలైన రామాయణాన్ని ప్రపంచానికి అందించాలనే ఉద్దేశంతో 2023లో ఆయోధ్యలో రామరాజ్య స్థాపన న్యాస్ స్థాపించడం జరిగిందని డాక్టర్ మల్లంపల్లి మల్లికార్జున్‌రావు అన్నారు. ఆదివారం మియాపూర్ ధర్మపురి క్షేత్రంలో శ్రీరామచంద్రుడి విగ్రహం, ధ్వజస్తంభ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అసలైన రామాయణం గురించి వివరించారు.

భారతీయం సత్యవాణి మాట్లాడుతూ.. రాముడు పాలించిన పలు అంశాలపై వివరించడానికే రామరాజ్య స్థాపన న్యాస్ ఏర్పడిందన్నారు. ఛండీగఢ్, హరియాణా, కాశీతోపాటు పలు ప్రాంతాల నుంచి వచ్చిన స్వాములు రామాయణం, రాముడి పాలన గురించి వివరించారు. కార్యక్రమంలో నవలా రచయిత శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

సన్మానం


విభిన్న సామర్థ్యంగల (డిఫరెంట్లీ ఏబుల్డ్ ఎంప్లాయీస్) ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం గాంధీభవన్‌లో జరిగిన కార్యక్రమంలో దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్యవర్మను సన్మానిస్తున్న దివ్యాంగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు


బాలమల్లేష్ అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వచ్చిన సీపీఐ అగ్రనేతలు

సీపీఐ నేత బాలమల్లేష్ అంత్యక్రియలు పూర్తి

మల్కాజిగిరి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సీపీఐ నేత ఎన్. బాలమల్లేష్ అంత్యక్రియలు యాప్రాల్‌లోని శ్మశానవాటికలో ఆదివారం నిర్వహించారు. పార్టీ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు బోసు, ఛాయాదేవి, నెల్లికంటి సత్యం, రాష్ట్ర సమితి సభ్యులు దామోదర్‌రెడ్డి, సృజన్‌కుమార్, స్టాలిన్, అంజయ్యనాయక్, ఏఐవైఎఫ్ ధర్మేంద్ర, సత్యప్రసాద్, ఏఐఎస్ఎఫ్ లక్ష్మణ్, పీవోడబ్ల్యూ సంధ్య, సీపీఐ ఎంఎల్ గోవర్ధన్, పలు పార్టీల నేతలు పాల్గొన్నారు.


ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులతో శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి, పల్లవి గ్రూఫ్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ కొమరయ్య తదితరులు

క్రీడాకారుల ప్రోత్సాహానికి ఈషా ఫౌండేషన్ కృషి అభినందనీయం

- శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి

నాచారం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 16వ ఈషా గ్రామోత్సవ క్రీడలు నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆవరణలో ఆదివారం ఘనంగా ముగిశాయి. శాట్స్ చైర్మన్ శివసేనా రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదన్నారు. అందులో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నారని, వచ్చే ఒలింపిక్స్‌లో రాష్ట్రం నుంచి గోల్డ్‌మెడల్ సాధించడమే లక్ష్యంగా క్రీడాకారులను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఈషా ఫౌండేషన్ చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో పల్లవి గ్రూఫ్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ కొమరయ్య, ప్రముఖ గాయకులు రామ్‌మిర్యాల, మంగ్లీ, హారిక నారాయణ్, ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ శిల్పారెడ్డి పాల్గొన్నారు.

మీ ఆస్తులు మెట్రో రైలు కోసం..

(5వ పేజీ తరువాయి)

నిర్మాణంలో వారికి సంబంధించిన ఇల్లు, భవనం ఎంతమేరకు పోతుందో కొలతలు, మ్యాపుల ద్వారా వారం రోజులుగా అవగాహన కల్పిస్తున్నారు.

నెలాఖరులోపు నోటిఫికేషన్లు పూర్తి

మొత్తం 1100 ఆస్తుల్లో ఇప్పటివరకు 800 ఆస్తులకు నోటిఫికేషన్ జారీచేశారు. మరో 300 ఆస్తులకు ఈనెలాఖరులోగా ప్రకటన ద్వారా తెలియజేయనున్నట్లు సమాచారం. కాగా, పాతబస్తీలో 90 శాతం మంది ముస్లింలు ఉండడంతో వారికి సంబంధించిన ఆస్తుల వివరాలను తెలియజేసేందుకు ఇంగ్లిష్, హిందీ భాషల్లో ప్రకటనలు విడుదల చేస్తున్నారు. మెజార్టీ ప్రజలు మెట్రో నిర్మాణానికి సహకరిస్తున్నప్పటికీ.. ప్రభుత్వం అందించే పరిహారం విషయానికి వస్తున్నప్పటికీ కొందరు అభ్యంతరం చెబుతున్నారని అధికారులు తెలిపారు. తాము వారం రోజులుగా దారుల్‌షిఫా ప్రాంతంలో స్థానికులకు అవగాహన కల్పిస్తున్నామని, ప్రభుత్వం న్యాయం చేస్తుందనే భరోసానిస్తున్నామని పేర్కొంటున్నారు. మొత్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదించిన 5 కారిడార్లలో ఓల్డ్‌సిటీ పనులు త్వరగా పట్టాలెక్కనున్నాయి.


ఐఐటీ హైదరాబాద్‌లో హాఫ్ మారథాన్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ చెన్నూరి రూపేష్

ఐఐటీహెచ్‌లో హాఫ్ మారథాన్

- ప్రారంభించిన సంగారెడ్డి జిల్లా ఎస్పీ రూపేష్
- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన మాలావత్ పూర్ణ

కంది, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ రన్నర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌లో ఆదివారం హాఫ్ మారథాన్ నిర్వహించారు. ఉదయం 5 గంటలకు ఐఐటీహెచ్‌లోని స్పోర్ట్స్ కాంప్లెక్స్ వద్ద సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. 21కే, 10కే, 5కే ఫన్‌రన్‌ల పేరిట నిర్వహించిన 21 కిలోమీటర్లు, 10 కిలోమీటర్లు, 5 కిలోమీటర్ల పరుగు పందాలలో 1500 మంది ఔత్సాహికులు పాల్గొన్నారు. ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన మాలావత్ పూర్ణ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనంతరం ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు ఐఐటీహెచ్ అధికారులు బహుమతులతోపాటు పాల్గొన్న ప్రతీ ఒక్కరికి మెడల్స్, ప్రశంసా పత్రాలను అందజేశారు.

జూనియర్ న్యాయవాదులను ఆదుకోండి

- సీఎం రేవంత్‌కు భారత ప్రజాన్యాయవాదుల సంఘం లేఖ

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జూనియర్ న్యాయవాదులకు ప్రతినెలా పదివేల రూపాయల నిర్ణీత వేతనం ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి భారత ప్రజాన్యాయవాదుల సంఘం సంయుక్త కార్యదర్శి డి. సురేష్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఎం. వెంకన్న విజ్ఞప్తి చేశారు. న్యాయవాద వృత్తిపై ఎన్నో ఆశలతో వచ్చిన జూనియర్ లాయర్ల పరిస్థితి దారుణంగా ఉందని, వారిని ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. న్యాయవాద వృత్తిలో నైపుణ్యం పెంచుకునేందుకు అవసరమైన పుస్తకాలు, సాఫ్ట్‌వేర్ కొనుగోలుకు రూ. 20వేలు గ్రాంటుగా ఇవ్వాలని. డ్రెస్‌కిట్‌కు రూ. 5వేలు మంజూరు చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి, బార్ కౌన్సిల్ చైర్మన్‌కు భారత ప్రజాన్యాయవాదుల సంఘం ప్రతినిధులు లేఖ రాశారు. బార్‌కౌన్సిల్‌లో నమోదు చేసుకున్న ప్రతీ న్యాయవాదికి ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని లేఖలో పేర్కొన్నారు.

జనరల్ ఆఫీసర్ కమాండింగ్‌గా మేజర్ జనరల్ అజయ్ మిశ్రా


మేజర్ జనరల్ అజయ్ మిశ్రా

అల్వాల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ, ఆంధ్రా సబ్ ఏరియా(టాసా) జనరల్ ఆఫీసర్ కమాండింగ్(జీవోసీ)గా మేజర్ జనరల్ అజయ్ మిశ్రా ఆదివారం బాధ్యతలు చేపట్టారు. మిశ్రా 1992లో 'రెజిమెంట్ ఆర్టిలరీ'లో నియమితులయ్యారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీ, ఖడక్వాస్లా, ఇండియన్ మిలటరీ అకాడమీ డెహ్రాడూన్ పూర్వ విద్యార్థి. డిఫెన్స్ సర్వీసెస్ స్టాఫ్ కాలేజ్ వెల్లింగ్టన్‌లో హయ్యర్ డిఫెన్స్ కోర్సు చేశారు. ఆర్మీవార్ కాలేజ్ మోవ్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. న్యూఢిల్లీలోని నేషనల్ డిఫెన్స్ కాలేజీలో ఎన్‌డీసీ కోర్సు కూడా చేశారు. త్రివిధ దళాల్లో అధికారులకు బోధన నైపుణ్యాన్ని అందించిన అనుభవం ఉంది. ఆయన సేవలకు గుర్తుగా రెండుసార్లు చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ కమెండేషన్ కార్డు అందుకున్నారు. అంకితభావంతో 'టాసా'ను నిర్వహిస్తానని జీవోసీగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా వెల్లడించారు.


పోలీస్‌గ్రౌండ్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు సీపీ విక్రమ్‌సింగ్‌మాన్, వెస్ట్‌జోన్ డీసీపీ విజయ్‌కుమార్, ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్

పుష్ప 2 వేడుకతో ట్రాఫిక్ ఆంక్షలు

యూసుఫ్‌గూడ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పుష్ప 2 సినిమా ప్రీ రిలీజ్ వేడుక యూసుఫ్‌గూడ పోలీస్‌గ్రౌండ్‌లో సోమవారం నిర్వహించనున్నారు. అదనపు సీపీ విక్రమ్‌సింగ్‌మాన్, వెస్ట్‌జోన్ డీసీపీ విజయ్‌కుమార్, ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ ఆదివారం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా సోమవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి కార్యక్రమం ముగిసే వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు.

మళ్లింపు ఇలా..

- అమీర్‌పేట నుంచి జూబ్లీహిల్స్, మాదాపూర్ వెళ్లే వాహనాలు యూసుఫ్‌గూడ బస్తీ నుంచి శ్రీనగర్‌కాలనీ, ఇందిరానగర్ కాలనీ మీదుగా జూబ్లీహిల్స్ వెళ్లాలి.
- జూబ్లీహిల్స్ నుంచి అమీర్‌పేట వెళ్లే వాహనాలు కృష్ణానగర్, శ్రీనగర్, పంజాగుట్ట మీదుగా వెళ్లాలి.
- యూసుఫ్‌గూడ మీదుగా బోరబండ వెళ్లే వాహనాలు యూసుఫ్‌గూడ బస్తీ నుంచి కృష్ణకాంత్‌పార్కు, జీటీఎస్ టెంపుల్ మీదుగా వెళ్లాలి.

వాహనాల పార్కింగ్ స్థలాలు

- కార్లను సవేరా ఫంక్షన్‌హాల్, మహమూద్ ఫంక్షన్ హాల్‌లో పార్క్ చేయాలి.
- ద్విచక్రవాహనాలను జానకమ్మతోట వద్ద పార్క్ చేయాలి. కార్లను కూడా పార్క్ చేయవచ్చు.

ఉస్మానియా బిస్కెట్ పరిచయకర్తకు బిగ్ ఇంపాక్ట్ అవార్డు



ఉస్మానియా బిస్కెట్‌ను నగరానికి పరిచయం చేసిన చార్మినార్ సమీపంలోని సుభాన్ బేకరీకి బిగ్ ఇంపాక్ట్ అవార్డు లభించింది. ఆహ్వానం హోటల్‌లో జరిగిన ఓ వేడుకలో బాలీవుడ్ నటి అమీషా పటేల్ అవార్డును బేకరీ అధినేత ఇర్ఫాన్‌కు అందజేశారు.

- హైదరాబాద్, సిటీ, ఆంధ్రజ్యోతి

ప్రాణాలు తీసిన మద్యం మత్తు

- కారుతో ద్విచక్రవాహనాలు, ఆటో ట్రాలీని ఢీకొట్టిన యువకుడు
- దంపతులు మృతి


దినేశ్‌గిరి, మోనా ఠాకూర్(ఫైల్)

కార్వాన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ యువకుడు కారు నడుపుతూ పలు వాహనాలను ఢీకొట్టాడు. ఈ ఘటనలో భార్యాభర్తలు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. వికారాబాద్ జిల్లాకు చెందిన ప్రైవేట్ ఉద్యోగి ప్రణయ్ శనివారం రాత్రి 10 గంటల సమయంలో రాజేంద్రనగర్ బండ్లగూడ ప్రాంతంలో మద్యం తాగి కారు నడుపుతూ లంగర్‌హౌస్ దర్గా ప్రాంతంలో మెహిదీపట్నం వైపు వెళ్తున్న మూడు ద్విచక్రవాహనాలు, ఆటోను ఢీకొట్టాడు. ద్విచక్రవాహనంపై వెళ్తున్న లంగర్‌హౌస్‌కు చెందిన మోనా ఠాకూర్, దినేశ్‌గిరి దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. వీరి ఇద్దరి కుమార్తెలు, మరో రెండు ద్విచక్రవాహనదారులు, ఆటో ట్రాలీ వెనుక కూర్చున్న వ్యక్తి స్వల్పంగా గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన దంపతులను ఉస్మానియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో చనిపోయారు. లంగర్‌హౌస్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొబ్బరి నీళ్లు తాగేద్దాం!

కొబ్బరి నీళ్లు ఆరోగ్యానికి మంచివని అందరికీ తెలుసు. వేసవికాలంలోనే కాదు చలికాలంలో కూడా తాగవచ్చు. కొబ్బరినీళ్లు తాగడం వల్ల శరీరానికి ఎన్నో పోషకాలు, ఖనిజాలు, మినరల్స్ అందుతాయి. చలికాలంలో కొబ్బరి నీళ్లు అందించే ఆరోగ్య ప్రయోజనాల గురించి తెలుసుకుందాం.



చర్మానికి : చలికాలంలో కొబ్బరినీళ్లు తరచూ తాగడం వల్ల శరీరంలో తేమ శాతం పెరుగుతుంది. దీనివల్ల చర్మం పొడారిపోకుండా మృదువుగా ఉంటుంది. ముఖంపై పగుళ్లు, మొటిమలు రాకుండా ఉంటాయి. రాత్రి పడుకునేముందు ముఖాన్ని కొబ్బరి నీళ్లతో కడిగితే మచ్చలు మాయమై చర్మం కాంతివంతంగా మారుతుంది.

రోగనిరోధక శక్తి: కొబ్బరి నీళ్లలో రెబోఫ్లేవిన్, నియాసిన్, థయామిన్, పిరిడాక్సిన్ విటమిన్లతోపాటు యాంటీ వైరల్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు అధికంగా ఉంటాయి. ఇవి శరీరానికి తక్షణ శక్తితోపాటు ఉత్సాహాన్ని, చురుకుదనాన్ని అందిస్తాయి. చలికాలంలో తరచూ వేధించే అనేక అనారోగ్య సమస్యలను తట్టుకునేందుకు అవసరమైన రోగనిరోధక శక్తిని పెంచుతాయి. కొబ్బరినీళ్లలో ఉండే సహజ చక్కెరలు, ఎలక్ట్రొలైట్లు శరీరాన్ని ఉత్తేజితం చేసి చలికాలంలో వచ్చే బద్ధకాన్ని పోగొడతాయి.

బరువు : కొబ్బరి నీళ్లలో కొవ్వు శాతం చాలా తక్కువగా ఉంటుంది. పీచు పదార్థాలు, పిండి పదార్థాలు ఎక్కువగా ఉంటాయి. అందుకే కొబ్బరి నీళ్లు తాగిన వెంటనే చాలా సమయం వరకు కడుపు నిండిన భావన ఉంటుంది. దీనివల్ల త్వరగా ఆహారం తీసుకోవాలని అనిపించదు. క్రమంగా శరీర బరువు నియంత్రణలోకి వస్తుంది. బరువు తగ్గాలనుకునేవారు ప్రతిరోజూ కొబ్బరినీళ్లు తాగితే మంచి ఫలితం కనిపిస్తుంది.

జీర్ణక్రియ : కొబ్బరినీళ్లు తాగడం వల్ల కడుపులో ప్రేగు కదలికలు సక్రమంగా ఉంటాయి. జీర్ణక్రియ సులభంగా జరుగుతుంది. మలబద్ధకం సమస్య రాదు. కొబ్బరి నీళ్లలోని అల్కలీన్ గుణాలు పొట్టలో పీహెచ్ స్థాయిని తటస్థం చేస్తాయి. దీనివల్ల కడుపులో మంట, అజీర్ణం వంటి సమస్యలు రావు. కాలేయం ఆరోగ్యంగా ఉంటుంది. కొబ్బరి నీళ్లలో ఉండే పొటాషియం శరీరంలోని అదనపు నీటిని, ఇతర వ్యర్థ పదార్థాలను బయటికి పంపుతుంది. రక్తపోటుని నియంత్రిస్తుంది. మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పకుండా కాపాడుతుంది.

గుండె : తరచూ కొబ్బరి నీళ్లు తాగడం వల్ల రక్త ప్రసరణ వ్యవస్థ అదుపులో ఉంటుంది. రక్తంలో చెడు కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్ స్థాయులు తగ్గుతాయి. దీనివల్ల గుండె సంబంధిత సమస్యలు రాకుండా ఉంటాయి. కొబ్బరి నీళ్లలో ఉండే మెగ్నీషియం శరీరంలో ఇన్సులిన్ పనితీరుని మెరుగుపరుస్తుంది. దీనివల్ల రక్తంలో చక్కెర స్థాయి నియంత్రణలో ఉంటుంది.

శక్తి : చలికాలంలో వ్యాయామం చేసిన తరవాత లేదంటే ఆటలు ఆడిన తరవాత శరీరానికి నిస్సత్తువ ఆవరిస్తుంది. ఇటువంటి సమయంలో వెంటనే కొబ్బరి నీళ్లు తాగితే శారీరక శ్రమ నుంచి ఉపశమనం లభిస్తుంది. కొబ్బరి నీళ్లలో ఉండే ఎలక్ట్రొలైట్లు, ఖనిజ లవణాలు తక్షణ శక్తిని అందిస్తాయి.

సి విటమిన్ లోపిస్తే...



విటమిన్ 'సి' మన ఆరోగ్యానికి అత్యవసరమైన పోషకం. రోగనిరోధక శక్తిని పెంచడంలో దీని పాత్ర కీలకం. గుండె, చర్మం, ఎముకలు, కండరాలు, దంతాలను ఆరోగ్యంగా ఉంచుతుంది. మన శరీరంలో విటమిన్ 'సి' లోపిస్తే వచ్చే అనారోగ్య సమస్యల గురించి తెలుసుకుందాం.

రక్తహీనత : మనం తీసుకునే ఆహారపదార్థాల నుంచి ముఖ్యంగా శాకాహారం నుంచి ఐరన్‌ను గ్రహించడంలో శరీరానికి సి విటమిన్ సహాయం తప్పనిసరి. విటమిన్ సి తగిన పరిమాణంలో లేని పక్షంలో శరీరానికి ఐరన్ అందక రక్తం ఉత్పత్తి కాదు. దీంతో రక్తహీనత సమస్య వస్తుంది. శాకాహారుల్లో ఈ సమస్య అధికంగా ఉంటుంది.

అంటువ్యాధులు : సి విటమిన్ లోపించడం వల్ల రోగనిరోధక శక్తి తగ్గుతుంది. ఫలితంగా పలు రకాల అంటువ్యాధులు వచ్చే ప్రమాదం ఉంటుంది. జలుబు, దగ్గు, జ్వరం, న్యుమోనియా వంటివి తరచూ వేధిస్తుంటాయి.

ఎముకలు విరగడం : ఎముకలు బలంగా ఉండేందుకు కావాల్సిన కాల్షియాన్ని శరీరం సంగ్రహించేందుకు సి విటమిన్ తోడ్పడుతుంది. దీని లోపం వల్ల శరీరం కాల్షియాన్ని శోషించుకోలేదు. ఫలితంగా ఎముకలు బలహీనమై ఆస్టియోపోరోసిస్ అనే వ్యాధి వస్తుంది. చిన్నపాటి ప్రమాద సంఘటనలకే ఎముకలు విరిగిపోతుంటాయి. గోళ్లు పెళుసుగా మారతాయి.

కండరాలు బలహీనం : సి విటమిన్ లోపిస్తే శరీరంలో 'కొల్లాజెన్' అనే ప్రొటీన్ ఉత్పత్తి కాదు. దీంతో కండరాలు, ఎముకల మధ్య అనుసంధానం దెబ్బతింటుంది. రక్తనాళాల గోడలు బలహీనమై కండరాల్లో వాపుని నొప్పిని కలిగిస్తాయి. గాయాలు తొందరగా నయం కావు.

దృష్టి దోషాలు : శరీరానికి సి విటమిన్ అందకపోతే తొందరగా వార్ధక్య లక్షణాలు ఎదురవుతాయి. కంటిచూపును అందించే రెటీనాలో ప్రధాన భాగమైన మాక్యులాలో అసాధారణ స్రావాలు విడుదలవుతాయి. దీంతో మాక్యులా పొరలు ఉబ్బి కంటి చూపు మందగిస్తుంది. రంగులను గుర్తించడం కష్టమవుతుంది.

అలసట: సి విటమిన్ లోపం కారణంగా శరీరంలో శక్తి ఉత్పత్తి వ్యవస్థ దెబ్బతింటుంది. దీంతో శరీరానికి కావాల్సిన శక్తి లభించక ఎప్పుడూ నీరసంగా, బలహీనంగా అనిపిస్తుంది. ఎంత బలమైన ఆహారం తీసుకున్నప్పటికీ అలసటగా, మత్తుగా అనిపిస్తుంది. ఏకాగ్రత కుదరక మానసిక సమస్యలు ఏర్పడతాయి.

నోటి సమస్యలు: విటమిన్ సి లోపం వల్ల దంతాలు, చిగుళ్లు బలహీనమవుతాయి. డెంటిన్ అనే పదార్థం ఏర్పడక పోవడంతో దంతాల్లోని రక్తనాళాలు పెళుసుగా మారతాయి. పళ్లు తోముతున్నపుడు కలిగే చిన్నపాటి ఒత్తిడికే రక్తనాళాలు చిట్లి చిగుళ్ల నుంచి రక్తం స్రవిస్తుంది. చిగుళ్లలో వాపు, నొప్పి కూడా బాధిస్తుంటాయి.

సుస్వర సంగీత ఝరి

సినీ కుటుంబ నేపథ్యం. కానీ పరిశ్రమ వైపు వెళ్లలేదు. సంగీత సాగరంలో తనకంటూ కొన్ని తీపి గుర్తులు ఉండాలనే తాపత్రయం. అందుకే మూడు దశాబ్దాలుగా స్వర సంగమంలో మునిగిపోయారు. వేదికలెక్కి... వేల ప్రదర్శనలు ఇచ్చి... ప్రతిష్ఠాత్మక 'ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ యువ పురస్కారం' అందుకున్నారు. అలనాటి ప్రముఖ నటుడు 'రక్తకన్నీరు' నాగభూషణం మనవరాలు... కర్ణాటక సంగీత కళాకారిణి... శ్వేతా ప్రసాద్‌తో 'నవ్య' ముచ్చట్లు.



"ఒకరి పేరు చెప్పుకొని కాదు... మనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు ఉండాలనేది నా అభిమతం. అందుకు నేను ఎంచుకున్న మార్గం సంగీతం. మూడేళ్లప్పుడు మొదలుపెట్టాను. మూడు దశాబ్దాలుగా పాడుతూనే ఉన్నాను. సరిగమల ప్రవాహంలో సాగిపోతున్నాను. దానికి ప్రతిఫలమే ఇటీవల నేను అందుకున్న 'ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ యువ పురస్కారం'. నాకు 2022 సంవత్సరానికి గానూ కర్ణాటక సంగీతంలో వచ్చింది. ఢిల్లీలో 'కేంద్ర సంగీత నాటక అకాడమీ' ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ అవార్డులను ప్రదానం చేశారు. యువ కళాకారులకు ఇది 'పద్మశ్రీ'తో సమానం. స్వయంకృషితో ఎదిగి, ఇంతటి ప్రతిష్ఠాత్మక పురస్కారం తీసుకోవడం సంతోషంగా ఉంది. ఎంతో గర్వంగా అనిపిస్తోంది.

సంగీత జ్ఞానం ఉన్నవారే...

సంగీతాభిరుచి నాకు మా నాయనమ్మ శశిరేఖ నుంచి వచ్చింది. ఆవిడ కర్ణాటక సంగీతం చాలా బాగా ఆలపిస్తారు. మా తాత నాగభూషణం గారి 'రక్తకన్నీరు' నాటకానికి చాలా ఏళ్లు నాయనమ్మే పాడేవారట. నాన్న రవీంద్రనాథ్‌ది మేనరికం. మా అమ్మ ప్రసన్నకు మేనత్తే మా నాయనమ్మ. అమ్మ వైపు అందరికీ సంగీతంలో ప్రవేశం ఉంది. ఒకరు వయొలిన్ వాయించేవాళ్లు. ఒకరు హార్మోనియం... మరొకరు గాత్రం. కాకపోతే ఎవరూ ఎక్కడా నేర్చుకోలేదు. అలా నాకూ నాయనమ్మ వారసత్వం వచ్చింది. నేను పుట్టి పెరిగింది హైదరాబాద్‌లోనే. సంగీతంలో రామలక్ష్మి రంగాచారి గారు నా తొలి గురువు. ఐదారేళ్ల తరువాత నేతి శ్రీరామ్ గారి వద్ద శిష్యరికం చేశాను. మొత్తం పదహారేళ్లపాటు సంగీతం నేర్చుకున్నాను. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బీకాం తరువాత ఎంఏ మ్యూజిక్ చదివాను. ప్రస్తుతం కర్ణాటక సంగీతంలో ఎంఫిల్ చేస్తున్నాను.

పిలిచి పాడించేవారు...

పదో ఏట నుంచే కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శనలకు పాడేదాన్ని. మా తాతగారిని కలవడానికి పెద్ద పెద్ద నటులు, నాయకులు ఇంటికి వచ్చేవారు. నన్ను పిలిచి... 'ఇది నా మనవరాలు. బ్రహ్మాండంగా పాడుతుంది... వినండి' అని నాతో వాళ్ల ముందు పాడించేవారు. ఎక్కువగా కమ్యూనిస్టు పాటలు పాడమనేవారు. నాయనమ్మకు పక్షవాతం వచ్చి పన్నెండేళ్లు మంచం మీదే ఉన్నారు. అప్పట్లో తను సొంతంగా రాసుకున్న గీతాలు నేను పాడి వినిస్తుంటే ఎంతో ఉద్వేగానికి లోనయ్యేవారు. తాత కూడా కన్నీళ్లు పెట్టుకొనేవారు.

ఆ ఇద్దరూ భలే ఇష్టం...

తాత గారికి ఐదుగురు సంతానం. ముగ్గురు అబ్బాయిలు, ఇద్దరు అమ్మాయిలు. ఇక మా ఇంట్లో నేనే పెద్దదాన్ని. తమ్ముడు కౌశిక్ హోటల్ మేనేజ్‌మెంట్ చదివి, అదే రంగంలో స్థిరపడ్డాడు. చిన్నప్పుడు తాతయ్య మాతో చాలా సరదాగా గడిపేవారు. మా మధ్య చాలా సంభాషణలు జరిగేవి. 'రోజూ మేకప్ వేసుకొని తీయాలంటే చికాగ్గా ఉండదా' అని అడిగితే... 'అవునే..! మేకప్ కోసం తెల్లవారుజాము మూడింటికి లేచేవాడిని. మంచం మీద పడుకొంటే ముఖానికి రంగు వేసేసేవాళ్లు' అనేవారు నవ్వుతూ. నచ్చిన నటులు ఎవరని అడిగేవాళ్లం. ఆయన ఎప్పుడూ జయప్రద గారి గురించి గొప్పగా చెప్పేవారు. 'ఏంటోనే... ఆ అమ్మాయిని చూస్తుంటే అమ్మవారిలా అనిపిస్తుంది. ఏం అందం ఆ అమ్మాయిది' అనేవారు. ఆవిడ కూడా తాతయ్యను ఆప్యాయంగా 'డాడీ' అని పిలిచేవారు. అలాగే సూర్యకాంతం గారి వ్యక్తిత్వం ఆయనకు బాగా నచ్చేది. ఇద్దరూ 'ఒరేయ్ అన్నయ్యా' అంటే 'ఒరేయ్ అన్నయ్యా' అని పిలుచుకొనేవారట. ఆవిడ మహా సరదా మనిషిట. షూటింగ్‌లో కాస్త ఖాళీ దొరికితే చాలు... 'ఒరేయ్ అన్నయ్యా... రా ఆడుకొందాం' అని ఎడం చేత్తో పేక ముక్కలు అలా వేసిపడేసేవారట. ఫ్రీగా ఆడమంటే అస్సలు ఒప్పుకొనేవారు కాదుట. డబ్బులకు తప్ప ఆడేవారు కాదుట. ఇంట్లో అందరికీ వండి పెట్టడమంటే సూర్యకాంతం గారికి మహా ఇష్టమని చెప్పేవారు తాతయ్య.

ఎందుకో ఒప్పుకోలేదు...

నేను ఎనిమిదో తరగతిలో ఉండగా మా తాత చనిపోయారు. ఎందుకో తెలియదు... ఆయన తన పిల్లలు ఎవర్నీ సినిమాల్లోకి రానీయలేదు. నేను పుట్టేనాటికి... అంటే 1983కు ముందే పరిశ్రమతో సంబంధాలు తెంచుకుని హైదరాబాద్‌కు వచ్చేశారు. మా నాన్న కోసం దాసరి నారాయణరావు తదితరులు బోల్డెన్ని కథలు రాసుకున్నారు. 'రవిబాబు కోసం నేను ఈ కథ రాసుకున్నా. బాబును నాకు వదిలెయ్... ఐదేళ్లలో సూపర్‌స్టార్‌ను చేస్తా' అనేవారు దాసరి. నాన్నది మంచి పర్సనాలిటీ. చూడ్డానికి చాలా బాగుంటారు. అయితే తాత గారు ససేమిరా అన్నారు. 'ఏమైనా చెప్పండి. అటువైపు నా పిల్లలను పంపించను' అని తెగేసి చెప్పేవారట. నేను కూడా కీరవాణి, కోటి, మణిశర్మ గార్ల సినిమాలకు పదేళ్లపాటు కోరస్ పాడాను. అదికూడా తాతకు నచ్చేది కాదు. 'ఎందుకు పంపిస్తున్నావురా పిల్లని' అని నాన్నపై కోప్పడేవారు. నలభై ఏళ్లకు పైగా పరిశ్రమలో ఉన్న ఆయన అంత కచ్చితంగా చెబుతున్నారంటే ఆలోచించాలి కదా!

వేల ప్రదర్శనలు...

ప్రస్తుతం నాకు, మావారు రేణుకా ప్రసాద్‌కు సంగీతమే వృత్తి. ఇదే మా జీవితం. ఆయన మృదంగం వాయిస్తారు. నట్టువాంగం చేస్తారు. మాకు ఒకతే అమ్మాయి... ప్రసిద్ధ. ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. వయొలిన్ బ్రహ్మాండంగా వాయిస్తుంది. నేను, మావారు ఇప్పటికి మూడు వేల ప్రదర్శనల వరకు ఇచ్చివుంటాం. ఏటా అమెరికా వెళతాం. కచేరీలు, గెస్ట్ లెక్చరర్స్ ఇస్తాం. సంగీత తరగతులు, వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నాం. శోభానాయుడు గారికి పాతికేళ్లు పాడాను. ఆనంద్ శంకర్, స్వప్నసుందరి తదితర ప్రముఖ నాట్యకారులందరికీ నేనే పాడుతున్నాను. ఇవి కాకుండా ఎన్నో కచేరీలు చేశాను. తమన్ గారు అడిగితే 'సర్కారువారి పాట' చిత్రంలోని 'కళావతి' పాటలో జతులు ఆలపించాను. నాని 'అంటే సుందరానికి' చిత్రం 'పంచె కట్టు' పాట తమిళం, మళయాళం వెర్షన్లు పాడాను. ఇంతకుమించి సినిమా పాటలు పాడలేదు.

పెద్దగా కోరికలు లేవు...

కొవిడ్ సమయంలో సంపాదన లేక కొన్ని రోజులు ఇబ్బంది పడినా... అమ్మవారి దయవల్ల మా జీవితం ఇప్పుడు సంతోషంగా సాగిపోతోంది. మాది పదహారు మంది ఉన్న ఉమ్మడి కుటుంబం. కోట్లు సంపాదించాలి... బెంజిలో తిరగాలనే కోరికలేవీ మాకు లేవు. ముప్పై ఏళ్లుగా పాడుతున్నాం. వచ్చిన డబ్బుతో ఇల్లు కొనుక్కున్నాం. కారు ఉంది. ఇబ్బందులు లేకుండా సంసారం సాగిపోవడానికి సరిపడా సంపాదన వస్తోంది. ఒక మనిషి ఆనందంగా జీవించడానికి ఇంతకంటే ఏంకావాలి! చుట్టూ మన అనుకొనే మనుషులు... నాలుగు కచేరీలు ఉంటే చాలు మాకు."

• హనుమా



అమ్మవల్లే ఇక్కడివరకు...

సంగీతంలో నేను ఈ స్థాయికి రావడానికి మా అమ్మే కారణం. చిన్నప్పుడు సంగీత తరగతులకు వెళ్లనని ఏడ్చేదాన్ని. అయినా అమ్మ వినేది కాదు. 'నీకు భగవంతుడు మంచి గొంతు ఇచ్చాడు. నువ్వు ఏమైనా చెయ్యి. క్లాస్‌కు వెళ్లాల్సిందే' అనేది. ఎక్కడ పోటీలున్నా వెంటబెట్టుకుని తీసుకువెళ్లేది. నేను సంగీతం నేర్చుకోవడానికి ఏంకావాలన్నా చేసేది. పెళ్లయ్యాక మావారు, అత్తగారు కూడా అంతే ప్రోత్సహించారు. అమ్మ ప్రేరణ, అత్తింటివారి సహకారంవల్లే ఇదంతా సాధ్యమైంది.

తాతగారి కోసం రాస్తే...

'ముత్యాలముగ్గు'లో రావుగోపాలరావు గారు పోషించిన పాత్రను వాస్తవానికి బాపూ గారు తాతయ్య కోసం రాసుకున్నారు. ఎంత అడిగినా 'నేను చేయాలనుకోవడంలేదు' అని తాత చెప్పేశారు. సినిమాలు వదిలేసినప్పుడు చెన్నైలో ఆస్తులన్నీ అమ్మేసుకుని ఇక్కడ చిన్న ఇల్లు కొనుక్కుని స్థిరపడ్డారు. ఆ నిర్ణయం ఎందుకు తీసుకున్నారో ఇప్పటికీ ఆయన పిల్లలు ఎవరికీ తెలియదు. ప్రస్తుతం మాకు పరిశ్రమలో ఎవరితో సంబంధాలు లేవు. అయితే జూనియర్ ఎన్టీఆర్ నాకు కజిన్ అవుతాడు. వాళ్లమ్మ శాలిని గారు, మా అమ్మ కజిన్ సిస్టర్స్. చిన్నప్పుడు తారక్ కూచిపూడి నాట్యానికి నేను గాత్ర సహకారం అందించేదాన్ని. ఇప్పుడు అతను బాగా బిజీ అయిపోయాడు. వాళ్లమ్మకు, మా అమ్మకు ఇప్పటికీ ఎంతో సాన్నిహిత్యం ఉంది. అలాగే బాలు గారితో మా నాన్నకు మంచి స్నేహం. ఇద్దరూ చెన్నైలో పక్క ఇళ్లల్లో ఉండేవారు.



కాలేయాన్ని కాపాడుకుందాం!

కాలేయం మన శరీరంలో అత్యంత ముఖ్యమైన అవయవం. శరీరంలో చేరిన విష పదార్థాలను, ఇతర వ్యర్థాలను తొలగించడంలో ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఏదైనా సమస్య వచ్చినపుడు కాలేయం తనంతట తాను మరమ్మతు చేసుకుంటుంది. మనం తీసుకునే కొన్ని ఆహార పదార్థాలు కూడా ఇందుకు సహకరిస్తాయి. వాటి గురించి తెలుసుకుందాం.

వెల్లుల్లి

● ఇందులో సల్ఫర్‌తోపాటు అల్లిసిన్, సిలీనియం లాంటి రసాయన సమ్మేళనాలు ఉంటాయి. శరీరంలోని వ్యర్థాలను బయటికి పంపేందుకు కాలేయంలో ఉత్పత్తయ్యే ఎంజైముల తయారీకి ఇవి తోడ్పడతాయి. వెల్లుల్లిని ఆహార పదార్థాల్లో చేర్చుకోవడం ద్వారా కాలేయం పనితీరు మెరుగుపడుతుంది.

బీట్‌రూట్

● తరచూ బీట్‌రూట్ రసం తీసుకోవడం వల్ల అందులోని బీటాలైన్ సమ్మేళనాలు కాలేయంలోని ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గిస్తాయి. బీట్‌రూట్‌లో ఉండే పలు నైట్రేట్‌లు కాలేయంలో వ్యర్థాలు పేరుకోకుండా చేస్తాయి.

గ్రీన్ టీ

● తరచూ గ్రీన్ టీ తాగడం వల్ల కాలేయంలో ఎంజైమ్‌ల ఉత్పత్తి నియంత్రణలో ఉంటుంది. గ్రీన్ టీలోని యాంటీ ఆక్సిడెంట్లు కాలేయంలోని వ్యర్థాలను కరిగించి మూత్రం ద్వారా బయటికి వెళ్లేలా చేస్తాయి.

ఆకు కూరలు


● ఆకు కూరల్లో క్లోరోఫిల్ అధికంగా ఉంటుంది. ఇది రక్తంలో చేరిన భార ఖనిజాలు, పురుగు మందుల అవశేషాలు, ఇతర రసాయనాలను తొలగించడంలో కాలేయానికి సహాయం చేస్తుంది. ఆకుకూరలు, ముదురు ఆకుపచ్చ రంగులో ఉండే కూరగాయలను తరచూ తినడం వల్ల కాలేయంపై పని భారం తగ్గుతుంది.

ఆలివ్ ఆయిల్

● దీనిలో ఆరోగ్యకరమైన కొవ్వు పదార్థాలు ఉంటాయి. ఇవి శరీరంలో చేరిన కొన్ని రకాల విష పదార్థాలను శోషించుకుంటాయి. ప్రతిరోజూ తినే ఆహార పదార్థాల్లో ఆలివ్ ఆయిల్‌ను చేర్చుకోవడం వల్ల కాలేయంపై పని ఒత్తిడి తగ్గుతుంది.

ధనియాలు

● ఒక గ్లాసు నీటిలో ఒక చెంచా ధనియాలు వేసి రాత్రంతా నానబెట్టి ఉదయాన్నే పరగడుపున తాగితే కాలేయంలో వ్యర్థాలు మిగలకుండా ఉంటాయి.



ధనియాల్లో ఉండే పీచు పదార్థాలు, ఫోలిక్ యాసిడ్‌లు ప్రభావవంతంగా పనిచేసి కాలేయాన్ని శుభ్రపరుస్తాయి.

వాల్‌నట్స్

● వీటిలో ఒమేగా 6, ఒమేగా 3 ఫాటీ యాసిడ్లు అధికంగా ఉంటాయి. ఇవి కాలేయంలో కొవ్వులు పేరుకోకుండా చేస్తాయి. వాల్‌నట్స్ తినడం వల్ల వాటిలోని అర్జినైన్ అనే అమైనో ఆమ్లం శరీరం నుంచి అమ్మోనియాను తొలగించడంలో కాలేయానికి సహకరిస్తుంది.

బాదం

● బాదం పప్పులో ఇ విటమిన్ ఉంటుంది. ఇది కాలేయంలోని ఆక్సీకరణ ఒత్తిడితో పోరాడుతుంది. కాలేయం ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతిరోజూ కనీసం అయిదు బాదం పప్పులను నీటిలో నానబెట్టి తినాలి.

పండ్లు

● నిమ్మ, నారింజ, బత్తాయి లాంటి సిట్రస్ పండ్లను తరచూ తినడం వల్ల శరీరానికి పుష్కలంగా సి విటమిన్ అందుతుంది. ఇది శరీరంలో చేరిన వ్యర్థాలను పూర్తిగా తొలగించి కాలేయానికి విశ్రాంతిని ఇస్తుంది. యాపిల్ పండ్లను తినడం వల్ల వాటిలో ఉండే పెక్టిన్ అనే పీచు పదార్థం కాలేయాన్ని పూర్తిగా శుభ్రం చేస్తుంది. నల్ల ద్రాక్షను జ్యూస్‌లా చేసుకుని తాగితే అందులోని యాంటీ ఆక్సిడెంట్లు కాలేయంలో ఇన్‌ఫ్లమేషన్‌ని తగ్గిస్తాయి.

నవ్య | చిత్రజ్యోతి


ఈ సినిమా ఆ లోటు తీరుస్తుంది

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు జీవితం ఆధారంగా తెరకెక్కుతోన్న చిత్రం 'ఘంటసాల ది గ్రేట్'. కృష్ణ చైతన్య టైటిల్ రోల్ పోషిస్తున్నారు. సిహెచ్. రామారావు దర్శకత్వంలో సిహెచ్.ఫణి నిర్మించారు. తాజాగా, ఈ సినిమా రిలీజ్ డేట్ పోస్టర్‌ను మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 14న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ "ఈతరం ఘంటసాల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది. అందరూ ఆయన్ని శతాబ్ది గాయకుడు అంటారు. నేను ఆయన్ని అమర గాయకుడు అంటాను. సంగీతం ఉన్నంత కాలం ఆయన ప్రజల మనసుల్లో ఉంటారు. కృషితో నాస్తి దుర్భిక్షం, వినయంతో విద్య ప్రకాశిస్తుందని చెప్పడానికి నిలువెత్తు నిదర్శనం ఆయన. దేశంలో ఇప్పటివరకూ ఏ గాయకుడి మీద పూర్తి స్థాయి సినిమా రాలేదు. ఈ సినిమా ఆ లోటును తీరుస్తుంది" అని అన్నారు.

మార్చిలో మొదలు




మేర్లపాక గాంధీ దర్శకత్వంలో వరుణ్‌తేజ్ కథానాయకుడిగా ఓ చిత్రాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. యువీ క్రియేషన్స్, ఫస్ట్‌ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ భారీస్థాయిలో నిర్మిస్తున్నాయి. ఈ సినిమా షూటింగ్‌పై ఆదివారం మేకర్స్ నుంచి అప్డేట్ వచ్చింది. 'మేర్లపాక గాంధీ అద్భుతమైన స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారు, వరుణ్ తేజ్ పాత్ర సరికొత్తగా ఉండబోతోంది. ప్రేక్షకులను ఆకట్టుకునే అన్ని అంశాలతో ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ జరుగుతోంది, వచ్చే ఏడాది మార్చిలో చిత్రీకరణ ప్రారంభిస్తామ'ని తెలిపారు.

తుదిదశలో చిత్రీకరణ




ప్రభాస్ కథానాయకుడిగా మారుతి రూపొందిస్తున్న హారర్ థ్రిల్లర్ 'రాజా సాబ్'. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. మాళవికా మోహనన్ కథానాయికగా నటిస్తున్నారు. ఓ ఇంటర్వ్యూలో మాళవిక 'రాజాసాబ్' షూటింగ్ గురించి ఆసక్తికర అంశాలను పంచుకున్నారు. "రాజాసాబ్' షూటింగ్ తుది దశకు చేరుకుంది. మంచి ప్లానింగ్‌తో మారుతి షూటింగ్ కొనసాగిస్తున్నారు. ఆయన త్వరలోనే ఆశ్చర్యపోయే అప్‌డేట్ ఇవ్వబోతున్నారు' అన్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 10న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. టీజీ విశ్వ ప్రసాద్, వివేక్ కూచిబొట్ల నిర్మిస్తున్న ఈ చిత్రానికి తమన్ సంగీతం అందిస్తున్నారు.

మహేశ్‌బాబు ఎంజాయ్ చేశారు



2019లో వచ్చిన 'ది లయన్ కింగ్' చిత్రానికి కొనసాగింపుగా వస్తున్న చిత్రం 'ముఫాసా: ది లయన్ కింగ్'. బారీ జెన్‌కిన్స్ దర్శకత్వం వహించారు. వాల్ట్ డిస్నీ పిక్చర్స్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న విడుదలవుతోంది. ఈ చిత్రం తెలుగు వెర్షన్‌లో ముఫాసా పాత్రకు హీరో మహేశ్‌బాబు డబ్బింగ్ చెప్పారు. ఆదివారం చిత్రబృందం నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ముఫాసా, మహేశ్‌బాబు ప్రచార చిత్రాన్ని నమ్రతా శిరోద్కర్ ఘట్టమనేని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'డిస్నీ సంస్థ ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన చిత్రమిది. ఇలాంటి మంచి సినిమాను ఔచిత్యం చెడకుండా డబ్ చేయడం ఓ సవాల్ అనే చెప్పాలి. డిస్నీ సంస్థ చాలా శ్రమించి ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తోంది. చాలా ఎంజాయ్ చేస్తూ 'ముఫాసా' పాత్రకు మహేశ్‌బాబు డబ్బింగ్ చెప్పారు. ఈ చిత్రం తప్పకుండా తెలుగు ప్రేక్షకులకు నచ్చుతుంది' అన్నారు. ఈ సందర్భంగా ముఫాసా చిత్రబృందం రూపొందించిన మహేశ్‌బాబు పోస్టర్‌ను నమ్రత ఆవిష్కరించారు. సత్యదేవ్, అలీ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అద్భుత ప్రయాణం ముగిసింది



మలయాళ కథానాయకుడు మోహన్‌లాల్, పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో నటిస్తున్న చిత్రం 'లూసిఫర్ 2: ఎంపురన్'. 2019లో విడుదలై ఘనవిజయం సాధించిన 'లూసిఫర్' సినిమాకు ఇది కొనసాగింపు. లైకా ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. తాజాగా, ఈ సినిమా షూట్ పూర్తైనట్లు మోహన్‌లాల్ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా తెలిపారు. "లూసిఫర్ సినిమా షూట్ పూర్తైంది. 14 నెలలుగా ఎనిమిది రాష్ట్రాలు.. యూఎస్ఏ.. యూకే.. యూఏఈలోని అద్భుతమైన లోకేషన్లలో చిత్రీకరించాం. అద్భుత ప్రయాణమిది. ప్రతి ఫ్రేమ్‌ని తన సృజనాత్మకతతో మరో స్థాయికి తీసుకెళ్ళే అపార ప్రతిభ పృథ్వీరాజ్ సొంతం. తన కలం పదునుతో సినిమాకు ఎంతో ప్రత్యేకతను తెచ్చిన మురళీ గోపికి.. ఈ ప్రాజెక్ట్‌పై ఎంతో నమ్మకం పెట్టిన నిర్మాతలకు ధన్యవాదాలు. టీమ్ సమష్టి కృషి వల్లే ఈ సినిమా సాధ్యమైంది. నా సినీ ప్రయాణంలో ఈ సినిమా ఓ మైలురాయి. అభిమానులు అందించే ప్రేమే మాలో స్ఫూర్తిని పెంచింది" అని పేర్కొన్నారు. వచ్చే ఏడాది మార్చి 27న ఈ సినిమా విడుదలవుతోంది.

ఎక్స్ ఖాతా డిలీట్



నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమ్ అవుతోన్న 'నయనతార: బియాండ్ ద ఫేరీ టేల్' డాక్యుమెంటరీ విషయంలో ధనుశ్, నయనతార మధ్య మొదలైన వివాదం తెలిసిందే. 'నానుమ్ రౌడీ దాన్' సినిమాలోని కొన్ని సెకన్ల ఫుటేజిని వాడారని.. అందుకోసం ధనుశ్.. నయనతార, విఘ్నేష్ శివన్ కోర్టు నోటీసులు పంపారు. అయితే, ఇటీవలే 'నానుమ్ రౌడీ దాన్' సినిమాలోని క్లిప్ ఉచితంగా చూసేయ్యండి అనే వీడియోతో పాటు ధనుశ్ ఓ మీడియా ఈవెంట్‌లో మాట్లాడిన వీడియోనూ ఇన్‌స్టా స్టోరీలో పోస్ట్ చేశారు విఘ్నేశ్. ధనుశ్ అభిమానుల నుంచి ట్రోలింగ్ జరిగేసరికి ధనుశ్ వీడియోను తొలగించారు. తాజాగా, తాను అజిత్ నటించిన 'ఎన్నై అరిందాల్' (ఎంతవాడు కానీ) సినిమా కోసం ఓ పాట రాశాననీ.. అదే టైమ్‌లో తన మొదటి మూవీ 'నానుమ్ రౌడీ దాన్'ని చూసి ఆయన మెచ్చుకున్నారని తెలిపారు. ఇవన్నీ అబద్ధాలంటూ.. అజిత్ సినిమా రిలీజైన ఏడు నెలలకు 'నానుమ్ రౌడీ దాన్' విడుదలైందని.. అసలు థియేటర్లలోకి సినిమా రాకముందే అజిత్ ఎలా చూశారని ధనుశ్ అభిమానులు విఘ్నేష్‌ను ట్రోల్ చేశారు. దీంతో విఘ్నేష్ శివన్ తన ఎక్స్ ఖాతాను డిలీట్ చేశారు.

ఆటోకి పెళ్లి కళ



నవంబరు నెల వాహన విక్రయాల్లో వృద్ధి

న్యూఢిల్లీ: ప్రస్తుతం వివాహాల సీజన్ జరుగుతున్న నేపథ్యంలో దేశంలో కార్ల మార్కెట్ జోరందుకుంది. నవంబరులో మారుతి సుజుకీ, టాటా మోటార్స్, టయోటా కిర్లోస్కర్ మోటార్ అమ్మకాల్లో వృద్ధిని నమోదు చేశాయి. ప్రధానంగా గ్రామీణ మార్కెట్లలో ఏర్పడిన రికవరీ, ఎస్‌యూవీలకు ప్రజల నుంచి లభిస్తున్న బలమైన డిమాండ్ కూడా అమ్మకాలు పుంజుకోవడానికి దోహదపడ్డాయి. ఈ నేపథ్యంలో ప్రధాన కంపెనీలన్నీ అమ్మకాల్లో వృద్ధి సాధించాయి. మార్కెట్ దిగ్గజమైన మారుతి సుజుకీ నవంబరులో 1,41,312 కార్లను విక్రయించింది. గత ఏడాది నవంబరులో విక్రయించిన 1,34,158 యూనిట్లతో పోల్చితే 5 శాతం వృద్ధిని నమోదు చేసింది. ప్రధానంగా గత నెలలో గ్రామీణ మార్కెట్లలోకి తమ కంపెనీ విస్తరణ 48.7 శాతం ఉన్నట్టు కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థో బెనర్జీ చెప్పారు. బ్రెజ్జా, ఎర్టిగా, గ్రాండ్ విటారా, ఎక్స్‌ఎల్6 వంటి యుటిలిటీ కార్ల అమ్మకాలు పెరిగాయని ఆయన అన్నారు. అయితే ఆల్టో, ఎస్-ప్రెసో వంటి మినీ కార్లు, బాలెనో, సెలేరియో, డిజైర్, ఇగ్నిస్, స్విఫ్ట్, వ్యాగన్ ఆర్ వంటి కాంపాక్ట్ కార్ల విక్రయాలు మాత్రం తగ్గాయని తెలిపారు.

- హ్యుండయ్ మోటార్ ఇండియా విక్రయాలు మాత్రం గత నవంబరుతో పోల్చితే 2 శాతం తగ్గి 49,451 నుంచి 48,246 యూనిట్లకు పరిమితం అయ్యాయి. ఎగుమతులు కూడా 20 శాతం తగ్గాయి. అయితే గ్రామీణ విక్రయాల వాటా మాత్రం 22.1 శాతానికి పెరిగింది.
- టాటా మోటార్స్ 2 శాతం, టయోటా కిర్లోస్కర్ మోటార్ 44 శాతం, జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్స్ 20 శాతం వృద్ధిని సాధించాయి.
- ద్విచక్ర వాహన సంస్థ టీవీఎస్ మోటార్ విక్రయాలు 10 శాతం పెరిగి 4,01,250 యూనిట్లకు చేరుకోగా సుజుకీ మోటార్ సైకిల్ విక్రయాలు 8 శాతం వృద్ధితో 94,370 యూనిట్లుగా నమోదయ్యాయి.

టాప్ గేర్‌లో విదేశీ పెట్టుబడులు

ఆరు నెలల్లో రూ.2.52 లక్షల కోట్లు
ఏడో స్థానంలో తెలంగాణ

న్యూఢిల్లీ: భారత్‌లోకి వచ్చే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) మళ్లీ ఊపందుకున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) తొలి ఆరు నెలల్లో (ఏప్రిల్-సెప్టెంబరు) భారత్ 2,979 కోట్ల డాలర్ల (సుమారు రూ.2.51 లక్షల కోట్లు) ఎఫ్‌డీఐని ఆకర్షించింది. గత ఏడాది ఇదే కాలంతో వచ్చిన 2,050 కోట్ల డాలర్లతో పోలిస్తే ఇది 45 శాతం ఎక్కువ. ఈ ఆరు నెలల్లో ఎఫ్‌డీఐని ఆకర్షించడంలో మహారాష్ట్ర 1,355 కోట్ల డాలర్లు (రూ.1,14,490 కోట్లు), కర్ణాటక 354 కోట్ల డాలర్ల (రూ.29,800 కోట్లు)తో తొలి రెండు స్థానాల్లో ఉండగా తెలంగాణ 154 కోట్ల డాలర్ల (రూ.13,000 కోట్లు)తో ఏడో స్థానంలో నిలిచింది. ఏప్రిల్-సెప్టెంబరు మధ్య కాలంలో వచ్చిన 2,979 కోట్ల డాలర్ల ఎఫ్‌డీఐలో 1,360 కోట్ల డాలర్లు.. ఈ ఏడాది జూలై-సెప్టెంబరు నెలల్లో వచ్చింది.

ఆగని ఎఫ్‌పీఐల అమ్మకాలు: విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు పెరుగుతున్నా మన స్టాక్ మార్కెట్లో విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐ) అమ్మకాలు కొనసాగుతున్నాయి. నవంబరులో కూడా ఈ సంస్థలు 256 కోట్ల డాలర్ల (సుమారు రూ.21,612 కోట్లు) విలువైన షేర్లు విక్రయించాయి. అయితే అక్టోబరులో జరిపిన 1,120 కోట్ల డాలర్లతో (సుమారు రూ.94,017 కోట్లు) పోలిస్తే ఇది చాలా తక్కువ.

జోరు తగ్గిన జీఎస్‌టీ వసూళ్లు



నవంబరులో రూ.1.82 లక్షల కోట్లు.. అక్టోబరుతో పోలిస్తే తక్కువే

న్యూఢిల్లీ: జీఎస్‌టీ వసూళ్లలో వృద్ధి రేటు తగ్గింది. గత నెల (నవంబరు) జీఎస్‌టీ వసూళ్లు రూ.1.82 లక్షల కోట్లకు చేరాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 8.5 శాతం ఎక్కువ. అయితే ఈ ఏడాది అక్టోబరులో వసూలైన రూ.1.87 లక్షల కోట్లతో పోలిస్తే మాత్రం ఇది రూ.5,000 కోట్లు తక్కువ. నవంబరులో వసూలైన రూ.1.82 లక్షల కోట్ల జీఎస్‌టీలో రూ.1.4 లక్షల కోట్లు దేశీయ లావాదేవీలు, రూ.42,591 కోట్లు దిగుమతి సుంకాల ద్వారా వసూలైంది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఈ ఏడాది నవంబరులో దేశీయ లావాదేవీల ద్వారా వసూలైన జీఎస్‌టీ 9.4 శాతం, దిగుమతి సుంకాల ద్వారా వసూలైన జీఎస్‌టీ 6 శాతం పెరిగాయి.

ఏ జీఎస్‌టీ ఎంత ?

నవంబరులో వసూలైన రూ.1.82 లక్షల కోట్ల జీఎస్‌టీలో సీజీఎస్‌టీ ద్వారా రూ.34,141 కోట్లు, ఎస్‌జీఎస్‌టీ ద్వారా రూ.43,047 కోట్లు, ఐజీఎస్‌టీ ద్వారా రూ.91,828 కోట్లు, సెస్సుల ద్వారా రూ.13,253 కోట్లు వసూలయ్యాయి. జీఎస్‌టీ అధికారులు గత నెల రూ.19,259 కోట్ల రిఫండ్స్‌ను జీఎస్‌టీ చెల్లింపుదారుల ఖాతాల్లో జమచేశారు. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 8.9 శాతం తక్కువ. రిఫండ్స్ పోను గత నెల నికరంగా రూ.1.63 లక్షల కోట్ల జీఎస్‌టీ ప్రభుత్వ ఖాతాల్లో జమైంది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 11 శాతం ఎక్కువ.

వడ్డీ రేట్లలో ఊరట లేనట్టే

4-6 తేదీల్లో ఆర్‌బీఐ ఎంపీసీ భేటీ

ముంబై: ఈ నెల 6న ప్రకటించనున్న ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) వడ్డీ రేట్ల తగ్గింపు జోలికి వెళ్లకపోవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. దేశంలో ద్రవ్యోల్బణం ఆర్‌బీఐకి ప్రభుత్వం నిర్దేశించిన కట్టడి పరిధిలో గరిష్ఠ స్థాయి కన్నా పైకి దూసుకుపోయిన నేపథ్యంలో ఈ విడత కూడా యథాతథ స్థితినే కొనసాగించవచ్చని భావిస్తున్నారు. పైగా జీడీపీ గణాంకాలు కూడా నిరుత్సాహపూరితంగా ఉన్న కారణంగా ఏడాది మొత్తానికి వృద్ధి అంచనాలు కూడా తగ్గించవచ్చన్నది వారి అభిప్రాయం. ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ నాయకత్వంలోని ఆరుగురు సభ్యుల ద్రవ్యవిధాన కమిటీ (ఎంపీసీ) వచ్చే బుధవారం (4వ తేదీ) నుంచి మూడు రోజుల పాటు ఆర్థిక వ్యవస్థ తాజా స్థితిని సమగ్రంగా సమీక్షించనుంది. శుక్రవారం దాస్ ఎంపీసీ నిర్ణయాలను ప్రకటిస్తారు. ఆర్‌బీఐ చివరిగా గత ఏడాది ఫిబ్రవరిలో రెపో రేటును 6.5 శాతానికి సవరించింది.

24,400 పైన బుల్లిష్

(డిసెంబరు 2-6 తేదీల మధ్య వారా


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

టెక్ వ్యూ

నిఫ్టీ గత వారం 24,354-23,873 పాయింట్ల మధ్యన కదలాడి 224 పాయింట్ల లాభంతో 24,131 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 24,400 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 24,129, 23,980, 23,914, 24,139 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా దిగువకు రావడం దీర్ఘకాలిక బేరిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 24,400 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 23,850
నిరోధ స్థాయిలు: 24,330,24,430, 23,530 (24,230 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 23,930, 23,830, 23,730 (24,030 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



2వ తేదీ			
హైదరాబాద్	610	విజయవాడ	620
వరంగల్	612	గోదావరి	608
చిత్తూరు	633	విశాఖపట్నం	600
		డజను గుడ్లు రూ. 84	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	90	విజయవాడ	104
వరంగల్	90	గుంటూరు	99
కరీంనగర్	90	ఒంగోలు	99
మహబూబ్‌నగర్	90	చిత్తూరు	85
కర్నూలు	90	నెల్లూరు	85
విశాఖపట్నం	100	అనంతపురం	85
గోదావరి	104		

కన్సాలిడేషన్ బాటలోనే..!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మిశ్రమంగా కదలాడే అవకాశాలున్నాయి. ప్రస్తుతానికి అదానీపై అమెరికా డిస్ట్రిక్ట్ కోర్టు వివాద ప్రభావం తగ్గింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, రష్యా-ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న యుద్ధం తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. వీటితో పాటు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు వస్తే మార్కెట్లు పెరిగే అవకాశం ఉంది. భారత జీడీపీ వృద్ధి రేటు మందగించటం ఈ వారం మార్కెట్లపై ప్రభావం చూపించవచ్చు.

స్టాక్ రికమండేషన్స్

భారతి ఎయిర్‌టెల్: జీవితకాల గరిష్ఠ స్థాయి నుంచి 15 శాతం దిద్దుబాటుకు గురైన ఈ షేరు 20 శాతం మేర పెరిగే అవకాశం ఉందని రేటింగ్ ఏజెన్సీలు చెప్పటంతో ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఒడుదొడుకులు తక్కువగా ఉండటం, నిఫ్టీతో పోలిస్తే జోరు ప్రదర్శిస్తుండటం మరో విశేషం. గత శుక్రవారం ఈ షేరు 4.28 శాతం లాభంతో 1,627.15 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.1,600 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.1,680/1,710 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,575 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఎల్ఐసీ: మణిపాల్‌సిగ్నా హెల్త్ ఇన్సూరెన్స్‌లో 50 శాతం వాటా కొనుగోలు చేయబోతోందన్న వార్తలు, అన్ని రకాలైన బీమా సేవలు అందించేందుకు అనుమతినివ్వాలని ప్రభుత్వం యోచిస్తుండటంతో ఈ షేరుకు డిమాండ్ పెరిగింది. జీవితకాల గరిష్ఠ స్థాయి నుంచి పతనమైన తర్వాత రూ.900 స్థాయిలో కీలక మద్దతు లభించింది. గత శుక్రవారం 5 శాతం లాభంతో రూ.985 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లోకి ఇన్వెస్టర్లు రూ.960 స్థాయిలో ప్రవేశించి రూ.1,050/1,100 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.940 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

దివీస్ లేబొరేటరీస్: ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఈ షేరు అప్‌ట్రెండ్‌లో కొనసాగుతోంది. సెప్టెంబరులో నాలుగేళ్ల గరిష్ఠాన్ని బ్రేక్ చేసిన తర్వాత మూమెంటమ్ మరింత పెరిగింది. జీవితకాల గరిష్ఠానికి చేరిన తర్వాత ఈ షేరు సైడ్‌వేస్‌లో కదలాడుతోంది. అక్యుములేషన్ జరుగుతోంది. బ్రోకరేజీ సంస్థలు టాప్ రేటింగ్ ఇవ్వటంతో గత శుక్రవారం ఈ షేరు 3.71 శాతం లాభంతో రూ.6,172 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.6,100 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.6,250/6,300 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.6,050 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

టొరెంట్ ఫార్మా: సెప్టెంబరు త్రైమాసిక ఫలితాల తర్వాత 15 శాతం పతనమైన ఈ షేరుకు రూ.3,100 స్థాయిలో మద్దతు లభించింది. చివరి రెండు వారాల్లోనే 8 శాతం మేర పెరిగింది. నిఫ్టీతో పోలిస్తే మెరుగ్గా రాణిస్తుండటం గమనార్హం. గత శుక్రవారం 3.79 శాతం లాభంతో రూ.3,200 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లోకి మదుపరులు రూ.3,300 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.3,450/3,500 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.3,225 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

రాష్ట్రీయ కెమికల్స్ అండ్ ఫెర్టిలైజర్: బహుళ సంవత్సరాల బ్రేకౌట్ తర్వాత జీవితకాల గరిష్ఠానికి చేరిన ఈ షేరు జూలై నుంచి డౌన్‌ట్రెండ్‌లో కొనసాగుతోంది. రూ.150 వద్ద కీలకమైన మద్దతు దొరకటమే కాకుండా డబుల్ బాటమ్‌ను ఏర్పాటు చేసుకుంది. గత శుక్రవారం 3.38 శాతం లాభంతో రూ.179 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లోకి మదుపరులు రూ.175 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.190/215 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.168 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.




- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

24,000 పైన నిలకడ తప్పనిసరి

టెక్ వ్యూ


వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం ప్రారంభంలో 23,000 వద్ద రికవరీ కొనసాగించి 24,350 వరకు వెళ్లినప్పటికీ బలమైన రియాక్షన్‌లో పడింది. గరిష్ఠ స్థాయిల్లో అమ్మకాల ఒత్తిడిని ఇది సూచిస్తోంది. అయినా వారం మొత్తం మీద 225 పాయింట్ల లాభంతో 24,130 వద్ద అనిశ్చిత ధోరణిలో క్లోజైంది. గతంలో సాధించిన బేరిష్ ట్రెండ్ అనంతరం రిలీఫ్ ర్యాలీ సాధించినప్పటికీ ప్రధాన ట్రెండ్‌లో ఎలాంటి మార్పు లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో సానుకూలత కోసం 24,000 వద్ద కన్సాలిడేట్ కావాలి. కాగా గత వారం మిడ్‌క్యాప్-100 సూచీ 1,375 పాయింట్లు , స్మాల్ క్యాప్-100 సూచీ 900 పాయింట్లు లాభపడ్డాయి. శుక్రవారం విడుదలైన జీడీపీ గణాంకాల పట్ల మార్కెట్ సోమవారం ఎలా ప్రతిస్పందిస్తుందో చూడాలి. మరింత అప్రమత్త ట్రెండ్ ఏర్పడే అవకాశం ఉన్నందు వల్ల 24,000 స్థాయిలో మరోసారి పరీక్ష ఎదుర్కొనవచ్చు.

బుల్లిష్ స్థాయిలు: సానుకూలత కోసం నిఫ్టీ రాబోయే కొద్ది రోజుల్లో బలంగా కన్సాలిడేట్ కావాలి. మరింత పాజిటివ్ ట్రెండ్ కోసం ప్రధాన నిరోధం 24,300 కన్నా పైన నిలదొక్కుకోవాలి. మరో ప్రధాన నిరోధం 24,550.

బేరిష్ స్థాయిలు: బలహీనత ప్రదర్శించినట్టయితే గత వారం ఏర్పడిన బాటమ్ 23,800 వద్ద నిలదొక్కుకోవాలి. విఫలమైతే మరింత బలహీనపడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 23,500.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ కూడా గత వారం ప్రారంభంలో 920 పాయింట్లు లాభపడినా బలమైన రియాక్షన్‌లో పడి చివరికి వారం కనిష్ఠ స్థాయికి చేరువలో క్లోజైంది. సానుకూలత కోసం 52,000 వద్ద నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 52,550. ప్రస్తుత స్థాయి 51,700 వద్ద విఫలమైతే మరింత బలహీనత సంకేతం ఇస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి 51,000.

పాటర్న్: ట్రెండ్‌లో సానుకూలత కోసం నిఫ్టీ 25 డీఎంఏ (24,000 సమీపంలో) వద్ద నిలదొక్కుకోవాలి. 23,800 వద్ద "అడ్డంగా ఏర్పడిన ట్రెండ్‌లైన్" వద్ద మద్దతు ఉంది. అంతకన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనతగా భావించాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమ వారం స్థాయిలు	
నిరోధం	24,230, 24,300
మద్దతు	24,000, 23,920

నవ్య | చిత్రజ్యోతి

నిరాశను మిగిల్చింది



ఎన్నో అంచనాలు పెట్టుకున్న సినిమాలు ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోతే నటీనటులు నిరాశ పడడం సహజమే. 'లైగర్' చిత్రంతో చేదు అనుభవాన్ని చవి చూశానని బాలీవుడ్ కథానాయిక అనన్యాపాండే అన్నారు. విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటించిన ఈ చిత్రంతోనే ఆమె టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చారు. ఈ సినిమాలో అనన్య తండ్రి చుంకీపాండే సైతం కీలకపాత్రలో నటించారు. పూరి జగన్నాథ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంపై అప్పట్లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. అయితే బాక్సాఫీసు దగ్గర డిజాస్టర్‌గా మిగిలింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో అనన్యాపాండే 'లైగర్' ఫలితంపై స్పందించారు. "మా నాన్న చెప్పడం వల్లే 'లైగర్' సినిమా చేసేందుకు అంగీకరించాను, ఆయన నిర్ణయం పొరపాటని తర్వాత అర్థమైంది. ఆ సినిమా ఫలితం నన్ను చాలా ఇబ్బందిపెట్టింది. చాలా కుమిలిపోయాను. 'ఇకపై మరోసారి మీతో కలసి నటించను నా సినిమాల విషయంలో మీ సలహాలు తీసుకోను" అని నాన్నతో చెప్పాను' అంటూ అనన్య స్పందించారు.


అలాంటి పాత్రల్లో నటించను

- మీనాక్షి చౌదరి



దుల్కర్ సల్మాన్, మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటించిన 'లక్కీభాస్కర్' చిత్రం విజయవంతమైన విషయం తెలిసిందే. ఇందులో మీనాక్షి నటనకు మధ్య తరగతి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన దక్కింది. దుల్కర్ సల్మాన్‌కి భార్యగా, ఒక బిడ్డకు తల్లిగా తన పాత్రలో ఆమె చక్కగా నటించి మెప్పించారు. అయితే... ఇప్పుడిప్పుడే ఇండస్ట్రీలో ఎదుగుతున్న తాను ఇకపై ఇలాంటి డీ గ్లామర్ పాత్రల్లో నటించకూడదని నిర్ణయించుకున్నారట. ఆ విషయాన్ని మీనాక్షి ఇటీవల ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఇలాంటి పాత్రలు చేస్తే...ఇండస్ట్రీలో ఆ పాత్రలకే పరిమితం చేస్తారని ఆమె సన్నిహితులు, స్నేహితులు భయపెడుతున్నారని మీనాక్షి చెప్పారు. అక్క, అమ్మ పాత్రలు చేయడానికి ఇంకా చాలా సమయమున్నందున ప్రస్తుతానికి గ్లామర్ పాత్రలకే ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ఆమె స్పష్టం చేశారు.

మార్చిలో మొదలు



మేర్లపాక గాంధీ దర్శకత్వంలో వరుణ్‌తేజ్ కథానాయకుడిగా ఓ చిత్రాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. యువీ క్రియేషన్స్, ఫస్ట్‌ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ భారీస్థాయిలో నిర్మిస్తున్నాయి. ఈ సినిమా షూటింగ్‌పై ఆదివారం మేకర్స్ నుంచి అప్‌డేట్ వచ్చింది. 'మేర్లపాక గాంధీ అద్భుతమైన స్ర్కిప్ట్‌ను సిద్ధం చేశారు, వరుణ్ తేజ్ పాత్ర సరికొత్తగా ఉండబోతోంది. ప్రేక్షకులను ఆకట్టుకునే అన్ని అంశాలతో ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ జరుగుతోంది, వచ్చే ఏడాది మార్చిలో చిత్రీకరణ ప్రారంభిస్తామ'ని తెలిపారు.

పెళ్లి కానుక?



నాగచైతన్య, శోభితా ధూళిపాళ్ల ఈ నెల నాలుగున జరుగుతున్న వివాహంతో కొత్త జీవితం మొదలెట్టబోతున్న సంగతి తెలిసిందే. వీరి పెళ్లి కానుకగా దాదాపు రూ. రెండున్నర కోట్ల విలువైన లెక్సస్ కారును నాగార్జున కానుకగా ఇవ్వబోతున్నారని తెలిసింది. ఇటీవలే ఈ కారులో రిజిస్ట్రేషన్ కోసం ఖైరతాబాద్ ఆర్‌టీఐ ఆఫీసుకు నాగార్జున వచ్చారు. కొత్త జంట కోసమే ఆయన ఈ కారును కొన్నారని టాలీవుడ్ వర్గాల సమాచారం.

ఈ సినిమా ఆ లోటు తీరుస్తుంది

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు జీవితం ఆధారంగా తెరకెక్కుతోన్న చిత్రం 'ఘంటసాల ది గ్రేట్'. కృష్ణ చైతన్య టైటిల్ రోల్ పోషిస్తున్నారు. సిహెచ్.రామారావు దర్శకత్వంలో సిహెచ్.ఫణి నిర్మించారు. తాజాగా, ఈ సినిమా రిలీజ్ డేట్ పోస్టర్‌ను మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 14న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ "ఈతరం ఘంటసాల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది. అందరూ ఆయన్ని శతాబ్ది గాయకుడు అంటారు. నేను ఆయన్ని అమర గాయకుడు అంటాను. సంగీతం ఉన్నంత కాలం ఆయన ప్రజల మనసుల్లో ఉంటారు. కృషితో నాస్తి దుర్భిక్షం, వినయంతో విద్య ప్రకాశిస్తుందని చెప్పడానికి నిలువెత్తు నిదర్శనం ఆయన. దేశంలో ఇప్పటివరకూ ఏ గాయకుడి మీద పూర్తి స్థాయి సినిమా రాలేదు. ఈ సినిమా ఆ లోటును తీరుస్తుంది" అని అన్నారు.

మహేశ్‌బాబు ఎంజాయ్ చేశారు



2019లో వచ్చిన 'ది లయన్ కింగ్' చిత్రానికి కొనసాగింపుగా వస్తున్న చిత్రం 'ముఫాసా: ది లయన్ కింగ్'. బారీ జెన్‌కిన్స్ దర్శకత్వం వహించారు. వాల్ట్ డిస్నీ పిక్చర్స్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న విడుదలవుతోంది. ఈ చిత్రం తెలుగు వెర్షన్‌లో ముఫాసా పాత్రకు హీరో మహేశ్ బాబు డబ్బింగ్ చెప్పారు. ఆదివారం చిత్రబృందం నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ముఫాసా, మహేశ్‌బాబు ప్రచార చిత్రాన్ని నమ్రతా శిరోద్కర్ ఘట్టమనేని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'డిస్నీ సంస్థ ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన చిత్రమిది. ఇలాంటి మంచి సినిమాను ఔచిత్యం చెడకుండా డబ్ చేయడం ఓ సవాల్ అనే చెప్పాలి. డిస్నీ సంస్థ చాలా శ్రమించి ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తోంది. చాలా ఎంజాయ్ చేస్తూ 'ముఫాసా' పాత్రకు మహేశ్‌బాబు డబ్బింగ్ చెప్పారు. ఈ చిత్రం తప్పకుండా తెలుగు ప్రేక్షకులకు నచ్చుతుంది' అన్నారు. ఈ సందర్భంగా ముఫాసా చిత్రబృందం రూపొందించిన మహేశ్‌బాబు పోస్టర్‌ను నమ్రత ఆవిష్కరించారు. సత్యదేవ్, అలీ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

తుదిదశలో చిత్రీకరణ




ప్రభాస్ కథానాయకుడిగా మారుతి రూపొందిస్తున్న హారర్ థ్రిల్లర్ 'రాజా సాబ్'. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. మాళవికా మోహనన్ కథానాయికగా నటిస్తున్నారు. ఓ ఇంటర్వ్యూలో మాళవిక మాట్లాడుతూ 'రాజాసాబ్' షూటింగ్ గురించి ఆసక్తికర అంశాలను పంచుకున్నారు. "రాజాసాబ్' షూటింగ్ తుది దశకు చేరుకుంది. మంచి ప్లానింగ్‌తో మారుతి షూటింగ్ కొనసాగిస్తున్నారు. ఆయన త్వరలోనే ఆశ్చర్యపోయే అప్‌డేట్ ఇవ్వబోతున్నారు' అన్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 10న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిభొట్ల నిర్మిస్తున్న ఈ చిత్రానికి తమన్ సంగీతం అందిస్తున్నారు.

ఎక్స్ ఖాతా డిలీట్



నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమ్ అవుతోన్న 'నయనతార: బియాండ్ ద ఫేరీ టేల్' డాక్యుమెంటరీ విషయంలో ధనుశ్, నయనతార మధ్య మొదలైన వివాదం తెలిసిందే. 'నానుమ్ రౌడీ దాన్' సినిమాలోని కొన్ని సెకన్ల ఫుటేజిని వాడారని.. అందుకోసం ధనుశ్.. నయనతార, విఘ్నేష్ శివన్ కోర్టు నోటీసులు పంపారు. అయితే, ఇటీవలే 'నానుమ్ రౌడీ దాన్' సినిమాలోని క్లిప్ ఉచితంగా చూసేయ్యండి అనే వీడియోతో పాటు ధనుశ్ ఓ మీడియా ఈవెంట్‌లో మాట్లాడిన వీడియోనూ ఇన్‌స్టా స్టోరీలో పోస్ట్ చేశారు విఘ్నేశ్. ధనుశ్ అభిమానుల నుంచి ట్రోలింగ్ జరిగేసరికి ధనుశ్ వీడియోను తొలగించారు. తాజాగా, తాను అజిత్ నటించిన 'ఎన్నై అరిందాల్' (ఎంతవాడు కానీ) సినిమా కోసం ఓ పాట రాశాననీ.. అదే టైమ్‌లో తన మొదటి మూవీ 'నానుమ్ రౌడీ దాన్'ని చూసి ఆయన మెచ్చుకున్నారని తెలిపారు. ఇవన్నీ అబద్ధాలంటూ.. అజిత్ సినిమా రిలీజైన ఏడు నెలలకు 'నానుమ్ రౌడీ దాన్' విడుదలైందని.. అసలు థియేటర్లలోకి సినిమా రాకముందే అజిత్ ఎలా చూశారని ధనుశ్ అభిమానులు విఘ్నేష్‌ను ట్రోల్ చేశారు. దీంతో విఘ్నేష్ శివన్ తన ఎక్స్ ఖాతాను డిలీట్ చేశారు.

అద్భుత ప్రయాణం ముగిసింది



మలయాళ కథానాయకుడు మోహన్‌లాల్, పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో నటిస్తున్న చిత్రం 'లూసిఫర్ 2: ఎంపురన్'. 2019లో విడుదలై ఘనవిజయం సాధించిన 'లూసిఫర్' సినిమాకు ఇది కొనసాగింపు. లైకా ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. తాజాగా, ఈ సినిమా షూట్ పూర్తైనట్లు మోహన్‌లాల్ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా తెలిపారు. "లూసిఫర్ సినిమా షూట్ పూర్తైంది. 14 నెలలుగా ఎనిమిది రాష్ట్రాలు.. యూఎస్‌ఏ.. యూకే.. యూఏఈలోని అద్భుతమైన లొకేషన్లలో చిత్రీకరించాం. అద్భుత ప్రయాణమిది. ప్రతి ఫ్రేమ్‌ని తన సృజనాత్మకతతో మరో స్థాయికి తీసుకెళ్ళే అపార ప్రతిభ పృథ్వీరాజ్ సొంతం. తన కలం పదునుతో సినిమాకు ఎంతో ప్రత్యేకతను తెచ్చిన మురళీ గోపికి.. ఈ ప్రాజెక్ట్‌పై ఎంతో నమ్మకం పెట్టిన నిర్మాతలకు ధన్యవాదాలు. టీమ్ సమష్టి కృషి వల్లే ఈ సినిమా సాధ్యమైంది. నా సినీ ప్రయాణంలో ఈ సినిమా ఓ మైలురాయి. అభిమానులు అందించే ప్రేమే మాలో స్ఫూర్తిని పెంచింది" అని పేర్కొన్నారు. వచ్చే ఏడాది మార్చి 27న ఈ సినిమా విడుదలవుతోంది.

మరోసారి జోడీ



తమిళ చిత్రం '96'తో ప్రేక్షకుల నుంచి విమర్శకుల నుంచి మంచి ప్రశంసలు అందుకున్న దర్శకుడు సి.ప్రేమ్‌కుమార్. 2018లో విడుదలైన ఈ సినిమా ఓ ఫీల్ గుడ్ లవ్ స్టోరీగా నిలిచింది. ఇందులో రామ్ పాత్రలో విజయ్‌సేతుపతి.. జానకీ(జాను)గా త్రిష ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్నారు. తాజాగా, ఆయన చేయబోయే నెక్స్ట్ ప్రాజెక్ట్ సినీ అభిమానుల్లో జోష్ నింపుతోంది. ఆయన '96' సినిమాకు సీక్వెల్‌ను తెరకెక్కించాలనుకోవడమే ఇందుక్కారణం. ఇప్పటికే అందుకు సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ పూర్తయ్యిందట. ఇదే నిజమైతే మరోసారి విజయ్‌సేతుపతి, త్రిష కలసి ప్రేక్షకులను అలరించనున్నారు.

వావ్ అర్జున్!



న్యూఢిల్లీ: దేశ చెస్ చరిత్రలో దిగ్గజ గ్రాండ్ మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్ తర్వాత మరెవరికీ సాధ్యంకాని 2800 ఎలో రేటింగ్‌ను తెలంగాణ యువ జీఎం ఇరిగేసి అర్జున్ సాధించి సంచలనం సృష్టించాడు. ఆదివారం ఫిడే విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్ క్లాసికల్ విభాగంలో ప్రపంచ నాలుగో ర్యాంక్‌ను దక్కించుకున్న అర్జున్, 2801 ఎలో రేటింగ్ పాయింట్లు సొంతం చేసుకుని శభాష్ అనిపించాడు. ఐదుసార్లు వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన ఆనంద్ మాత్రమే భారత్ నుంచి ఇప్పటివరకు ఈ 2800 ఎలో రేటింగ్‌ను సాధించాడు. అతడి తర్వాత ఈ ఘనత సాధించిన రెండో భారతీయుడిగా, తొలి తెలుగు జీఎంగా అర్జున్ ఖ్యాతి గడించాడు. ప్రపంచం మొత్తంగా చెస్‌లో ఈ అత్యుత్తమైన ఎలో రేటింగ్‌ను అందుకున్న 16వ గ్రాండ్‌మాస్టర్‌గా అర్జున్ నిలిచాడు. వరంగల్‌కు చెందిన ఈ 21 ఏళ్ల చెస్ కుర్రాడు ఈ ఏడాది చెస్ ఒలింపియాడ్‌లో వ్యక్తిగత, టీమ్ విభాగాల్లో పసిడి పతకాలు కొల్లగొట్టాడు. గత సెప్టెంబరులోనే భారత్ నుంచి అత్యధిక రేటింగ్ గల క్రీడాకారుడిగా నిలిచిన అర్జున్, ప్రపంచ రెండో ర్యాంక్‌కు కూడా ఎగబాకాడు. గత అక్టోబరులో జరిగిన ఐరోపా క్లబ్ చాంపియన్‌షిప్‌లో అర్జున్ కనబర్చిన అత్యుత్తమ ప్రదర్శన అతడి రేటింగ్ మెరుగవడానికి తోడ్పడింది. ప్రస్తుతం నార్వే దిగ్గజం మాగ్నస్ కార్ల్‌సన్ 2831 ఎలో రేటింగ్‌తో అగ్రస్థానంలో స్థిరంగా కొనసాగుతుండగా, అమెరికా జీఎంలు ఫాబియానో కరువానా 2805 రేటింగ్‌తో ద్వితీయ, హికారు నకమురా 2802 రేటింగ్‌తో తృతీయ స్థానంలో ఉన్నారు. అర్జున్ 2801 రేటింగ్‌తో నాలుగో స్థానంలో ఉండగా, అతడి తర్వాత భారత్ నుంచి టాప్-10లో గుకేష్ (2783) ఐదో స్థానంలో, విశ్వనాథన్ ఆనంద్ (2750) 10వ స్థానంలో నిలిచారు.

క్రికెట్ అగ్రపీఠాన జై షా

ఐసీసీ చైర్మన్‌గా బాధ్యతల స్వీకరణ

చాంపియన్స్ ట్రోఫీ రూపంలో తొలి సవాల్



వ్యూహాత్మక పరిపాలనతో భారత క్రికెట్‌ను అత్యున్నత శిఖరాలకు తీసుకెళ్లిన జై షా.. ఇక అంతర్జాతీయ స్థాయిలో తన మార్క్ చూపెట్టనున్నాడు. ప్రపంచ క్రికెట్ బాస్‌గా అతడు కొత్త ఇన్నింగ్స్‌ను మొదలుపెట్టాడు. ఐసీసీ చైర్మన్‌గా ఆదివారం బాధ్యతలు స్వీకరించిన 36 ఏళ్ల జై షా.. ఈ పదవిని చేపట్టిన పిన్న వయస్కుడిగా రికార్డుకెక్కాడు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా కుమారుడైన జైషా ఓవరాల్‌గా ఈ ఘనత వహించిన ఐదో భారతీయునిగా నిలిచాడు.

దుబాయ్: బీసీసీఐ కార్యదర్శి జై షా క్రికెట్ పరిపాలనలో అత్యున్నత పదవిని చేపట్టాడు. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) చైర్మన్‌గా ఆదివారం అతడు బాధ్యతలు స్వీకరించాడు. చాంపియన్స్ ట్రోఫీ వివాదం రూపంలో కొత్త బాధ్యతల్లో జై షాకు తొలి సవాలు ఎదురు కానుంది. అలాగే ఒలింపిక్ క్రీడ క్రికెట్‌ను వాణిజ్యపరంగా మరింత ఆకర్షణీయంగా తీర్చే విధానాలు రూపొందించడం షా ముందున్న మరో ప్రధాన లక్ష్యం. గత ఐదేళ్లుగా బీసీసీఐ కార్యదర్శిగా కొనసాగుతున్న షా..ఐసీసీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన ఐదో భారత వ్యక్తి. అలాగే పిన్న వయస్సులో అంతర్జాతీయ క్రికెట్ మండలికి సారథ్యం వహిస్తున్న రికార్డును అతడు సొంతం చేసుకున్నాడు. న్యూజిలాండ్‌కు చెందిన గ్రెగ్ బార్క్‌లే స్థానంలో షా ఐసీసీ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన సంగతి తెలిసిందే. ఇక..జై షాకు ముందు వ్యాపారవేత్త జగ్‌మోహన్ దాల్మియా, రాజకీయవేత్త శరద్ పవార్, న్యాయవాది శశాంక్ మనోహర్, పారిశ్రామిక వేత్త శ్రీనివాసన్ భారత్ నుంచి ఐసీసీ అధ్యక్షులుగా వ్యవహరించారు.

జిల్లా స్థాయి నుంచి ఐసీసీ దాకా..

కళాశాల విద్యార్థిగా ఉన్న సమయంలోనే గుజరాత్‌లో జిల్లా క్రికెట్ సంఘం బాధ్యతలు చేపట్టిన షా..ఆపై రాష్ట్ర క్రికెట్ సంఘానికి, అనంతరం జాతీయ క్రికెట్ నుంచి ప్రస్తుతం ఐసీసీ చీఫ్ స్థాయికి ఎదిగాడు. ఆసియా క్రికెట్ కౌన్సిల్ చైర్మన్‌గా కూడా వ్యవహరించాడు. ఇంకా..ఐసీసీ ఆర్థిక, వాణిజ్య వ్యవహారాల కమిటీ చైర్మన్‌గా పని చేశాడు. జై షా గుజరాత్ క్రికెట్ సంఘం (జీసీఏ) సంయుక్త కార్యదర్శిగా ఉన్న సమయంలోనే..గుజరాత్ జట్టు రంజీ చాంపియన్‌గా నిలిచింది. అలాగే అహ్మదాబాద్‌లో ప్రపంచ అతి పెద్ద క్రికెట్ స్టేడియం కూడా అతడు జీసీఏ బాధ్యతల్లో ఉన్నప్పుడే నిర్మితమైంది. బీసీసీఐ కార్యదర్శిగా దేశవాళీ క్రికెట్ పోటీల మ్యాచ్ రుసుములు పెంచాడు. అంతేకాదు..టెస్ట్ క్రికెటర్లకు బోనస్ ఇచ్చే కీలక నిర్ణయమూ తీసుకున్నాడు. మహిళల ప్రీమియర్ లీగ్ ప్రారంభించడం, జాతీయ జట్ల పురుషులు, మహిళా క్రికెటర్లకు సమాన వేతనాలు ఇవ్వడం బీసీసీఐ కార్యదర్శిగా షా తీసుకున్న అతి పెద్ద నిర్ణయాలు. చిన్న వయస్సులో బీసీసీఐ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టడంతో యువ క్రికెటర్లపట్ల షా మరింత సానుకూలంగా ఉండేవాడు. అదే సమయంలో నిబంధనలను ఉల్లంఘించిన ఆటగాళ్లను శిక్షించడంలోనూ వెనుకంజ వేసేవాడు కాదు. స్టార్ క్రికెటర్లు దేశవాళీ క్రికెట్ పోటీలలో ఆడడం తప్పనిసరి చేశాడు. దానిని ధిక్కరించిన శ్రేయాస్ అయ్యర్, ఇషాన్ కిషన్‌లను సెంట్రల్ కాంట్రాక్టులనుంచి తొలగించేందుకూ వెనుకాడలేదు. ఇక..ఐసీసీ బోర్డు సభ్యుల్లో తనకు మంచి మెజార్టీ ఉన్నందున విధాన నిర్ణయాలు తీసుకోవడంలో షాకు ఎలాంటి సమస్యలూ ఉండకపోవచ్చు.

ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం

'చాంపియన్స్ ట్రోఫీ'ని ఎలా పరిష్కరిస్తారో..!

హైబ్రిడ్ విధానంలో చాంపియన్స్ ట్రోఫీని నిర్వహించేందుకు ఆమోదయోగ్య పరిష్కారాలు కనుగొనడం జై షా తక్షణ కర్తవ్యం. చాంపియన్స్ ట్రోఫీకి పాకిస్థాన్ ఆతిథ్యం ఇవ్వాల్సి ఉంది. కానీ ఆ దేశం వెళ్లేందుకు భారత్ నిరాకరించడంతో హైబ్రిడ్ పద్ధతి తెరపైకి వచ్చింది. దీనికి పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) కూడా అంగీకారం తెలిపింది. ఈ విధానంలో భారత జట్టు తమ మ్యాచ్‌లను దుబాయ్‌లో ఆడాల్సి ఉంటుంది. మరోవైపు..2031 వరకు జరిగే ఐసీసీ ఈవెంట్లలోనూ ఇదే హైబ్రిడ్ పద్ధతిని అనుసరించాలని పీసీబీ షరతు విధించింది. ఆ టోర్నమెంట్లను భారత్ సంయుక్తంగా, ఒక్కటిగా ఆతిథ్యం ఇవ్వాల్సి ఉంది. ఇక..చాంపియన్స్ ట్రోఫీకి 100 రోజులలోపే సమయం మిగిలి ఉంది. వచ్చే ఫిబ్రవరి-మార్చిలో జరిగే ఆ టోర్నీకి అటు పీసీబీ ఇటు బీసీసీఐతో షా సమన్వయం చేసుకోవాల్సి ఉంటుంది. తద్వారా ఐసీసీ చీఫ్‌గా తన ఆధ్వర్యంలో మొదటి టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించాల్సిన బాధ్యత అతడిపై ఉంది. పాకిస్థాన్‌లో పర్యటనకు భారత జట్టుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అనుమతి నిరాకరించింది. అయితే చాంపియన్స్ ట్రోఫీపై జై షా ఇప్పటి వరకు ఎలాంటి వ్యాఖ్యలూ చేయలేదు. లాస్‌ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో క్రికెట్ ప్రవేశాన్ని ఉపయోగించుకొని ఆటను మరింత విశ్వవ్యాప్తం చేయడం, మహిళల క్రికెట్‌కు ఇంకా ప్రాచుర్యం కల్పించడం తన ప్రధాన లక్ష్యాలని షా ప్రకటించాడు. '2028 లాస్‌ఏంజిల్స్ విశ్వ క్రీడల ద్వారా ప్రపంచంలో మరిన్ని ప్రదేశాలకు క్రికెట్‌ను విస్తరించేలా ప్రణాళిక రూపొందిస్తాం' అని తెలిపాడు. 'వివిధ ఫార్మాట్ల ఆటతో క్రికెట్ ప్రస్తుతం కీలక మలుపులో ఉంది. మహిళల క్రికెట్ అభివృద్ధిని వేగవంతం చేయాలి. ప్రపంచ వ్యాప్తంగా క్రికెట్‌కు ఎంతో ఆదరణ లభిస్తోంది. ఈనేపథ్యంలో ఆటను కొత్త శిఖరాలకు తీసుకెళ్లేందుకు ఐసీసీ సభ్యులు, సభ్య దేశాలతో కలిసి పని చేసేందుకు ఎదురు చూస్తున్నా' అని షా పేర్కొన్నాడు. గత నాలుగేళ్లుగా ఐసీసీకి బార్క్‌లే అందించిన సేవలను షా కొనియాడాడు.

బీసీసీఐ ప్రతినిధి ఎవరు?

షా ఐసీసీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టడంతో బీసీసీఐ కార్యదర్శి ఎవరన్న చర్చ మొదలైంది. ఐసీసీ బోర్డు సమావేశంలో బీసీసీఐ తరఫున ఎవరు ప్రాతినిధ్యం వహిస్తారో చూడాలి. బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ, ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లాలలో ఎవరు సమావేశాలకు హాజరవుతారన్నది ప్రశ్న. బిన్నీ కనుక భారత్‌నుంచి ఐసీసీ డైరెక్టర్ అయితే శుక్లా ప్రత్యామ్నాయ డైరెక్టర్‌గా నియమితుడవుతాడని భావిస్తున్నారు. ఒకవేళ శుక్లా కనుక డైరెక్టర్ అయితే సహ డైరెక్టర్‌గా అరుణ్ ధూమల్‌ను నియమిస్తారని అంచనా వేస్తున్నారు. ఇకపోతే..వచ్చే ఏడాది బీసీసీఐకి కొత్త కార్యదర్శిని నియమిస్తే..ధూమల్‌తో పాటు ప్రస్తుత కోశాధికారి ఆషిష్ షెలార్, సంయుక్త కార్యదర్శి దేవజిత్ లోన్ సైకియా రేసులో ఉంటారని భావిస్తున్నారు.

సింధు తీన్‌మార్

మూడోసారి సయ్యద్ మోదీ టైటిల్ సొంతం

పురుషుల చాంపియన్ లక్ష్య సేన్

డబుల్స్ విజేత గాయత్రి జోడీ







లక్ష్య సేన్

లఖ్‌నవూ: ఏస్ షట్లర్లు పీవీ సింధు, లక్ష్య సేన్ సయ్యద్ మోదీ అంతర్జాతీయ టోర్నీ టైటిళ్లను సొంతం చేసుకొన్నారు. అలాగే మహిళల డబుల్స్ టైటిల్‌ను గెలిచిన తొలి భారత జంటగా పుల్లెల గాయత్రి-ట్రీసా జాలీ రికార్డులకెక్కింది. గత కొంత కాలంగా ఫామ్ కోసం తంటాలు పడుతున్న సింధు రెండేళ్ల తర్వాత టైటిల్‌తో మురిసింది. ఆదివారం జరిగిన ఫైనల్లో టాప్ సీడ్ సింధు 21-14, 21-16తో ఉ ల్యు యు (చైనా)పై వరుస గేముల్లో గెలిచింది. 2017, 2022లో ఈ టైటిల్ నెగ్గిన సింధు.. మూడోసారి చాంపియన్‌గా నిలిచింది. పురుషుల సింగిల్స్‌లో టాప్ సీడ్ లక్ష్య 21-6, 21-7తో జియా హెంగ్ జాసన్ (సింగపూర్)ను చిత్తు చేశాడు. పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక పోరులో ఓటమితో డీలాపడ్డ సేన్‌కు ఈ విజయం ఆత్మవిశ్వాసాన్నిచ్చేదే. మహిళల డబుల్స్ తుది పోరులో 2022 రన్నరప్ ట్రీసా-గాయత్రి జంట 21-18, 21-11తో చైనాకు చెందిన లి కియాన్-లి జింగ్ బావోపై వరుస గేముల్లో గెలిచింది. ఈ జంటకు ఇదే తొలి సూపర్-300 టైటిల్. పురుషుల డబుల్స్ ఫైనల్లో పృథ్వీ కృష్ణమూర్తి రాయ్-సాయి ప్రతీక్ ద్వయం 14-21, 21-19, 17-21తో చైనాకు చెందిన హువాంగ్ డి-లియు యంగ్ చేతిలో, మిక్స్‌డ్ డబుల్స్‌లో ఐదో సీడ్ తనీషా క్రాస్టో-ధ్రువ్ కపిల జంట 21-19, 14-21, 8-21తో థాయ్‌లాండ్ జోడీ డెచపోల్-సుప్పిసారా చేతిలో పోరాడి ఓడారు.

గాయత్రి ట్రీసా

ప్రాక్టీస్‌లో మెరిశారు

గిల్ అర్ధసెంచరీ ● రాణించిన జైస్వాల్, నితీశ్

హర్షిత్‌కు నాలుగు వికెట్లు

ప్రైమ్ మినిస్టర్స్ లెవెన్‌పై భారత విజయం



గిల్ (50)

కాన్‌బెర్రా: ఆస్ట్రేలియాతో గులాబీ టెస్టుకు ముందు జరిగిన వామప్ మ్యాచ్‌లో టీమిండియాకు చక్కటి ప్రాక్టీస్ లభించింది. ముఖ్యంగా గాయం నుంచి కోలుకున్న శుభ్‌మన్ గిల్ (50) అర్ధసెంచరీతో ఫామ్ నిరూపించుకున్నాడు. అటు పేసర్ హర్షిత్ రాణా నాలుగు వికెట్లతో ఆకట్టుకున్నాడు. దీంతో ఆదివారం ప్రైమ్ మినిస్టర్స్ లెవన్‌తో జరిగిన వన్డేలో భారత్ ఆరు వికెట్ల తేడాతో నెగ్గింది. అయితే రెండు రోజుల ఈ మ్యాచ్ తొలి రోజు శనివారం వర్షార్పణమైంది. దీంతో ఆదివారం 50 ఓవర్ల మ్యాచ్ ఆడేందుకు ఇరు జట్ల కెప్టెన్లు అంగీకరించారు. కానీ మ్యాచ్ ఆరంభమైన కాసేపటికే వర్షం అంతరాయం కలిగించడంతో 46 ఓవర్లకు కుదించారు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్ పీఎం లెవన్ 43.2 ఓవర్లలో 240 పరుగులకు ఆలౌటైంది. 19 ఏళ్ల ఓపెనర్ సామ్ కోన్‌స్టాస్ (107) శతకంతో అదరగొట్టగా, తొమ్మిదో నెంబర్ బ్యాటర్ హన్నో జాకబ్స్ (60) అర్ధసెంచరీ సాధించాడు. జాక్ క్లేటన్ (40) పర్వాలేదనిపించాడు. ఆకాశ్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత బరిలోకి దిగిన భారత్ 42.5 ఓవర్లలో 4 వికెట్లకు 241 పరుగులతో ఛేదించింది. జైస్వాల్ (45), నితీశ్ (42), సుందర్ (42 నాటౌట్), జడేజా (27) రాణించారు. అయితే మ్యాచ్ను గెలిచినప్పటికీ మిగిలిన 3.1 ఓవర్లలోనూ భారత్ ప్రాక్టీస్ కొనసాగించింది. విరాట్, బుమ్రా, పంత్ విశ్రాంతి తీసుకున్నారు.

రోహిత్ విఫలం: ఈ మ్యాచ్‌లో ఓపెనర్లుగా జైస్వాల్, రాహుల్ బరిలోకి దిగగా, కెప్టెన్ రోహిత్ మాత్రం నాలుగో నెంబర్‌లో ఆడాడు. అయితే బ్యాటింగ్ ఆర్డర్‌లో అంతా పర్వాలేదనిపించినా.. రోహిత్ మాత్రం 3 పరుగులకే వెనుదిరిగి నిరాశపరిచాడు. ఛేదనలో ఓపెనర్ జైస్వాల్ తొమ్మిది ఫోర్లతో ఆకట్టుకున్నాడు. మరో ఓపెనర్ రాహుల్ (27) రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరగ్గా వన్‌డౌన్‌లో గిల్ బరిలోకి దిగాడు. స్క్వేర్ కట్ షాట్‌తో ఫోర్ ద్వారా పరుగుల ఖాతా తెరిచాడు. ఎలాంటి ఇబ్బందీ లేకుండా బ్యాటింగ్ సాగించిన తను అర్ధసెంచరీతో రెండో టెస్టుకు సిద్ధమని సంకేతాలు పంపినట్టయ్యింది. గిల్ కూడా రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరగ్గా అటు నితీశ్ వరుస బౌండరీలతో చెలరేగాడు. అతడికి జతగా సుందర్ సైతం స్వేచ్ఛగా బ్యాట్ ఝుళిపించాడు. దీంతో జట్టు చకచకా లక్ష్యం వైపు సాగింది.



కాన్‌బెర్రా ఎంపీ చేతుల మీదుగా ట్రోఫీ అందుకుంటున్న రోహిత్

గార్డెన్‌లో తిరుగుతున్నావా?

క్రికెట్ మైదానంలో కెప్టెన్ రోహిత్ శర్మ సహచరులతో సరదాగా ఉండడంతో పాటు, ఫీల్డింగ్ సరిగా చేయకపోతే 'గార్డెన్‌లో తిరుగుతున్నావా?' అంటూ మందలించడం పరిపాటి. తాజాగా అదే డైలాగ్‌ను పేసర్ సిరాజ్ వాడుకున్నాడు. పీఎం లెవన్ ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లో బ్యాటర్ రెన్షా.. సిరాజ్ బంతి వేసే సమయంలో పక్కకు తప్పుకొన్నాడు. సైట్‌స్క్రీన్‌కు సెక్యూరిటీ సిబ్బంది అడ్డుగా రావడంతో రెన్షా ఇబ్బందిపడ్డాడు. దీంతో సిరాజ్ సెక్యూరిటీ గార్డు వైపు చూస్తూ 'ఏ భాయ్.. గార్డెన్‌లో తిరుగుతున్నావా?' అంటూ గట్టిగా అరిచాడు.

సంక్షిప్త స్కోర్లు

పీఎం లెవన్: 43.2 ఓవర్లలో 240 ఆలౌట్ (కాన్‌స్టస్ 107, జాకబ్స్ 61; రాణా 4/44, ఆకాశ్ 2/58).

భారత్: 46 ఓవర్లలో 257/5 (గిల్ 50 రిటైర్డ్ హర్ట్, జైస్వాల్ 45, నితీశ్ 42, సుందర్ 42 నాటౌట్; అండర్సన్ 2/30).

పదికి పది

హ్యాట్రిక్ సహా సుమన్ అరుదైన ఫీట్

కూచ్ బెహార్ ట్రోఫీ



న్యూఢిల్లీ: అండర్-19 కూచ్‌బెహార్ ట్రోఫీలో బిహార్ పేసర్ సుమన్ కుమార్ (33.5-20-53-10) సంచలన బౌలింగ్ ప్రదర్శన కనబరచాడు. రాజస్థాన్‌తో జరిగిన ఈ నాలుగు రోజుల మ్యాచ్‌లో ఒక ఇన్నింగ్స్‌లో హ్యాట్రిక్ సహా 10 వికెట్లతో అరుదైన ఘనతను సాధించాడు. తొలి ఇన్నింగ్స్‌లో బిహార్ 467 పరుగులు చేసింది. బదులుగా మొదటి ఇన్నింగ్స్ బరిలోకి దిగిన రాజస్థాన్.. సుమన్ దెబ్బకు 187 పరుగులకు ఆలౌటైంది. 36వ ఓవర్‌లో రాజస్థాన్ 4,5,6 నెంబర్ల బ్యాటర్లను సుమన్ డకౌట్ చేశాడు. రాజస్థాన్ ఫాలో ఆన్ ఆడగా.. మ్యాచ్ డ్రాగా ముగిసింది.

బంగ్లా 122/6

విండీస్‌తో రెండో టెస్ట్

కింగ్‌స్టన్: విండీస్ పేసర్లు నిప్పులు చెరుగుతుండడంతో.. రెండో టెస్ట్‌లో బంగ్లాదేశ్ తడబడుతోంది. ఆటకు రెండో రోజైన ఆదివారం ఓవర్‌నైట్ స్కోరు 69/2తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన బంగ్లా కడపటి వార్తలందే సమయానికి 58 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 122 పరుగులు చేసింది. కెప్టెన్ మెహ్దీ హసన్ మిరాజ్ (18), తైజుల్ ఇస్లాం (8) క్రీజులో ఉన్నారు. అర్ధ శతకం సాధించిన ఓవర్‌నైట్ బ్యాటర్ షాద్‌మన్ ఇస్లాం (64)ను షామర్ జోసెఫ్ క్యాచవుట్ చేశాడు. షామర్ జోసెఫ్ 3, కీమర్ రోచ్ 2 వికెట్లు పడగొట్టారు.

సెమీస్‌లో మలేసియాతో భారత్ ఢీ

● జూనియర్ ఆసియా కప్ హాకీ

మస్కట్: అర్ష్‌దీప్ హ్యాట్రిక్ గోల్స్‌తో.. జూనియర్ ఆసియా కప్ హాకీలో పూల్-ఎలో భారత్ గ్రూప్ టాపర్‌గా నిలిచింది. ఆదివారం జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 8-1తో కొరియాపై గెలిచింది. మంగళవారం జరిగే సెమీస్‌లో మలేసియాతో భారత్ తలపడనుంది. అర్ష్‌దీప్ 3.. అరిజీత్ సింగ్ 2 గోల్స్ కొట్టారు. గుర్జంత్ సింగ్, రోషన్ కుజుర్, రోహిత్ తలో గోల్ చేశారు. ఇదే గ్రూప్ నుంచి జపాన్ కూడా సెమీస్‌కు అర్హత సాధించింది.

ఐటీఎఫ్ విజేత రిషిత రెడ్డి



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఐటీఎఫ్ వరల్డ్ టెన్నిస్ టూర్ జూనియర్ 100 టైటిల్‌ను హైదరాబాద్ అమ్మాయి బాసిరెడ్డి రిషిత రెడ్డి కైవసం చేసుకుంది. ఆదివారం న్యూఢిల్లీలో ముగిసిన సింగిల్స్ ఫైనల్లో రిషిత 4-6, 6-4, 6-3తో నెల్లి ఇవనోవా (రష్యా)పై గెలిచింది.

రికీ, భరత్ ధనాధన్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఆంధ్ర కెప్టెన్ రికీ భుయ్ (35 బంతుల్లో 84), ఓపెనర్ శ్రీకర్ భరత్ (39 బంతుల్లో 63) ఉప్పల్ స్టేడియంలో చెలరేగారు. సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీలో భాగంగా సర్వీసెస్‌తో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ఆంధ్ర 23 పరుగులతో గెలిచింది. తొలుత ఆంధ్ర.. రికీ, భరత్ విజృంభణతో 20 ఓవర్లలో 8 వికెట్లకు 222 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఛేదనలో సర్వీసెస్ 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 199 పరుగులకే పరిమితమై ఓటమి పాలైంది. మోహిత్ (74), వినీత్ (51) అర్ధ శతకాలతో రాణించినా ఫలితం లేకపోయింది.

డ్రాల పరంపర

ఆరో గేమ్‌లోనూ తేలని ఫలితం

ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్



గుకేష్

సింగపూర్: ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ టైటిల్ పోరులో డ్రాల పరంపర కొనసాగుతోంది. ఆదివారం జరిగిన ఆరో రౌండ్‌లోనూ ఫలితం తేలలేదు. వరల్డ్ చాంపియన్ డింగ్ లిరెన్, చాలెంజర్ గుకేష్ మధ్య జరుగుతున్న ఈ ఫైనల్లో ఇది వరుసగా మూడో డ్రా కావడం గమనార్హం. ఓవరాల్‌గా నాలుగో డ్రా. ఆరో రౌండ్ తర్వాత ఇద్దరు ఆటగాళ్లు చెరి మూడేసి పాయింట్లతో సమంగా ఉన్నారు. సోమవారం విశ్రాంతి దినం. ఏడో రౌండ్ మంగళవారం జరుగుతుంది. గత రౌండ్ మాదిరే ఆరో గేమ్ కూడా పోటాపోటీగా సాగింది. అయితే నల్లపావులతో ఆడిన 18 ఏళ్ల భారత గ్రాండ్‌మాస్టర్ గుకేష్ ప్రత్యర్థిని నిలువరించడం విశేషం. 46 ఎత్తుల తర్వాత ఇద్దరూ డ్రాకు అంగీకరించారు. తెల్లపావులతో పటిష్టమైన 'లండన్ సిస్టమ్'తో ఆడిన లిరెన్ మెరుపు వేగంతో ఏడు నిమిషాల్లోనే 20 ఎత్తులు వేశాడు. మరోవైపు ఆట ప్రథమార్థంలో ఎక్కువ సమయం తీసుకొన్న గుకేష్. 20వ ఎత్తులో దూకుడు ప్రదర్శించి మ్యాచ్‌ను రసవత్తరంగా మార్చేశాడు. తన అదనపు సమయాన్ని వెచ్చించినా గుకేష్ ఎత్తుకు ప్రతి ఎత్తు వేయలేకపోయిన లిరెన్ డ్రాకు ప్రతిపాదించాడు.

ఇంగ్లండ్ రికార్డు విజయం

కివీస్‌తో తొలి టెస్టు



కార్స్

క్రైస్ట్‌చర్చ్: న్యూజిలాండ్‌తో ముగిసిన తొలి టెస్టులో ఇంగ్లండ్ 8 వికెట్ల తేడాతో నెగ్గింది. ఫలితంగా మూడు టెస్టుల సిరీస్‌లో 1-0తో ఆధిక్యం సాధించింది. ఆదివారం నాలుగో రోజు 104 పరుగుల స్వల్ప ఛేదన కోసం రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన ఇంగ్లండ్ ధనాధన్ ఆటతో అదరగొట్టింది. జేకబ్ బెథెల్ (50 నాటౌట్) అజేయ అర్ధసెంచరీతో పర్యాటక జట్టు కేవలం 12.4 ఓవర్లలోనే 104/2 స్కోరుతో గెలిచింది. దీంతో టెస్టుల్లో అత్యంత వేగంగా 100+ టార్గెట్‌ను పూర్తి చేసిన జట్టుగానూ నిలిచింది. అంతేకాకుండా టెస్టు క్రికెట్ నాలుగో ఇన్నింగ్స్‌లో ఎక్కువ పరుగులు సాధించిన బ్యాటర్‌గా జో రూట్ (1630).. సచిన్ (1625) రికార్డును అధిగమించాడు. అంతకుముందు 155/6 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన కివీస్ 254 పరుగులకు ఆలౌటైంది. డారిల్ మిచెల్ (84) అర్ధసెంచరీ సాధించాడు. పేసర్ బ్రైడన్ కార్స్‌కు 6, వోక్స్‌కు 3 వికెట్లు దక్కాయి. తొలి ఇన్నింగ్స్‌లో కివీస్ 348, ఇంగ్లండ్ 499 పరుగులు చేశాయి. ఇక ఈ టెస్టులో మొత్తంగా పది వికెట్లు తీసి కెరీర్ బెస్ట్ సాధించిన కార్స్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

మిలింద్ పోరాటం వృథా

రాజ్‌కోట్: హైదరాబాద్ జట్టు సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీలో మూడో ఓటమిని చవిచూసింది. ఆదివారం పంజాబ్‌తో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 7 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. తొలుత పంజాబ్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 196 పరుగులు సాధించింది. ఆరంభంలో అన్మోల్‌ప్రీత్ సింగ్ (36 బంతుల్లో 60), ఆఖర్లో రమణ్‌దీప్ సింగ్ (11 బంతుల్లో 39 నాటౌట్) దంచి కొట్టారు. ఛేదనలో హైదరాబాద్ 20 ఓవర్లలో 189 పరుగులకు ఆలౌటైంది. ఆల్‌రౌండర్ చామ మిలింద్ (22 బంతుల్లో 6 సిక్సర్లు, 3 ఫోర్లతో 55) మెరుపు హాఫ్ సెంచరీ వృథా అయింది. ఓపెనర్ రోహిత్ రాయుడు (56) మినహా ప్రధాన బ్యాటర్లంతా విఫలమయ్యారు. తన్మయ్ అగర్వాల్ (9), కెప్టెన్ తిలక్ వర్మ (9), రాహుల్ బుద్ధి (5) స్వల్ప స్కోర్లకే వెనుదిరిగారు.



ప్రజాపాలన విజయోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మునిసిపాలిటీలో పలు ప్రాంతాలను విద్యుత్తు దీపాలతో అలకరించారు. 65వ నంబరు జాతీయ రహదారి 2 కిలోమీటర్ల మేర విద్యుత్తు దీపాల వెలుగులతో కనువిందు చేసింది. - ఆంధ్రజ్యోతి, చౌటుప్పల్

ప్రజాపాలన ఇంటింటికీ చేరేలా

హైదరాబాద్‌లో విజయోత్సవం

- జీహెచ్‌ఎంసీలోని ముఖ్య నేతలకు పొన్నం దిశానిర్దేశం
- జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం: దీపాదాస్ మున్షీ

హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ఇంటింటికీ తెలిసేలా ప్రజాపాలన విజయోత్సవాన్ని నిర్వహించాలని జీహెచ్‌ఎంసీ పరిధిలోని నేతలకు హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ దిశానిర్దేశం చేశారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని ముఖ్యనేతలతో హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో ఆదివారం పొన్నం సమావేశమయ్యారు. ఏఐసీసీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మేయర్ గద్వాల విజయలక్ష్మీ, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, శ్రీగణేశ్, ఎమ్మెల్సీలు అమీర్‌అలీ ఖాన్, ఎంఎస్ ప్రభాకర్, 23 మంది కార్పొరేటర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ.. విజయోత్సవాల్లో భాగంగా 7వ తేదీన డివిజన్ స్థాయిలో మహిళలు, సంక్షేమ పథకాల లబ్ధిదారులతో నేతలు సమావేశం కావాలన్నారు. 8న అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. 9న సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ, ట్యాంక్ బండ్‌పై జరిగే ర్యాలీకి పెద్ద ఎత్తున జనసమీకరణ చేపట్టాలని సూచించారు. దీపాదాస్ మున్షీ మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో విజయం కోసం పార్టీని బలోపేతం చేయాలని, ప్రభుత్వ విజయాలను, పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నేతలకు సూచించారు. మహేశ్ గౌడ్ మాట్లాడుతూ.. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ విజయాలను వివరించాలని చెప్పారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో సత్తా చాటాలంటే కార్పొరేటర్లంతా శ్రమించాలని దిశానిర్దేశం చేశారు.

నారాయణ గురు స్ఫూర్తితో 'సమగ్ర సర్వే': భట్టి

నారాయణ గురు స్ఫూర్తితో తెలంగాణలో సమగ్ర కుటుంబ సర్వే, ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణం వంటి కార్యక్రమాలు చేపట్టినట్టు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. కేరళ కొల్లంలోని నారాయణ గురు ఓపెన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సెమినార్‌లో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన ప్రసంగించారు. నారాయణ గురు బోధనలను స్మరించుకునేందుకు కొల్లం చేరుకోవడం తనకు దక్కిన గొప్ప గౌరవమన్నారు. కేరళ సమాజంలోని వివిధ కులాల్లో అన్యాయాలను నిర్మూలించడం ద్వారా ఆయన సమాజాన్ని సరికొత్తగా తీర్చిదిద్దారని వివరించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, నారాయణ గురుల మధ్య పోలికలు ఉన్నాయని, ఇద్దరి వారసత్వాలు దేశ చరిత్రలో న్యాయానికి, సమానత్వానికి కొండంత ఆధారంగా నిలిచాయని తెలిపారు.



నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం సార్లపల్లిలో విల్లంబులు ఎక్కుపెట్టిన మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వంశీకృష్ణ

ఎవరినీ బలవంతంగా తరలించం: సీతక్క

దోమలపెంట, శ్రీశైలం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నల్లమల ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తనవంతుగా సహకరిస్తానని మంత్రి సీతక్క తెలిపారు. పునరావాసం ఇష్టం లేనివారు అటవీ ప్రాంతంలోనే ఉండొచ్చని, వారికీ అన్ని విధాలా సహకరిస్తామని, ఎవరినీ బలవంతంగా తరలించేది లేదని స్పష్టం చేశారు. అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని నల్లమల అటవీ ప్రాంత గ్రామాలైన వటువర్లపల్లి, సార్లపల్లి, కుడిచింతలబావి గ్రామాల్లో ఆమె పర్యటించారు. సీబీఎం ట్రస్టు చైర్మన్, అమ్రాబాద్ మాజీ జడ్పీటీసీ సభ్యురాలు అనురాధ ఆధ్వర్యంలో 400 మంది చెంచులకు దుప్పట్లు పంచారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అటవీశాఖ చేపట్టనున్న పునరావాస గ్రామాల తరలింపు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఇక్కడి నుంచి స్వచ్ఛందంగా మైదాన ప్రాంతాలకు వెళ్లేవారికి సహకరించాలని అధికారులకు సూచించారు. కాగా, శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను మంత్రి సీతక్క దర్శించుకున్నారు. మంత్రికి ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. దర్శనానంతరం మంత్రికి పండితులు వేదాశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలను స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేశారు.

బీఆర్‌ఎస్ నేతలకు నిద్ర పట్టట్లేదు: జూపల్లి

- పాలమూరు ప్రజలకు కేసీఆర్ మోసం: యెన్నం

హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్‌లో జరిగిన రైతు పండగ సభ విజయవంతం కావడంతో బీఆర్‌ఎస్ నేతలకు నిద్ర పట్టట్లేదని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో పార్టీ ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి మంత్రి మాట్లాడారు. ఉమ్మడి పాలమూరు జిల్లా అభివృద్ధికి ఏటా రూ.20 వేల కోట్లు కేటాయిస్తానన్న సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పాలమూరు జిల్లా రైతన్నల సాగు నీటి కష్టాలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీర్చలేక పోయిందని, జిల్లా సాగునీటి ప్రాజెక్టులకు అవసరమైన నిధులను సీఎం కేటాయిస్తున్నారని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ బీఆర్‌ఎస్‌కు ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతు పండగ సభకు లక్షలాదిగా రైతులు తరలివచ్చి.. సీఎం రేవంత్‌ను ఆశీర్వదించారన్నారు. పాలమూరు ప్రజలను మాజీ కేసీఆర్ మోసం చేశాడని ఆరోపించారు. అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ బాగుపడటం ఇష్టం లేని బీఆర్‌ఎస్ నేతలు.. పరిశ్రమల ఏర్పాటును అడ్డుకుంటున్నారని మండిపడ్డారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత: సురేఖ

హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తు తరాల మనుగడకు ఇబ్బంది లేకుండా భూమిని జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. జాతీయ కాలుష్య నియంత్రణ దినం(డిసెంబరు 2) సందర్భంగా పర్యావరణ పరిరక్షణ బాధ్యతను గుర్తు చేస్తూ మంత్రి ప్రకటన విడుదల చేశారు. ఈ ఏడాది 'స్వచ్ఛమైన గాలి, పచ్చని భూమి-సుస్థిరమైన జీవనం వైపు అడుగు' అనే నేపథ్యంతో ప్రజలకు కాలుష్య నియంత్రణపై అవగాహన కల్పించేందుకు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో, రాష్ట్రంలో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి కాలుష్య నియంత్రణ దినాన్ని నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ప్రతి ఒక్కరు మొక్కలను నాటుతూ, పర్యావరణ పరిరక్షణకు తమవంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు.

అదానీ స్కామ్‌పై జేపీసీ వేయాలి: బీవీ రాఘవులు

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): అదానీ ముడుపుల కుంభకోణంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) వేయాలని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు డిమాండ్ చేశారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. అదానీపై రాహుల్ గాంధీ విమర్శలతో అదానీ కంపెనీ వంద కోట్ల ఆఫర్‌ను రేవంత్ రెడ్డి తిరస్కరించారని, కానీ ఇదివరకు చేసుకున్న ఒప్పందాలు ఏమయ్యాయో తెలపాలని డిమాండ్ చేశారు. లగచర్లలో భూసేకరణ రద్దు చేయడం రైతుల విజయమన్నారు.

లగచర్ల పారిశ్రామిక పార్కుపై సర్కారు దూకుడు!

(మొదటిపేజీ తరువాయి)

గ్రామాల్లో 182.31 ఎకరాలు సేకరించనున్నట్లుగా ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. దీంట్లో లగచర్లలో 110.32 ఎకరాలు, పోలేపల్లిలో 71.39 ఎకరాలున్నాయి. 2 నోటిఫికేషన్ల ద్వారా లగచర్ల, హకీంపేట్, పోలేపల్లి పరిధిలో మొత్తం 826.25 ఎకరాలు సేకరించనున్నారు. ఇంతకుముందు ఫార్మా విలేజ్‌లను ప్రతిపాదించిన లగచర్ల, హకీంపేట్, పోలేపల్లి రెవెన్యూ గ్రామాల పరిధిలోనే ఈ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఫార్మా విలేజ్‌ల ఏర్పాటు తీవ్ర వివాదాస్పదమైన నేపథ్యంలో.. వాటిని ప్రభుత్వం ఉపసంహరించుకున్న విషయం తెలిసిందే. వాటి స్థానంలో, పారిశ్రామిక పార్కు నిర్మాణం ప్రతిపాదనను తాజాగా ముందుకు తెచ్చింది. మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్క్‌కు సేకరించనున్న భూములకు సంబంధించిన సర్వే నెంబర్లు, రైతుల పేర్లు, భూ విస్తీర్ణం తదితర వివరాలను నోటిఫికేషన్లలో పేర్కొన్నారు. భూసేకరణకు సంబంధించిన అధికారిక ప్లాన్‌ను రైతులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో చూడవచ్చని తెలిపారు. నోటిఫికేషన్‌లో ఉన్న సర్వే నంబర్లలో ఏ భూమిలోకైనా ప్రవేశించి.. భూమిని సర్వే చేసి లెవెల్స్ తీసుకునేందుకు, బోరు వేయడం వంటి పనులు చేపట్టేందుకు తాండూరు సబ్ కలెక్టర్‌కు ప్రభుత్వం అధికారం కట్టబెట్టింది. నోటిఫికేషన్ జారీచేసిన నాటి నుంచి ఆ భూములపై ఎలాంటి లావాదేవీలకు అవకాశం లేదని.. అమ్మకాలు, కొనుగోళ్లు చేయరాదని, బ్యాంకుల్లో అప్పులు తీసుకోరాదని స్పష్టం చేశారు. భూసేకరణ, నష్టపరిహారం విషయంలో అభ్యంతరాలు ఉంటే.. నోటిఫికేషన్ విడుదలైన 60 రోజుల్లోగా రైతులు కలెక్టర్ దృష్టికి తేవాలని పేర్కొన్నారు.

25 వేల మందికి ఉద్యోగావకాశాలు

మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేయటం ద్వారా దుద్యాల మండలంలోని లగచర్ల, పోలేపల్లి, హకీంపేట తదితర గ్రామాల నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని సీఎం రేవంత్ పట్టుదలతో ఉన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. టెక్స్‌టైల్ వంటి పరిశ్రమలు ఏర్పాటుచేసి కనీసం 25 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని సీఎం భావిస్తున్నట్లు ఆ వర్గాలు వెల్లడించాయి. కొడంగల్ నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటును ఎవరైనా అడ్డుకునే ప్రయత్నం చేస్తే వారిపై ప్రభుత్వం దూకుడుగానే వ్యవహరించనున్నట్లు తెలుస్తోంది. కాగా, మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్క్‌కు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించే బాధ్యతను ప్రభుత్వం.. తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ(టీజీఐఐసీ)కు అప్పగించింది. భూసేకరణ ప్రక్రియ అనంతరం భూ ముల్లో మౌలిక సదుపాయాలు కల్పించే పనులు చేపడతారు. భూములు కోల్పోనున్న వారికి నష్ట పరిహారంతోపాటు ఉపాధి, పునరావాసం కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. సాధారణంగా భూసేకరణలో నిర్వాసితులకు నష్టపరిహారం, 125 గజాల నివాస స్థలం, కుటుంబంలో ఒకరికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం వంటివి ఇస్తుంటారు. దుద్యాల మండలంలో నిర్మించనున్న మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్క్‌లో భూములు కోల్పోయే రైతులకు ప్రభుత్వం ఏ విధమైన పరిహారం, పునరావాసం కల్పించనుందనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది.

నేడు కోర్టుల ముందుకు పిటిషన్లు

వికారాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): లగచర్ల ఘటనలో వివిధ పక్షాలు దాఖలు చేసిన పిటిషన్లు సోమవారం కోర్టుల ముందుకు రానున్నాయి. ప్రధాన నిందితుడిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని తమ కస్టడీకి ఇవ్వాలంటూ పోలీసులు కొడంగల్ జేఎఫ్‌ఎంసీలో వేసిన పిటిషన్‌పై నిర్ణయం వెలువడే అవకాశముంది. ఆయన బెయిల్ పిటిషన్ వికారాబాద్ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి కోర్టు ముందు విచారణకు రానుంది. రైతులకు బెయిల్ ఇవ్వాలని కోరుతూ బీఆర్‌ఎస్ లీగల్ సెల్ న్యాయవాదులు వేసిన పిటిషన్లు కూడా జిల్లా కోర్టు ముందుకు రానున్నాయి.

విద్యలో నైపుణ్యాలకు పెద్దపీట!

ప్రపంచ అవసరాలకు పనికొచ్చేలా విద్యార్థులకు సాంకేతిక విద్య

- స్కిల్ యూనివర్సిటీ, ఏటీసీలు.. నైపుణ్యాభివృద్ధి కోసం శిక్షణలు
- పూర్తిగా బోధనపైనే దృష్టిపెట్టేలా టీచర్ల సమస్యలను పరిష్కరించాం
- 11,062 టీచర్ పోస్టుల భర్తీ చేశాం..
- సీఎంఆర్‌ఎఫ్ సాయం రూ.830 కోట్లు.. ఒక్క ఏడాదిలోనే... ఇదో రికార్డు
- ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడి



హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విద్యా బోధనకు అవసరమైన అన్ని చర్యలను ప్రభుత్వం తీసుకుంటోందని ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడించింది. విద్యారంగంలో గత ఆరు దశాబ్దాల్లో ఎన్నడూ లేని విప్లవాత్మకమైన చర్యలను చేపట్టినట్లు ఓ ప్రకటనలో పేర్కొంది. ప్రపంచ అవసరాలను తీర్చే నైపుణ్యాలను విద్యార్థులు ఒడిసిపట్టేలా సాంకేతిక విద్యకు కొత్త మెరుగులు దిద్దుతోందని ప్రకటనలో పేర్కొంది. ఉపాధ్యాయులు పూర్తిగా బోధనపైనే దృష్టిపెట్టేలా వారి సమస్యలను పరిష్కరించినట్లు ప్రకటించింది. ఈ ఏడాది బడ్జెట్‌లో విద్యాశాఖకు రూ.21,292 కోట్లను ప్రభుత్వం కేటాయించిందని, ఇది నిరుటి బడ్జెట్ కన్నా రూ.2,119 కోట్లు ఎక్కువ అని పేర్కొంది.. పాఠశాలల సమస్యలను పరిష్కరించడానికి అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేశామని, ఈ కమిటీల ఆధ్వర్యంలో పాఠశాలలు తెరిచే నాటికి బల్లలు, కుర్చీలు, తలుపుల మరమ్మతులు.. మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణం, తరగతి గదుల విద్యుదీకరణ, సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు జరిగిందని వెల్లడించింది. ఇందుకు రూ.1,100 కోట్లు ఖర్చు చేసినట్లు గుర్తుచేశారు. ఏళ్ల తరబడి పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, బడుల్లో పారిశుద్ధ్య నిర్వహణ, పచ్చదనం పెంపు.. మొక్కల సంరక్షణకు సింగరేణి కంపెనీ సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్) కింద రూ.136 కోట్లు కేటాయించినట్లు సీఎంవో వివరించింది. రెండు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల పదోన్నతులను పూర్తి చేశామని, సుమారు 21,419 మందికి పదోన్నతులు లభించాయని తెలిపింది. నిబంధనలకు అనుగుణంగా 37,406 మంది ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులను, 2,757 మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీలను చేసినట్లు వెల్లడించింది. 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేసినట్లు పేర్కొంది. ఏటా రెండుసార్లు టెట్ నిర్వహిస్తున్నామని, అన్ని మండలాలకు మండల విద్యాధికారులను నియమించినట్లు వెల్లడించింది. పేద పిల్లలకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నాణ్యమైన విద్య అందించడానికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ స్కూల్స్‌కు శ్రీకారం చుట్టినట్లు తెలిపింది. ఆధునిక ప్రపంచ అవసరాలు, ప్రపంచంలోని పారిశ్రామిక అవసరాలకు అవసరమైన నైపుణ్యాలను అందిపుచ్చుకునేలా తెలంగాణ బిడ్డలకు నైపుణ్య విద్యను అందించాలనే సంకల్పంతో పురాతన కోర్సులు, సర్టిఫికెట్లకే పరిమితమైన 65 ఐటీఐలను రూ.2,106 కోట్ల వ్యయంతో ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా (ఏటీసీ) మార్చినట్లు వెల్లడించింది. అకడమిక్ కోర్సులు.. పరిశ్రమల అవసరాల మధ్య అంతరాన్ని పూడ్చడానికి యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ప్రారంభించినట్లు వివరించింది. యువత ఆధునిక నైపుణ్యాలు నేర్చుకొని ప్రపంచంలోని ఏ దేశంలోనైనా ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకునేలా ఈ స్కిల్ యూనివర్సిటీ, ఏటీసీలను తీర్చిదిద్దుతున్నట్లు చెప్పింది. పాఠశాలల్లోకి డ్రగ్స్ ప్రవేశించకుండా ప్రహరీ క్లబ్‌లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది.

ఐదేళ్లలో రూ.2400 కోట్ల సాయం

ముఖ్యమంత్రి సహాయనిధి అమలులో రాష్ట్ర ప్రభుత్వం కొత్త రికార్డును నెలకొల్పింది. ఏడాదిలోనే సీఎంఆర్‌ఎఫ్ కింద దాదాపు రూ.830 కోట్లను విడుదల చేసింది. దీనిద్వారా దాదాపు 1,66,000 పేద, మధ్యతరగతి కుటుంబాలు లబ్ధి పొందాయి. గత ప్రభుత్వం ఐదేళ్లలో సీఎం సహాయనిధి కింద రూ.2400 కోట్ల సాయాన్నే అందించింది. మూగ, చెవుడు సమస్యలతో జన్మించే పిల్లలకు 6 ఏళ్లలోపు శస్త్రచికిత్సలు చేయిస్తే వారికి మాటలు రావడంతో పాటు చెవులు వినపడే అవకాశముంటుంది. ఈ విషయాన్ని తొలి సమీక్షలోనే వైద్యారోగ్య శాఖ.. సీఎం దృష్టికి తీసుకెళ్లింది. స్పందించిన సీఎం ఎంత ఖర్చయినా అలాంటి పిల్లలకు చికిత్సలు చేయాలని ఆదేశించారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు సుమారు 87 మంది పిల్లలకు ఎల్‌వోసీలను ప్రభుత్వం మంజూరు చేసింది.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో

రూ.8.14 కోట్ల మోసం

- బంజారాహిల్స్ బాధితుడి నుంచి కాజేసిన మోసగాళ్లు
- రాజస్థాన్‌లో ఇద్దరి అరెస్టు

హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ట్రేడింగ్ మోసంలో కీలకపాత్ర వహించిన ఇద్దరిని రాజస్థాన్‌లో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు అరెస్టు చేశారు. ట్రేడింగ్ పేరిట హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌కు చెందిన ఓ బాధితుడి నుంచి ఈ ముఠా రూ.8.14 కోట్లు కాజేసింది. అయితే ఈ ముఠా సూత్రధారి శ్రవణ్ కుమార్‌ను ఇటీవలే అరెస్టు చేశామని, అతనికి పలు బ్యాంకులకు సంబంధించిన కరెంట్ అకౌంట్ ఖాతాలు ఇచ్చి వాటిలోకి వచ్చిన డబ్బును ఇతర ఖాతాలకు మళ్లించడంలో కీలకపాత్ర పోషించిన ఉదయ్‌పూర్‌కు చెందిన రాహుల్ డాంగీ, రాహుల్ బోయ్‌ను అరెస్టు చేసినట్లు సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ షికా గోయల్ తెలిపారు. వీరిద్దరినీ ట్రాన్సిట్ వారంట్‌పై హైదరాబాద్‌కు తీసుకొచ్చినట్లు చెప్పారు. రాహుల్ డాంగీ.. శ్రీ సన్వారియా ఫర్నీచర్స్ పేరిట కరెంట్ అకౌంట్ ఖాతాను నిర్వహిస్తున్నాడని, ఇందులోకి ట్రేడింగ్ ద్వారా తాము టార్గెట్ చేసిన వ్యక్తుల నుంచి డబ్బు టాన్స్‌ఫర్ చేస్తారని, బంజారాహిల్స్ బాధితుడికి సంబంధించిన రూ.75లక్షలు ఈ ఖాతాకు బదిలీ అయినట్లు షికా గోయల్ చెప్పారు. వెంటనే రాహుల్ ఆ డబ్బును 25 ఖాతాలకు మళ్లించినట్లు తెలిపారు. అలాగే రాహుల్ బోయ్ 5 ఖాతాలను నిందితులకు ఇచ్చాడని, వీటిలోని రెండు ఖాతాలకు బంజారాహిల్స్ బాధితుడి నుంచి మిగతా డబ్బు బదిలీ అయినట్లు చెప్పారు. మోసగాళ్లు వాట్సాప్ ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ ద్వారా ట్రేడింగ్ టిప్స్ ఇచ్చి ముందు డబ్బు వచ్చేలా చేస్తారని, తర్వాత తాము అనుకున్న మొత్తాన్ని కొట్టేసి ఫోన్లు స్విచాఫ్ చేస్తారన్నారు. ఇలాంటి మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని షికా గోయల్ సూచించారు.



జూబ్లీహిల్స్‌లో కురుస్తున్న వర్షం

నేడు, రేపు తేలికపాటి వర్షాలు

- రాష్ట్రంలోనూ 'ఫెంగల్' ప్రభావం
- పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ
- ఆదివారం పలుచోట్ల చిరుజల్లులు

హైదరాబాద్ సిటీ, ఖమ్మం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఫెంగల్ తుపాను ప్రభావం రాష్ట్రంలోనూ కనిపిస్తోంది. రాష్ట్రంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. రాష్ట్ర వ్యాప్తంగా చలి తీవ్రత తగ్గి పగటి ఉష్ణోగ్రతలు పెరిగాయి. శనివారం నుంచే ఆకాశం మేఘావృతమై చల్లని గాలులు వీస్తున్నాయి. తుఫాన్ ప్రభావంతో హైదరాబాద్, ఉమ్మడి ఖమ్మం సహా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం చిరుజల్లులు కురిశాయి. నాగర్‌కర్నూల్ జిల్లాలోని పద్ర మండలంలో 1.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వైరా, ఏన్కూరు, సత్తుపల్లి, కొణిజర్ల సహా పలు మండలాల్లో తేలికపాటి వర్షాలు కురిశాయి. వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ వద్ద ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. ఓ వైపు కోతలు, మరో వైపు ధాన్యం కొనుగోళ్లు కొనసాగుతున్న నేపథ్యంలో వాతావరణం ఒక్కసారిగా మారడంతో రైతులు హడలిపోతున్నారు. సోమ, మంగళవారాల్లో రాష్ట్రంలో పలుచోట్ల తేలికపాటి వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, నల్లగొండ, నాగర్‌కర్నూల్, యాదాద్రి జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. శుక్రవారం దాకా రాజధాని వాసులను వణికించిన చలి రెండ్రోజులుగా తగ్గింది. హైదరాబాద్‌లో ఆదివారం గరిష్ఠంగా 28.7, కనిష్ఠంగా 21.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

జీవో 317 బాధితులకు న్యాయం చేయాలి

పంజాగుట్ట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తమకు న్యాయం చేయాలని, ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని జీవో317 డిస్‌లొకేటెడ్ ఎంప్లాయిస్ అండ్ టీచర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం అధ్యక్షుడు పడకంటి అజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి వై.రత్నమాల, ఉపాధ్యక్షురాలు ఎస్.రమాదేవి మాట్లాడారు. ఇటీవల ప్రభుత్వం.. భార్యభర్తలు, పరస్పర బదిలీలు, మెడికల్ గ్రౌండ్ వారి మాత్రమే ఊరటనిచ్చేలా జీవోలు తీసుకొచ్చిందని, మిగిలిన వారి సమస్యలనూ పరిష్కరించాలని కోరారు. ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి తాము అధికారంలోకివస్తే 48గంటల్లో 317జీవోను రద్దు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కొందరు అధికారులు ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. సుమారు 14,203మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు 317జీవో వల్ల ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

బలహీనపడిన తుఫాన్

రిడ్జ్ ప్రభావంతో తప్పిన 'పెను-తుఫాన్' ముప్పు.. పుదుచ్చేరిలో తుఫాన్ బీభత్సం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ఫెంగల్ తుఫాన్ తీవ్ర వాయుగుండంగా బలహీనపడింది. శనివారం రాత్రి పుదుచ్చేరి సమీపంలో తీరంపైకి వచ్చినప్పటి నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు(సుమారు 12 గంటలపాటు) అక్కడే స్థిరంగా కొనసాగిన తర్వాత తీవ్ర వాయుగుండంగా బలహీనపడింది. ఆదివారం రాత్రి తర్వాత మరింత బలహీనపడి పశ్చిమ, వాయువ్యంగా పయనిస్తూ కర్ణాటక మీదుగా అరేబియా సముద్రంలోకి ప్రవేశించే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. తుఫాన్ ప్రభావంతో ఆదివారం ఉదయం వరకు ఏపీలోని తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, నెల్లూరు జిల్లాల్లో అనేక చోట్ల భారీ నుంచి అతిభారీగా, అక్కడక్కడ కుంభవృష్టిగా వర్షాలు కురవడంతో లోతట్టుప్రాంతాలు నీట మునిగాయి. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. కోస్తా, రాయలసీమల్లోని మరికొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. వరి, పత్తి, మరికొన్ని పంటలకు నష్టం వాటిల్లింది. కాగా ఫెంగల్ తుపాను ప్రభావంతో కురిసిన కుండపోత వర్షాలకు కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరి అతలాకుతలమైంది. శనివారం పుదుచ్చేరి వద్ద తుపాను తీరం దాటడంతో పెనుగాలులతో భారీగా వర్షాలు కురిసి జలదిగ్బంధంలో చిక్కుకుంది. శనివారం ఉదయం నుంచి ఆదివారం వేకువజాము 5.30 గంటల వరకు 51 సెం.మీ. వర్షపాతం నమోదైంది. పుదుచ్చేరి నగరంతోపాటు చుట్టూ ఉన్న గ్రామాలు సైతం నీటమునిగాయి. దీంతో పాఠశాలలు, కళాశాలలకు సోమవారం సెలవు ప్రకటించినట్లు పుదుచ్చేరి విద్యాశాఖ మంత్రి నమశ్శివాయం తెలిపారు.



నెల్లూరు జిల్లా అల్లూరులో నీట మునిగిన వరినాట్లు

తిరుమలను కప్పేసిన పొగమంచు

తిరుమలలో వరుసగా మూడవరోజైన ఆదివారం కూడా వర్షం కురిసింది. చలి కూడా బాగా పెరగడంతో చాలా మంది భక్తులు దర్శనం పూర్తికాగానే తిరుగు ప్రయాణమయ్యారు. దట్టమైన పొగమంచు తిరుమలను కప్పేసింది. గదులు లభించని భక్తులు యాత్రికుల వసతి సముదాయాలు, కార్యాలయాలు, షెడ్లలో తలదాచుకుంటున్నారు. తిరుమలకు వెళ్లే రెండవ ఘాట్‌రోడ్డులో 14, 15 కిలోమీటర్ల వద్ద కొండచరియలు విరిగిపడ్డాయి. ఫారెస్ట్, విజిలెన్స్, ఇంజనీరింగ్ విభాగం అధికారులు బండరాళ్లు, మట్టిని ట్రాక్టర్ల ద్వారా తొలగించారు.

శ్రీవారి దర్శనానికి నేడు 'స్థానిక' టోకెన్ల జారీ

తిరుమల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానికులకు శ్రీవారి దర్శనానికి సంబంధించి టీటీడీ సోమవారం టోకెన్లు జారీ చేయనుంది. గతంలో ప్రతి నెలా మొదటి మంగళవారం ఉన్న స్థానికుల దర్శనాన్ని తిరిగి ప్రారంభించాలని ఇటీవల టీటీడీ ధర్మకర్తల మండలి తీర్మానించింది. ఈ క్రమంలో డిసెంబరు 3వ తేదీన స్థానికులకు ఉచిత దర్శనం కల్పించాలని టీటీడీ నిర్ణయించింది. ఇందులో భాగంగానే తిరుమలలో 500, తిరుపతిలో 2,500 టోకెన్లు జారీ చేయాలని టీటీడీ ప్రణాళికలు సిద్ధం చేసింది. తిరుపతి అర్బన్, రూరల్ మండలాలతో పాటు చంద్రగిరి, రేణిగుంట మండలాలకు చెందిన వారికి, తిరుమల వాసులకు మాత్రమే ఈ టోకెన్లు జారీ చేస్తారు.

రాజకీయ ప్రసంగాల నిషేధాన్ని స్వాగతిస్తున్నాం

- శ్రీవారిని దర్శించుకున్న బీజేపీ ఎంపీ లక్ష్మణ్

తిరుమల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తిరుమలలో రాజకీయ ప్రసంగాలను నిషేధిస్తూ టీటీడీ బోర్డు తీర్మానం చేయడాన్ని స్వాగతిస్తున్నట్టు తెలంగాణ బీజేపీ ఎంపీ కె.లక్ష్మణ్ అన్నారు. తిరుమల శ్రీవారిని ఆయన ఆదివారం ఉదయం బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డితో కలిసి దర్శించుకున్నారు. అనంతరం లక్ష్మణ్ ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. తిరుమల చాలా పవిత్రమైన పుణ్యక్షేత్రమని, ఇక్కడ రాజకీయాలకు తావు లేదన్నారు. ఇటీవల ఏర్పడిన టీటీడీ బోర్డు సనాతన ధర్మానికి లోబడి తీసుకుంటున్న నిర్ణయాలను స్వాగతిస్తున్నామన్నారు. ఇక, స్వామిపై నమ్మకం ఉన్న వ్యక్తులే తిరుమలకు రావాలని, అన్యమతస్థులు దర్శనానికి రావాలనుకుంటే తప్పనిసరిగా స్వామిపై నమ్మకం, భక్తి ఉందని డిక్లరేషన్ ఇవ్వాలని తీసుకున్న నిర్ణయం కూడా మంచి విషయమన్నారు. పవిత్రమైన టీటీడీలో ఉన్న అన్యమత ఉద్యోగులను వెంటనే విధుల నుంచి తొలగించి, స్వామిపై, సనాతన ధర్మంపై విశ్వాసమున్న వ్యక్తులనే కొనసాగించాలని తీసుకున్న నిర్ణయాన్నీ స్వాగతించారు. అనంతరం బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. పవిత్రమైన తిరుమల క్షేత్రాన్ని కొందరు ఫొటోషూట్‌కు నిలయంగా మారుస్తున్నారన్నారు. వైసీపీ నాయకుల అనుచరులు, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, ప్రియాంక, అంతకుముందు నటి నయనతార ఫొటోషూట్లు, రీల్స్ చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఇకపై తిరుమలలో రీల్స్, ఫొటోషూట్ చేస్తే వారి కెమెరాలు, ఇతర సామగ్రిని సీజ్ చేయడంతోపాటు వారు తిరిగి దర్శనానికి రాకుండా చేసేలా వచ్చే బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకుంటామన్నారు.

ట్రా'ఫికర్' తీర్చిన మంత్రి శ్రీధర్‌బాబు!

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సచివాలయం వైపు వెళ్తున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ట్రాఫిక్‌ను చక్కదిద్దిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. హైదరాబాద్‌లో రాత్రి 9 గంటల సమయంలో ట్యాంక్‌బండ్ వైపు నుంచి వచ్చిన కారు అంబేడ్కర్ కూడలి వద్ద అదుపు తప్పి, ఫుట్‌పాత్‌పైకి దూసుకెళ్లింది. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అదే సమయంలో ఆదర్శ్‌నగర్ ఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచి సచివాలయం వైపు వెళ్తున్న మంత్రి శ్రీధర్‌బాబు వాహనం దిగి, స్వయంగా ట్రాఫిక్‌ను చక్కదిద్దారు. ఆయన సెక్యూరిటీ సిబ్బంది ఫుట్‌పాత్‌పైకి వెళ్లిన కారును పక్కకు జరిపారు. ట్రాఫిక్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారొచ్చి కారును అక్కడి నుంచి తీసి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. దాదాపు 10 నిమిషాలకు పైగా అక్కడే ఉన్న మంత్రి శ్రీధర్‌బాబు ట్రాఫిక్ ఇబ్బంది తొలగిన తర్వాత బయల్దేరి వెళ్లారు.

సక్రమ 'అణు' వినియోగంతో ప్రపంచ శాంతి

- జాతీయ రక్షణ సదస్సులో రియర్ అడ్మిరల్ మోహన్ దాస్

బేగంపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సక్రమ మార్గంలో వినియోగిస్తే ప్రపంచ శాంతికి అణు సామర్థ్యం దోహదపడుతుందని కుమారగురు కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ డిఫెన్స్ ప్రోగ్రామ్ డైరెక్టర్, రియర్ అడ్మిరల్ (రిటైర్డ్) మోహన్ దాస్ అన్నారు. సిగ్మా 9 గ్లోబల్ పీస్ మిషన్ ఆధ్వర్యంలో బేగంపేటలోని తాజ్ వివంత హోటల్‌లో ఆదివారం రాత్రి "యాంటీ న్యూక్లియర్ షీల్డ్" అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. ఇటీవలికాలంలో పలు దేశాల నడుమ చెలరేగుతున్న ఉద్రిక్తతలు అణు యుద్ధాలకు దారితీస్తాయన్న ఆందోళనలు పెరుగుతున్న నేపథ్యంలో.. మానవాళిని ఆ ముప్పు నుంచి రక్షించే సమగ్ర వ్యవస్థను అభివృద్ధి చేసే దిశగా 'సిగ్మా 9 ఏరో స్పేస్ అండ్ డిఫెన్స్ రిసెర్చ్ సెంటర్' చేపట్టిన ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టే ఈ 'యాంటీ న్యూక్లియర్ షీల్డ్'. అత్యంత అధునాతనమైన పరికరాలు, పరిజ్ఞానాలను ఉపయోగించి అణు ధార్మికతను వీలైనంతవరకూ తటస్థం చేయడమే ఈ ప్రాజెక్టు లక్ష్యం. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో చేపట్టిన ఈ ప్రాజెక్టులో.. డీఆర్‌డీవో, ఇస్రో తదితర ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసిన మాజీ శాస్త్రవేత్తలు భాగమయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన మోహన్ దాస్ మాట్లాడుతూ అణు సామర్థ్యాన్ని కలిగి ఉన్న దేశాలు ఆ సత్తాను లోక కల్యాణం కోసం వినియోగించడం మంచిదన్నారు. ఇక.. అణు దాడులను సమర్థంగా అడ్డుకునే 'యాంటీ న్యూక్లియర్ షీల్డ్' మానవాళికి ఎంతో ప్రయోజనకరమని సిగ్మా ఏరో స్పేస్ అండ్ డిఫెన్స్ రిసెర్చ్ సంస్థ సీఎండీ మిక్కిలి ప్రసన్నకుమార్ అన్నారు. నోబెల్ గ్రహీత శ్రీనివాస రామానుజన్ మనవడు ప్రొఫెసర్ గోవింద రాజన్, ఇస్రో డిప్యూటీ డైరెక్టర్ ఎస్.వి. శర్మ తదితరులు సదస్సులో మాట్లాడారు.

తుమ్మలకు పీసీసీ చీఫ్ అభినందనలు

» రైతు పండుగ విజయవంతంపై హర్షం


టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్‌ను సత్కరిస్తున్న మంత్రి తుమ్మల

హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించిన మూడ్రోజుల రైతు పండుగ విజయవంతం కావడం పట్ల వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ అభినందించారు. ఆదివారం మంత్రి తుమ్మల నివాసానికి వెళ్లి ఆయనతో భేటీ అయ్యారు. రైతు పండుగలో భాగంగా మూడ్రోజుల పాటు రైతులకు ఆధునిక సాగు పద్ధతులు, యాంత్రీకరణపైనా అవగాహన కోసం ఏర్పాటు చేసిన స్టాళ్లు ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయని మహేశ్‌గౌడ్ అన్నారు. ముగింపు సభలో రైతు రుణమాఫీ, రైతుభరోసాపై సీఎం రేవంత్ యావత్ తెలంగాణకు స్పష్టతనిచ్చారని తెలిపారు. రేవంత్ పాలన రైతు రాజ్యంగా మారిందని.. ఇలాంటి తరుణంలో వ్యవసాయ మంత్రిగా రైతుబిడ్డ తుమ్మల ఉండడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా మహేశ్ గౌడ్‌ను తుమ్మల శాలువాతో సత్కరించారు.

బీజేపీ చార్జ్‌షీట్.. గురివెంద సామెతలా ఉంది

» టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సవాల్

హైదరాబాద్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఏడాది కాంగ్రెస్ పాలనపై బీజేపీ విడుదల చేసిన చార్జ్‌షీట్‌ను చూస్తుంటే గురివెంద సామెత గుర్తుకు వస్తోందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ అన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్‌తో బీజేపీ నేతలు అంటకాగుతుండటంతో ప్రధాని మోదీ చీవాట్లు పెట్టారని, అందుకే చార్జ్‌షీట్ల పేరుతో హడావుడి చేస్తున్నారని విమర్శించారు. ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలపై చర్చించేందుకు తాము సిద్ధమని.. కేంద్రంలో పదేళ్ల బీజేపీ చీకటి పాలనపై చర్చకు ఆ పార్టీ నేతలు సిద్ధమా..? అంటూ సవాల్ విసిరారు. ప్రధాని మోదీ ఇచ్చిన హామీలను గాలికొదిలేశారని, బీజేపీ పాలనలో కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లోని ప్రభుత్వాలను అప్రజాస్వామికంగా కూల్చేశారని, దేశవ్యాప్తంగా వివిధ పార్టీలకు చెందిన 411 మంది ఎమ్మెల్యేలను ఆ పార్టీలో చేర్చుకున్నారని ఒక ప్రకటనలో ఆయన విమర్శించారు.

కాళేశ్వరం లేకున్నా.. 'వరి రికార్డు'

» 66.5 లక్షల ఎకరాల్లో 1.5 కోట్ల టన్నుల పంట

» ఎస్సీ వర్గీకరణపై సుప్రీం సూచనను పాటిస్తాం: ఉత్తమ్



పెద్దపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నాయకులు పదే పదే కాళేశ్వరం ప్రాజెక్టు గురించి చెబుతారని.. ఈ ఏడాది మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో చుక్క నీరు లేకున్నా రాష్ట్రంలో 66.5 లక్షల ఎకరాల్లో 1.53 కోట్ల టన్నుల వరి దిగుబడి వచ్చిందని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు సూచన మేరకు క్యాబినెట్ పని చేస్తుందని తెలిపారు. ఆదివారం పెద్దపల్లి కలెక్టరేట్‌లో కరీంనగర్ ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులు, పౌర సరఫరాల శాఖపై ఉత్తమ్ సమీక్ష నిర్వహించారు. ఈ నెల 4న పెద్దపల్లిలో జరగనున్న యువ వికాసం సభా స్థలికి చేరుకుని ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఉత్తమ్ విలేకరులతో మాట్లాడారు. పెద్దపల్లిలో లక్ష మందితో యువ వికాసం సభను నిర్వహిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం నిరుద్యోగుల సమస్యలను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. పదేళ్లలో ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయలేదని, తాము పది నెలల్లో 50 వేల ఉద్యోగాలు ఇచ్చామని చెప్పారు. 4న జరిగే బహిరంగ సభలో మరో తొమ్మిది వేల మందికి సీఎం ఉద్యోగ నియామక పత్రాలను అందజేస్తారని చెప్పారు. రాష్ట్రంలో 25 లక్షల మంది రైతులకు రూ.22 వేల కోట్ల రుణ మాఫీ చేశామని తెలిపారు. సన్న ధాన్యానికి 500 బోనస్ ఇచ్చామని.. యాసంగి సీజన్‌లో కూడా కొనసాగిస్తామని పేర్కొన్నారు. కొత్త రేషన్ కార్డులు ఇస్తామని, రేషన్ వినియోగదారులకు సన్న బియ్యం ఎప్పటి నుంచి ఇవ్వాలో నిర్ణయం తీసుకుంటామని ఆయన చెప్పారు.

మునుపెన్నడూ లేనివిధంగా రుణమాఫీ: శ్రీధర్‌బాబు

దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం రుణ మాఫీ చేసిందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. రాష్ట్రంలో 2011లో గ్రూప్-1 పరీక్ష జరిగిందని, ఆ తర్వాత పదేళ్లలో బీఆర్ఎస్ సర్కారు ఎన్నడూ పరీక్ష నిర్వహించలేదన్నారు. తాము నిర్వహిస్తే కోర్టులకు వెళ్లి, ధర్నాలు చేసి బీఆర్ఎస్ అడ్డంకులు సృష్టించిందని.. అన్నింటినీ దాటుకుని గ్రూప్-1 పరీక్ష నిర్వహించామని చెప్పారు. త్వరలోనే 563 మంది అధికారులు రానున్నారని పేర్కొన్నారు. ఈ నెల 4న జరిగే యువ వికాసం సీఎం సభకు క్యాబినెట్ మంత్రులందరూ వస్తారని, విమర్శలు గుప్పించే ప్రతిపక్షాల నోళ్లు మూయించేందుకు పెద్ద ఎత్తున ప్రజలు సభకు రావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.

అప్పులపై ఆర్థిక నిపుణులతో చర్చకు సిద్ధమా?

» రేవంత్‌కు సవాల్ విసిరిన హరీశ్

» కాంగ్రెస్ పాలనలో బూటకపు ఎన్‌కౌంటర్లు అని విమర్శ



హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): 'కాంగ్రెస్ సర్కార్.. ఉత్త బేకార్' అని తెలంగాణ ప్రజలంతా తిట్టిపోస్తున్నారని మాజీమంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. "మాది సుపరిపాలన అంటూ నీకు నువ్వే డబ్బా కొట్టుకోవడం కాదు రేవంత్‌రెడ్డీ.. జనం ఏమనుకుంటున్నారో తెలుసుకో! నీ అపరిపక్వత, అసమర్థతతో రాష్ట్రంలోని అన్ని రంగాల్లో ప్రతికూల వాతావరణం నెలకొంది. ఎవరూ మెచ్చుకునే పరిస్థితి లేదు" అని మండిపడ్డారు. ఆర్థికవృద్ధితో రాష్ట్రాన్ని అప్పగిస్తే, సంపద పెంచలేక, ప్రజలకు పంచలేక సీఎం నోటికొచ్చినట్లు వాగుతున్నారని హరీశ్ విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ అప్పు మొత్తం రూ.4,26,499కోట్లని అసెంబ్లీ వేదికగా లెక్కలతో సహా నిరూపించామని, కానీ పదే పదే అప్పులపై సీఎం ప్రజల్ని తప్పుదోవ పట్టించడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పులపై ఆర్థిక నిపుణులతో చర్చించేందుకు తాము సిద్ధమని, రేవంత్ సిద్ధమేనా? అని సవాల్ విసిరారు. ఎన్నికలకు ముందు రైతుబంధు కోసం రూ.7,200కోట్ల నిధులు సిద్ధం చేసి రైతుల ఖాతాల్లో వేసేందుకు ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకున్నామని, చివరి నిమిషంలో ఈసీకి ఫిర్యాదు చేసి రైతుల నోటికాడి బుక్కను ఆపిన పాపాత్ముడు రేవంత్ అని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో అరెస్టులు, ఆంక్షలు, నిర్బంధాలు ఒకవైపు బూటకపు ఎన్‌కౌంటర్లు మరోవైపు కొనసాగుతూ అశాంతి రేపుతున్నాయని 'ఎక్స్' వేదికగా హరీశ్ విమర్శించారు.

సభతో రైతులకు ఒరిగిందేమీ లేదు: నిరంజన్ రెడ్డి

పాలమూరులో సీఎం సభతో రైతులు, ప్రజలకు ఒరిగిందేమీ లేదని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. రూ.7,500 కోట్లు రైతుబంధు ఇవ్వలేక చేతులెత్తేసిన వారు రూ.30వేల కోట్ల బోనస్ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. సర్కారు బూటకపు హామీలతో ప్రజల గొంతులు కోస్తోందని విమర్శించారు. పరిశ్రమల కోసం లగచర్లలో ఎప్పుడో భూములు గుర్తించామని, ఇప్పుడు కొత్తగా భూములు తీసుకోవాల్సిన అవసరం లేదన్నారు. అనాలోచిత నిర్ణయాలతో పాలమూరు ప్రజలు మళ్లీ వలసలు వెళ్లే పరిస్థితి తీసుకురావద్దన్నారు.

అమరుల కుటుంబాలను కేసీఆర్ ఆదుకున్నారు

» పోలీసు కిష్టయ్య కుటుంబాన్ని కలిసిన ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమంలో అమరులైన వారి కుటుంబాలను కేసీఆర్ అన్నివిధాలా ఆదుకున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. పోలీసు కిష్టయ్య 15వ వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులను ఆదివారం ఆమె కలిశారు. కిష్టయ్య భార్య పద్మావతి, కుమారుడు రాహుల్‌ను కలిసి వారి బాగోగులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అమరుడు పోలీసు కిష్టయ్య కుటుంబానికి తాము ఎప్పుడూ అండగా ఉంటామన్నారు. అమరుల కుటుంబాలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

రైతు భరోసా.. సంక్రాంతి తరువాత

"రైతులే మా ఎజెండా.. రైతును రాజును చేయడమే మా లక్ష్యం. జవహర్‌లాల్ నెహ్రూ నుంచి వైఎస్సార్ అమలు చేసిన పథకాల వరకు అన్నింటినీ అమలు చేస్తున్నాం. రాజ్యం చేపట్టే వాళ్లు రైతుల తలరాత మారుస్తారని కాకుండా.. రాజ్యం చేపట్టేవారి తలరాతలనే రైతులు మారుస్తారని మేం విశ్వసిస్తున్నాం. అందుకే రైతు సంక్షేమానికి పెద్దపీట వేశాం. ఈ ప్రభుత్వం రైతుల కోసమే ఉంది. వ్యవసాయం దండుగ కాదు.. పండుగ అనేలా చేయాలి. ఇప్పటివరకు చేసాం.. చేసి చూపిస్తాం. భవిష్యత్తులో కొనసాగిస్తాం"

\- సీఎం రేవంత్‌రెడ్డి


ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణంపై అధికారులతో సమీక్షిస్తున్న సీఎం రేవంత్

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించే శాసనసభ సమావేశాల్లో చర్చించి, విధివిధానాలను ఖరారు చేస్తామన్నారు. సోనియాగాంధీ గ్యారెంటీగా చెబుతున్నానని, ఈ విషయంలో ఏ మారీచులు వచ్చి అబద్ధాలు చెప్పినా నమ్మవద్దని అన్నారు. ఆదివారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఎం మాట్లాడారు. రైతు భరోసా పథకంపై ఆరోపణలు చేస్తున్న ప్రతిపక్షాలను మారీచులు, రాక్షసులతో పోల్చారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నవంబరు 28 నుంచి 30 వరకు నిర్వహించిన రైతు అవగాహన సదస్సుకు మంచి ఆదరణ వచ్చిందన్నారు. రైతుల ఆశీర్వాదం, సంపూర్ణ మద్దతుతో ఈ ప్రభుత్వం ఇంకా తొమిదేళ్లు ఎన్నో విజయాలు సాధిస్తుందని తనకు సంపూర్ణ విశ్వాసం కలిగిందన్నారు.

రూ.7లక్షల కోట్ల అప్పు ఉన్నా.. రుణమాఫీ

"తెలంగాణ ఏర్పడే నాటికి ఆనాడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో, రూ.69 వేల కోట్ల అప్పులతో కేసీఆర్‌కు రాష్ట్రాన్ని అప్పగించింది. అలాంటి రాష్ట్రాన్ని 2023 డిసెంబరులో కాంగ్రెస్ మళ్లీ అధికారం చేపట్టే నాటికి రూ.7 లక్షల కోట్ల అప్పు, ప్రతినెలా వడ్డీలు, అసలు కలిపి రూ.6,500 కోట్లు చెల్లించాల్సిన పరిస్థితికి తీసుకువచ్చారు." అని సీఎం రేవంత్ అన్నారు. ప్రజలపై అప్పుల భారం మోపలేదని, అద్భుతమైన పరిపాలనను అందిస్తున్నామని, రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మార్చామని అప్పటి ప్రభుత్వం సందర్భం వచ్చినప్పుడల్లా దాడులు చేసిందని ఆరోపించారు. అందుకే తాము అధికారం చేపట్టిన తరువాత ఆస్తులు, అప్పులు, విద్యుత్, సాగునీటి ప్రాజెక్టులపై వాస్తవ పరిస్థితులను ప్రజలకు వివరించేందుకు శ్వేతపత్రం విడుదల చేశామని తెలిపారు. అప్పులను చూసి అధైర్యపడకుండా.. ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేస్తున్నామని చెప్పారు.

అన్ని పథకాలను తెచ్చింది కాంగ్రెస్సే..

రైతులకు హరిత విప్లవం, సాగునీరు, ఉచిత విద్యుత్, రాయితీతో ఎరువులు, పండిన పంటలకు సబ్సిడీ, ఆహార భద్రత చట్టం, పంటలకు మద్దతు ధర, ఉపాధి హామీ పథకం దాకా కాంగ్రెస్ పార్టీయే అమల్లోకి తెచ్చిందని సీఎం రేవంత్ చెప్పారు. రైతులు, రైతు కూలీలను దృష్టిలో పెట్టుకుని వాటికి చట్టబద్ధత కల్పించిందన్నారు. అయితే వీటివల్ల రైతుల జీవితాల్లో మార్పులు పూర్తిస్థాయిలో రాలేదని, గత పాలకుల నిర్లక్ష్యం, అకాల వర్షాలు, కరువు ఇందుకు కారణమని అన్నారు. అందుకే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే గత ప్రభుత్వం ఎగ్గొట్టిన 2023 వానాకాలం రైతుబంధు సాయాన్ని తాము అందజేశామని చెప్పారు. 2024 జనవరిలో ప్రారంభించి మార్చి వరకు రూ.7,625 కోట్లను మొదటి విడతగా అందించామన్నారు. ఆ తరువాత ఆగస్టు 15 వరకు రుణమాఫీ చేస్తామని రైతులకు మాట ఇచ్చామని, దాని ప్రకారం 25 రోజుల్లోనే రూ.2 లక్షల వరకు ఉన్న రుణాలను నాలుగు విడతల్లో కలిపి 25,35,964 మంది రైతు కుటుంబాలకు రూ.20,616.89 కోట్ల రుణమాఫీ చేశామని పేర్కొన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఏ రాష్ట్రంలోనూ ఎవరూ ఇప్పటివరకు ఇంత తక్కువ కాలంలో ఇంత పెద్దమొత్తంలో రుణమాఫీ చేయలేదని అన్నారు.

బీఆర్ఎస్‌కు అర్హత లేదు..

రికార్డు స్థాయిలో తాము రుణమాఫీ చేసినా.. బీఆర్ఎస్ నాయకులు పదే పదే ఆరోపణలు చేస్తున్నారని రేవంత్ మండిపడ్డారు. గతంలో బీఆర్ఎస్ ఏం చెప్పిందో ఓసారి గుర్తు చేసుకోవాలన్నారు. 2014లో రూ.లక్ష రుణమాఫీ హామీ ఇచ్చి.. నాలుగు విడతల్లో చేస్తామని చెప్పారని, వడ్డీ కూడా చెల్లిస్తామన్నారని గుర్తు చేశారు. మళ్లీ 2018లోనూ రూ.లక్ష రుణాన్ని ఒకేసారి మాఫీ చేస్తామని చెప్పి.. చేయలేదన్నారు. చివరకు 2023 ఎన్నికలు సమీపించే సమయానికి ఔటర్ రింగు రోడ్డును అమ్మి.. హడావిడిగా చేశారని, అది కూడా 21,35,557 మంది రైతులకు రూ.11,909.31 కోట్లను మాత్రమే మాఫీ చేశారని తెలిపారు. నాలుగున్నరేళ్ల తరువాత మాఫీ చేయడం ద్వారా రూ.లక్ష రుణం ఉన్నవారికి వడ్డీకే రూ.8,578.97 కోట్లు చెల్లించాల్సి వచ్చిందన్నారు. దీంతో వడ్డీలకు పోను రూ.3,331 కోట్లే అసలు కింద జమ అయిందన్నారు. కానీ, ఏడాది కూడా కాకముందే దాదాపు రూ.20,616 కోట్ల మేర రుణమాఫీ చేసిన తమను తప్పుబట్టాలని, రైతుల ముందు దోషిగా నిలబెట్టాలని ఉబలాటపడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు అన్నీ తెలుసునని, వారు అన్నింటినీ గమనిస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ సర్కారు హయాంలో పూర్తిస్థాయిలో మాఫీ చేయని రూ.లక్ష రుణాలు రైతులు రెన్యువల్ చేసుకున్న వేనని, ఈ విషయం తాము చేసిన రుణమాఫీలో తేలిందని తెలిపారు. అందుకే 2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 9 వరకు తీసుకున్న రుణాలను తాము చెల్లించామని చెప్పారు. రేషన్‌కార్డు లేకపోతే రుణమాఫీ జరగబోదనేది అవాస్తవమని, భూమి ఉండి, రుణం ఉండి అర్హులైన వారందరికీ మాఫీ అవుతుందని స్పష్టం చేశారు.

రైతులూ.. సన్నాలు సాగుచేయండి

గతంలో కేసీఆర్ ముఖ్యమంత్రి హోదాలో ఉండి.. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలేదని, వరి వేస్తే ఉరి వేసుకున్నట్టేనని మాట్లాడారని రేవంత్‌రెడ్డి విమర్శించారు. కానీ, తమ ప్రభుత్వం వస్తే ధాన్యం కొనుగోలు చేయడమే కాకుండా.. సన్నధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పామని గుర్తు చేశారు. ఆ మాట ప్రకారమే.. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 31 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించామని, బోనస్ కూడా చెల్లిస్తున్నామని తెలిపారు. వచ్చే సీజన్‌లోనూ బోనస్‌ను కొనసాగిస్తామన్నారు. బీపీటీ, హెచ్ఎంటీ, తెలంగాణ సోనా రకాలకు ఎక్కువ ఉత్పత్తి వస్తుందని వ్యవసాయ నిపుణులు సూచించారని, రైతులు ఈ వంగడాలనే సాగుచేస్తే ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు. వాస్తవానికి సన్నాల్లో 37 రకాలున్నాయని, ఆ విషయాన్ని ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లోనూ చెప్పామని అన్నారు. కానీ, మూడు రకాలనే తెలంగాణ ప్రజలు ఎక్కువగా తింటున్నారని తెలిపారు. రేషన్ షాపుల్లో, సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో సన్నబియ్యంతోనే భోజనం పెట్టాలనే ఆలోచన చేస్తున్నామని అన్నారు. సన్న వడ్లను ఎఫ్‌సీఐకి, ఇతర రాష్ట్రాలకు తరలించకుండా తెలంగాణలోని పేదలకే పంచాలనుకుంటున్నామని చెప్పారు. అందుకే తెలంగాణ రైతాంగం సన్నాలను పండించాలని విజ్ఞప్తి చేశారు.

కిషన్‌రెడ్డి.. గుజరాత్ గులామ్..

తెలంగాణ గురించి మాట్లాడడానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఏం అర్హత ఉందని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఆయన గుజరాత్ గులామ్ అని అన్నారు. 11 ఏళ్లలో మోదీ ఇచ్చిన హామీలు, 10 నెలల్లో కాంగ్రెస్ హామీలపై ప్రత్యేకంగా చర్చ పెట్టుకుందామని, ఆ విషయంలో తమకు ఎలాంటి ఇబ్బందిలేదని చెప్పారు. ఈ సమావేశంలో మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ పాల్గొన్నారు.

'రైతు భరోసా'పై ముందే చెప్పిన ఆంధ్రజ్యోతి

ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని సంక్రాంతి నుంచి అమలు చేయనుందని 'ఆంధ్రజ్యోతి' ముందే చెప్పింది. నవంబరు 28న రైతు భరోసా.. సంక్రాంతి నుంచి' శీర్షికన కథనాన్ని ప్రచురించింది.



ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణంపై సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయండి

హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గోషామహల్ స్టేడియంలో నిర్మించబోయే ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణంపై సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం సమీక్ష నిర్వహించారు. రహదారుల నిర్మాణం కోసం తక్షణమే సర్వే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఆస్పత్రికి కావాల్సిన మౌలిక సదుపాయాలు తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ కోసం సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. అన్ని శాఖలతో సమన్వయం కోసం నోడల్ అధికారిగా సీనియర్ ఐఏఎస్ అధికారి దానకిషోర్‌ను నియమించారు. సమీక్షలో పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్‌రెడ్డి, కలెక్టర్ అనుదీప్, సిటీ సీపీ సీవీ ఆనంద్ పాల్గొన్నారు.

నేడు ఆరోగ్య ఉత్సవాలు

28 పారా, 16 నర్సింగ్ కాలేజీలను వర్చువల్‌గా ప్రారంభించనున్న సీఎం

» సీఏఎస్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లకు నియామక పత్రాల అందజేత

» బండతిమ్మాపూర్‌లో కోకా కోలా గ్రీన్ ఫీల్డ్ ప్లాంట్‌కూ శ్రీకారం

హైదరాబాద్/నిజాంపేట/ములుగు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లో ఆరోగ్య ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా 28 పారామెడికల్ కాలేజీలు, 16 నర్సింగ్ కాలేజీలు, 32 ట్రాన్స్‌జెండర్ క్లినిక్‌లను సీఎం రేవంత్‌రెడ్డి వర్చువల్‌గా ప్రారంభిస్తారని వైద్యారోగ్య శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. అలాగే కొత్తగా 213 అంబులెన్స్ సర్వీసులను ప్రారంభించనున్నట్లు వెల్లడించింది. మెడికల్ బోర్డు ద్వారా ఇటీవల నియమితులైన 442 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్ల (సీఏఎస్)కు, 24 మంది ఫుడ్ ఇన్‌స్పెక్టర్లకు ముఖ్యమంత్రి నియామక పత్రాలను అందజేస్తారని పేర్కొంది. ఇటు.. హైదరాబాద్ బాచుపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 39వ వార్షికోత్సవానికి సీఎం హాజరై ప్రారంభించనున్నారు. అలాగే.. కోకా కోలా, థమ్స్ అప్ లాంటి శీతల పానీయాలను ఉత్పత్తి చేసే హిందుస్థాన్ బేవరేజెస్ సంస్థ నిర్మించిన భారీ బాట్లింగ్ యూనిట్‌ను సీఎం రేవంత్ ప్రారంభించనున్నారు. సిద్దిపేట జిల్లా బండ తిమ్మాపూర్‌లోని ఫుడ్ పార్కులో దాదాపు రూ.1,000కోట్లతో చేపట్టిన ఈ ప్లాంట్ నిర్మాణం ఇటీవలే పూర్తయింది. మరోవైపు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాలమల్లేశ్ మృతి పట్ల సీఎం దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో బాలమల్లేశ్ భౌతిక కాయానికి టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి నివాళులర్పించారు. కాగా, టీజీపీఎస్సీ చైర్మన్‌గా నియమితులైన బుర్రా వెంకటేశం.. సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

రూ.3,875 కోట్ల గోనె సంచులను మింగేశారు!

(మొదటిపేజీ తరువాయి)

వెల్లువెత్తుతున్నాయి. అందుకే ఏళ్ల తరబడి ఆడిట్ చేయకుండా, లెక్కలు తేల్చకుండా వదిలేస్తున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కానీ, దీనివల్ల కార్పొరేషన్‌కు రావాల్సిన ఆదాయం భారీగా స్తంభించిపోయింది. సాధారణంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని గోనె సంచుల్లో నింపి.. రైస్‌మిల్లులకు పంపిస్తుంటారు. ఒక్కో గోనె సంచి (తట్టు బస్తా)లో 40 కిలోల ధాన్యం నింపే అవకాశం ఉంటుంది. అంటే.. ఒక క్వింటాలు ధాన్యం నింపడానికి రెండున్నర బస్తాలు అవసరమవుతాయి. భారత ఆహార సంస్థ(ఎఫ్‌సీఐ) నిబంధనల ప్రకారం.. ఒక సీజన్‌లో అవసరమయ్యే గోనె సంచుల్లో 54 శాతం కొత్తవి వాడాలి. 46 శాతం పాత బస్తాలను (గతంలో వాడినవి) వాడాల్సి ఉంటుంది.

ఖాళీ సంచులను తిరిగి ఇవ్వాల్సి ఉన్నా..

ప్రతి సీజన్‌లో కొత్త గోనెసంచులను కేంద్రమే రాష్ట్రానికి పంపిస్తుంది. పాత సంచులను మాత్రం వ్యాపారుల నుంచి, రేషన్ డీలర్ల నుంచి పౌరసరఫరాల సంస్థ కొనుగోలు చేస్తుంది. వీటిలో ధాన్యం నింపి రైస్‌మిల్లులకు పంపిస్తుంది. ధాన్యం ఖాళీ చేసిన తర్వాత.. ఆ బస్తాలను రైస్‌మిల్లర్లు తిరిగి కార్పొరేషన్‌కు ఇవ్వాల్సి ఉంటుంది. ఏ పంటకాలంలో అప్పగించిన బస్తాలను ఆ సీజన్‌లోనే లెక్క చూసి.. తిరిగి అప్పగించాలి. ఒక రైస్‌మిల్లుకు ఎంత ధాన్యం కేటాయించారు? ఎన్ని బస్తాలు పంపించారు? అనే లెక్క కార్పొరేషన్ వద్ద పక్కాగా ఉంటుంది. కానీ, ఏళ్లు గడుస్తున్నా వీటిని తిరిగి తెప్పించుకునే లెక్క మాత్రం తేలడంలేదు. 2014 నుంచి 2024 వరకు పదేళ్ల (20 సీజన్ల) లెక్కలపై ఆడిట్ జరగడంలేదు. ఒక్కో సీజన్‌కు సంబంధించి కనీసం 12.50 కోట్ల గోనె సంచులు రైస్ మిల్లర్ల వద్ద ఉండి పోయాయి. అంటే ఏడాదికి 25 కోట్ల చొప్పున పదేళ్లలో 250 కోట్ల గోనె సంచులు మిల్లర్ల వద్దే ఉన్నాయి. అయితే.. ఈ బస్తాలు రైస్ మిల్లుల్లో ఉన్నాయా? అంటే అదీ లేదు. ఇటీవల పలుమార్లు మిల్లుల్లో తనిఖీలు నిర్వహించిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు... ఎక్కడా రైస్‌మిల్లుల్లో పాత బస్తాలు కనిపించలేదని చెబుతున్నారు. దీంతో ధాన్యంతోపాటు తట్టు బస్తాలను కూడా మిల్లర్లు అమ్ముకున్నట్లు తేటతెల్లమయింది. గడిచిన రెండు సీజన్లకు సంబంధించిన ధాన్యం, 35లక్షల టన్నుల టెండరు ధాన్యం కాకుండా.. 2022-23 వానాకాలం సీజన్ నాటికే 15 లక్షల టన్నుల ధాన్యాన్ని రైస్‌మిల్లర్లు అమ్ముకున్న విషయం తెలిసిందే. ఆ ధాన్యంతోపాటు తట్టు బస్తాలను కూడా అమ్ముకొని సొమ్ము చేసుకున్నట్లు కనిపిస్తోంది. పాత తట్టు బస్తాలు అప్పజెప్పటం కుదరదని, ఎంతో కొంత ధర నిర్ణయిస్తే... పౌరసరఫరాల సంస్థకు డబ్బులు చెల్లిస్తామని రైస్‌మిల్లర్లు అంటున్నారు. అయితే తమకు రావాల్సిన మిల్లింగ్ చార్జీలు కూడా చెల్లించాలని, అవి చెల్లిస్తేనే తట్టుబస్తాల పైసలు చెల్లిస్తామని మెలిక పెడుతున్నారు.

ఆ బస్తాల విలువ రూ. 3,875 కోట్లు!

పాత గోనె సంచులకు వారం రోజుల క్రితం ప్రభుత్వం ధర నిర్ణయించింది. ఒక్కో సంచికి రూ.15.50 ఖరారు చేసింది. అంటే రైస్‌మిల్లర్లు ఎన్ని బస్తాలు తీసుకున్నారో.. అన్ని బస్తాలకు ఒక్కోదానికి రూ.15.50 చొప్పున పౌర సరఫరాల సంస్థకు డబ్బులు చెల్లించాల్సి ఉంది. అంటే ఒక్కో సీజన్‌కు 12.50 కోట్లు, ఏడాదికి 25 కోట్ల చొప్పున.. పదేళ్లుగా పేరుకుపోయిన 250 కోట్ల గోనె సంచులకుగాను మొత్తం రూ.3,875 కోట్లు కార్పొరేషన్‌కు రావాల్సి ఉంది. కాగా.. ఏడాది క్రితం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి.. పౌరసరఫరాల సంస్థకు రూ.54 వేల కోట్ల అప్పు ఉంది. ఈ ఏడాదిలో మిల్లర్ల నుంచి రూ.9 వేల కోట్లు వసూలు కాగా ఇంకా రూ.45 వేల కోట్ల అప్పు ఉంది. ఇందులో గోనె సంచుల ద్వారా వాటిల్లిన నష్టం కూడా ఉంది. రైస్‌మిల్లర్లకు ఇటు ధాన్యం, అంటు ఖాళీ సంచులు అమ్ముకోవటం ద్వారా కాసుల పంట పండగా... కార్పొరేషన్ మాత్రం అప్పుల ఊబిలో కూరుకపోయి కోలుకోలేని దెబ్బతింది.

పాతబస్తాల ధర ఖరారులో గూడుపుఠాణీ


ఇటీవల జరిగిన పాతబస్తాల ధర ఖరారులో గూడుపుఠాణీ జరిగినట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. రైస్‌మిల్లర్ల సంఘాల ఒత్తిడికి పౌర సరఫరాలసంస్థ అధికారులు తలొగ్గి రూ.15.50 తక్కువ ధర ఖరారు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇది మిల్లర్లకు మేలు చేసేందుకేనన్న విమర్శలు ఉన్నాయి. ఉదాహరణకు.. 2021 వానాకాలం సీజన్‌లో 10 కోట్ల పాత గోనెసంచులు కొనుగోలు చేయటానికి ఆ ఏడాది అక్టోబరు 7న పౌరసరఫరాల సంస్థ టెండర్లు పిలిచింది. ఒక్కో పాత సంచికి రూ.30.25 చొప్పున ఒక కాంట్రాక్టు ఏజెన్సీతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. అంటే 10 కోట్ల పాత సంచులకు ఆ సీజన్‌లో రూ. 302.50 కోట్లు వెచ్చించారు. మూడేళ్ల క్రితమే ఒక్కో పాత సంచికి 30 రూపాయలకు పైగా వెచ్చించి ప్రైవేటు ట్రేడర్ల నుంచి కొనుగోలు చేయగా.. ఇప్పుడు మాత్రం ఒక్కో పాత సంచి ధర రూ.15గా నిర్ణయించారు. అంటే ప్రభుత్వం కొనుగోలు చేసిన ధరలో సగం ధరనే ఇప్పుడు నిర్ణయించారు. దీంతో పౌరసరఫరాల సంస్థకు నష్టం కలిగిస్తూ రైస్ మిల్లర్లకు లబ్ధి చేకూర్చే నిర్ణయం తీసుకున్నారన్నది స్పష్టమవుతోంది. తొలుత ఒక్కో పాత బస్తాకు రూ.27 చొప్పున రైస్‌మిల్లర్ల నుంచి వసూలు చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ పట్టుదలతో ఉన్నారు. ఆ తరువాత ఏం జరిగిందో ఏమో గానీ అనూహ్యంగా రూ.15.50కు తగ్గించారు. మూడేళ్ల కిందటి పాత ధర ప్రకారం ఒక్కో బస్తాకు రూ.30 చొప్పున వసూలు చేస్తే రూ.7,500 కోట్లు పౌరసరఫరాల సంస్థకు వచ్చేవి. కమిషనర్ తొలుత చెప్పినట్లు రూ.27 చొప్పున వసూలు చేసినా రూ. 6,750 కోట్ల ఆదాయం కార్పొరేషన్‌కు వచ్చేది. కానీ, చివరికి రూ.3,875 కోట్ల ఆదాయానికే పరిమితమయ్యారు. ఇది కూడా మిల్లర్లు సకాలంలో, సక్రమంగా వంద శాతం చెల్లిస్తేనే సాధ్యమవుతుంది.

హైకోర్టు పీపీ నాగేశ్వరరావుకు ఈశ్వరీబాయి స్మారక పురస్కారం

» రవీంద్రభారతిలో 106వ జయంతి ఉత్సవాలు

» మంత్రులు ఉత్తమ్, దుద్దిళ్ల, పొన్నం ప్రభాకర్, జూపల్లి హాజరు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): "సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా పోరాడిన ధీర ఈశ్వరీబాయి. పోరాట పటిమకు ప్రతీకగా నిలిచిన ఆమె కేవలం మహిళలకు మాత్రమే కాదు, యువతరానికీ ఆదర్శం" అని మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణా రావు కొనియాడారు. ఈశ్వరీబాయి 106వ జయంతి ఉత్సవాలను భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఆదివారం రవీంద్ర భారతిలో నిర్వహించారు. ఈశ్వరీబాయి స్మారక పురస్కారాన్ని తెలంగాణ హైకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావుకు మంత్రుల చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. ఈశ్వరీబాయి సేవలను భవిష్యత్తు తరాలు గుర్తుంచుకునేలా ఏదైనా కార్యక్రమాన్ని నిర్వహించే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తోందని, వీలైనంత త్వరలోనే దానిని ప్రకటిస్తామని చెప్పారు. సామాజిక రుగ్మతలను ఎదిరించి, కౌన్సిలర్ స్థాయి నుంచి శాసనసభ సభ్యురాలిగా ఎదిగిన సాహసి ఈశ్వరీబాయి అని మంత్రి శ్రీధర్‌బాబు అభివర్ణించారు. అదే స్ఫూర్తిని గీతారెడ్డి కొనసాగిస్తున్నారని ప్రశంసించారు. తల్లి ఆదర్శాలను పుణికిపుచ్చుకున్న గీతారెడ్డి చాలా సౌమ్యురాలని మంత్రి ఉత్తమ్ అన్నారు. తిరిగి రాజకీయాల్లో గీతారెడ్డి చురుకైన పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగిన ఈశ్వరీబాయి చిరస్మరణీయురాలని మంత్రి జూపల్లి కృష్ణారావు కొనియాడారు. ఉమ్మడి ఏపీలో కిరణ్ కుమార్‌రెడ్డి సీఎం అయిన సందర్భంలోనే డిప్యూటీ సీఎంగా గీతారెడ్డి ప్రమాణం చేయవలసిందని.. చివరి నిమిషంలో ఆ అవకాశం చేజారిపోయిందని పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ అన్నారు. నిజామాబాద్ జిల్లా ఎల్లారెడ్డిలో ఈశ్వరీబాయి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామని మాజీ మంత్రి గీతారెడ్డి తెలిపారు. ఆ విగ్రహావిష్కరణకు రేవంత్‌రెడ్డిని ఆహ్వానిస్తామని చెప్పారు.



నాగేశ్వరరావుకు ఈశ్వరీబాయి పురస్కారాన్ని అందిస్తున్న మంత్రులు ఉత్తమ్, పొన్నం, దుద్దిళ్ల, జూపల్లి, పీసీసీ చీఫ్ మహేశ్, మాజీ మంత్రి గీతారెడ్డి తదితరులు

చేతగాకపోతే విద్యాశాఖను బీఆర్ఎస్‌కు అప్పగించండి

» గురుకుల బాటలో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గురుకుల విద్యాలయాల్లో అనేక సమస్యలున్నాయని, ఈ ప్రభుత్వానికి చేతగాకపోతే విద్యాశాఖను బీఆర్ఎస్‌కు అప్పగిస్తే ప్రపంచంలోనే నెంబర్ వన్‌గా చేసి చూపుతామని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా ఆదివారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ శేరిగూడలో ఉన్న హయత్‌నగర్ ఎస్సీ బాలుర గురుకుల పాఠశాల/కళాశాల, వినోభానగర్‌లో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్సీ బాలుర పాఠశాల భవనం సరిగా లేదని, మరుగుదొడ్లు లేక పిల్లలు బహిర్భూమికి బయటికి వెళ్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా ప్రవీణ్‌కుమార్‌తో పాటు మరికొందరిపై హయత్‌నగర్ బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ ధనలక్ష్మి ఆదివారం ఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ అనుమతి లేకుండా విద్యాలయంలోకి ప్రవేశించడమేగాక ఉపాధ్యాయులను బెదిరించే విధంగా వ్యవహరించారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.


యాదగిరి కొండపై క్యూ కాంప్లెక్స్‌లో భక్తుల రద్దీ

భక్తజన సంద్రం యాదాద్రి

లక్ష్మీనృసింహుడిని దర్శించుకున్న 50 వేల మంది భక్తులు

భువనగిరి అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. కార్తీక మాసం చివరి రోజు, ఆదివారంకావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. కొండకింద లక్ష్మీపుష్కరిణి, సత్యదేవుడి వ్రత మండపాలు, కొండపైన ప్రధానాలయ ఉత్తర దిశ, శివాలయం వద్ద దీపారాధనల స్థలాల్లో మహిళా భక్తులు దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. కొండపైన గర్భాలయంలో పంచనారసింహులతోపాటు శివాలయంలో శ్రీ పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. గర్భాలయంలో స్వయంభువులకు అభిషేకం, అర్చనలు, ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణోత్సవ పర్వాలను అర్చకులు వైభవంగా చేపట్టారు. సుమారు 50 వేల మంది భక్తులు యాదగిరీశుడిని దర్శించుకున్నట్లు అంచనా. క్యూలైన్లల్లో భక్తులు బారులు తీరగా వీఐపీ దర్శనానికి గంట సమయం, ధర్మదర్శనానికి 2 గంటల సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. కాగా, వాహనాలకు పార్కింగ్ స్థలం సరిపడా లేకపోవడంతో పలువురు భక్తులు ఇబ్బందులు పడ్డారు. ఆలయ ఖజానాకు రూ. 56 లక్షల నిత్యాదాయం సమకూరిందని ఈవో భాస్కరరావు వెల్లడించారు.

అసలైన వారిని వదిలి.. బినామీలకు నోటీసులు!

- ఐఏఎస్ అమోయ్‌కుమార్ కేసు విచారణ తప్పుదోవ?
- భూముల బదిలీ కేసులో సీసీఎల్‌ఏకు ఫిర్యాదు

హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా మాజీ కలెక్టర్, సీనియర్ ఐఏఎస్ అధికారి అమోయ్ కుమార్‌పై విచారణ తప్పుదోవ పడుతోందా? ఆయనకు భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్‌ఏ) అధికారులు కొందరు సహకరిస్తున్నారా? అంటే తాజా పరిణామాలు అవుననే అనిపిస్తున్నాయి. భూముల బదిలీ కేసులో అసలైన వారికి కాకుండా బినామీలకు నోటీసులు జారీ చేశారన్న ఆరోపణలున్నాయి. ఆదిభట్లలోని సర్వే నంబరు 44లో 10ఎకరాల పట్టా భూములను అక్రమంగా గోపాల్ గౌడ్, మంజుల గౌడ్‌కు బదిలీ చేసిన విషయంలో అమోయ్ కుమార్ ప్రమేయంపై ఈడీ విచారణ చేపట్టింది. ఈ విషయంలో సీసీఎల్‌ఏ కూడా సమాంతర విచారణ జరుపుతోంది. ఈ పదెకరాలకు హక్కుదారులమైన తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, విచారణకు పిలవకుండా.. అధికారులు ఇతరులకు నోటీసులిచ్చారని, దీనిపై విచారణ జరపాలంటూ నీరుడి యాదయ్య తదితరులు సీసీఎల్‌ఏకు ఫిర్యాదు చేశారు. ఈ వివాదంలో సీసీఎల్‌ఏ నోటీసులు అందుకున్న వారు బినామీలని ఆదిభట్ల వాసులు ఆరోపిస్తున్నారు. కాగా, రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా ఉన్న సమయంలో రూ.100 కోట్ల విలువైన భూముల అక్రమ బదిలీకి సంబంధించిన కేసులో నెలన్నర క్రితం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు అమోయ్ కుమార్‌ను విచారించారు. ఈ కేసులో సీసీఎల్‌ఏ అధికారులూ విచారణ చేపట్టారు. విచారణను తప్పుదోవ పట్టించేలా సీసీఎల్‌ఏలోని కొందరు అధికారులు అమోయ్ కుమార్‌కు పరోక్షంగా సహకరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. దీనిపై సీసీఎల్‌ఏకు ఫిర్యాదు అందింది.

పంచాయతీ సిబ్బందికి క్రమం తప్పకుండా వేతనాలు

హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో పని చేసే సిబ్బందికి ప్రతినెలా క్రమం తప్పకుండా వేతనాలు చెల్లించేందుకు రాష్ట్రప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇందుకుగాను రాష్ట్రంలోని 12,867 గ్రామ పంచాయతీల పరిధిలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు, ఉపాధి హామీ పర్యవేక్షకులు, పారిశుధ్య కార్మికులు, ఇతర సిబ్బంది వివరాలను ఇ-పంచాయతీ వెబ్‌సైట్‌లో చేర్చాలని సంబంధిత విభాగాలను ఆదేశించింది. వారి బ్యాంకు ఖాతాలు, ఫోన్ నంబర్లు, ఇతర వివరాలను నమోదుచేయాలని పంచాయతీరాజ్‌శాఖ అధికారులు, మండల అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులను ఆదేశించింది. ఇ-పంచాయతీ వెబ్‌సైట్‌లో వివరాల నమోదు చేశాక ప్రతినెల 25న వారి హాజరును పంపాలని పేర్కొంది.

5న చలో బస్‌భవన్: ఆర్టీసీ జేఏసీ

హైదరాబాద్, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీన ప్రక్రియ పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 5న నిర్వహించ తలపెట్టిన చలో బస్‌భవన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్మికులకు ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న పిలుపునిచ్చారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలుచేయాలని నెల రోజులుగా వివిధ స్థాయిల్లో పోరాడుతున్నామని ఆయన చెప్పారు. కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంలో ప్రభుత్వం విఫలం కావడంతో ఆందోళనకు సిద్ధం కావలిసి వస్తోందన్నారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడానికి ప్రభుత్వం గెజిట్ జారీ చేసినా అపాయింటెడ్ డేట్ ప్రకటించడంలో జాప్యం చేస్తున్నారని వెంకన్న తెలిపారు. మహాలక్ష్మి పథకం వల్ల డ్రైవర్లు, కండక్టర్లపై విపరీతమైన పని ఒత్తిడి పెరిగిందన్నారు. 2021 వేతన సవరణ చేపట్టాలని, సంస్థలో ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరించాలని, ఉద్యోగులకు సంపూర్ణ ఉద్యోగ భద్రత కల్పించాలని వెంకన్న డిమాండ్ చేశారు.

శరవేగంగా డాక్టర్ల నియామకం

- 5 నెలల్లో 442 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీ
- ఎంపికైన డాక్టర్లకు నేడు నియామక పత్రాలు అందజేయనున్న సీఎం

హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆరోగ్యశాఖలో ఉద్యోగాల భర్తీ ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. గత 11 నెలల్లోనే ఏకంగా 7,332 పోస్టులను వైద్య, ఆరోగ్య సేవల నియామక బోర్డు భర్తీ చేసింది. తాజాగా మరో 442 పోస్టుల భర్తీ ప్రక్రియను ఐదు నెలల రికార్డు సమయంలో పూర్తి చేసినట్లు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రభుత్వ దవాఖానాల్లో ఖాళీగా ఉన్న 442 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులకు జూన్ 28న బోర్డు నోటిఫికేషన్ విడుదల చేసింది. దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, ధ్రువపత్రాల పరిశీలన తదితర ప్రక్రియలన్నింటినీ పూర్తి చేసి నవంబరు 23న ఈ పోస్టులకు సంబంధించిన ఎంపిక జాబితాను విడుదల చేసింది. ఉద్యోగాలకు ఎంపికైన డాక్టర్లకు సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి నియామక పత్రాలను అందించనున్నారు. ఇక కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉద్యోగాల భర్తీ ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది. ఏడాదికాలంలో ఆరోగ్యశాఖలోనే సుమారు 7,774 పోస్టులను భర్తీ చేశారు. మరో 2,322 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులు, 732 ఫార్మసిస్ట్(గ్రేడ్ 2), 1,284 ల్యాబ్ టెక్నీషియన్, 156 ఆయుష్ మెడికల్ ఆఫీసర్, 45 అసిస్టెంట్ ప్రొఫెసర్ (ఎంఎన్‌జే) పోస్టుల భర్తీ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. త్వరలోనే మరో 600కు పైగా అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వనున్నారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పు.. అశాస్త్రీయం!

ఆర్టికల్ 341కు, సహజ న్యాయసూత్రాలకు విరుద్ధం.. వర్గీకరణ పేరుతో మాలమాదిగల ఐక్యతను దెబ్బతీసే కుట్ర

- ఎస్సీలు హక్కులకై కలిసి పోరాడాలి
- మాలల సింహగర్జన సభలో వక్తలు
- సభతో జనసంద్రమైన పరేడ్‌గ్రౌండ్


సభలో అభివాదం చేస్తున్న ఎమ్మెల్యేలు వివేక్, వినోద్, కేఆర్ నాగరాజు, మేడిపల్లి సత్యం తదితరులు

సికింద్రాబాద్, రెజిమెంటల్ బజార్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆర్టికల్ 341కు, సహజ న్యాయసూత్రాలకు వ్యతిరేకంగా ఉందని, అది అశాస్త్రీయమైనదని.. దాని రద్దు కోసం మాలలు ఉద్యమించాలని మాల సామాజికవర్గ నేతలు పిలుపునిచ్చారు. ఎస్సీల హక్కుల కోసం మాల మాదిగలు కలిసి ఉద్యమించాలని, ఎస్సీ వర్గీకరణ పేరుతో మాల మాదిగల ఐక్యతను దెబ్బ తీసే కుట్రను సమర్థంగా ఎదుర్కోవాలని సూచించారు. ప్రధాని మోదీ పరేడ్‌గ్రౌండ్ వేదికగా ఎస్సీ వర్గీకరణ చేసి తీరుతామని ప్రకటించి దళితుల్లో ఉన్న ఐక్యతను దెబ్బతీశారని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణ రద్దు పోరాటం యావత్ దేశానికి సంబంధించిన సమస్యగా పేర్కొన్నారు. ఆదివారం పరేడ్ గ్రౌండ్‌లో మాలల సింహగర్జన సభ భారీ ఎత్తున జరిగింది. అన్నదమ్ముల్లా ఉన్న తమను (దళితులను) విడగొట్టవద్దంటూ వేలాది మంది మాలలు గర్జించారు. రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన మాలలతో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ జనసంద్రంగా మారింది. ఈ సభకు ఎమ్మెల్యేలు వివేక్ వెంకటస్వామి, వినోద్, నాగరాజు, మేడిపల్లి సత్యం, ఎంపీలు మల్లు రవి, గడ్డం వంశీ తదితరులు హాజరయ్యారు. వివేక్ వెంకటస్వామి ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రీమీలేయర్ పేరిట దేశంలో రిజర్వేషన్లను ఎత్తివేసే కుట్ర జరుగుతున్నదని తెలిపారు. భారతదేశంలో 3000 ఏళ్ల నుంచి కులవివక్ష ఉందని, ఈ కుల వ్యవస్థను చూసి, దళితులకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు రావాలని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ రాజ్యాంగం ద్వారా రిజర్వేషన్ సదుపాయం కల్పించారన్నారు. ప్రస్తుతం రిజర్వేషన్లను ఎత్తివేయడానికి కుట్ర జరుగుతున్నదని ఆరోపించారు. రాజకీయ పార్టీల్లో మాలల పట్ల చిన్న చూపు ఉన్నదని, తాజా సభ ఆ పార్టీలకు చెంపపెట్టు వంటిదన్నారు. మంత్రి పదవి కోసమే తాను మాలల పోరాటం చేస్తున్నానని కొందరు విమర్శిస్తున్నారని, అయితే.. తాను తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కొట్లాడిన వ్యక్తినని, పదవుల కోసం ఆరాటపడే వాడిని కానని తెలిపారు. మాలలను విభజించాలని చూస్తున్నారని, మాలలు ఐకమత్యంతో తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణపై దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు ఆర్టికల్ 341కు వ్యతిరేకంగా ఉందన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ తీర్పుపైనే మాలల పోరాటమని పేర్కొన్నారు. సమాజంలో కుల వ్యవస్థ ఇంకా మనల్ని వెంటాడడం దురదృష్టకరమన్నారు. ప్రైవేటు సెక్టార్‌లో కూడా రిజర్వేషన్లు అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. మాలలు, మాదిగల మధ్య విభేధాలు రాకుండా ఉండడానికి తాజా సభ నిర్వహించామే తప్ప, ఎవరికీ వ్యతిరేకంగా కాదని రవి స్పష్టం చేశారు. ఎస్సీల హక్కుల కోసం మాల, మాదిగలు కలిసి ఉద్యమం కొనసాగించాలని, ఎస్సీ వర్గీకరణ పేరుతో మాల మాదిగల ఐక్యతను దెబ్బ తీసే కుట్రను సమర్థంగా ఎదుర్కోవాలని సూచించారు.

సుప్రీం తీర్పు న్యాయసూత్రాలకు విరుద్ధం

డాక్టర్ గోపీనాథ్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అశాస్త్రీయమైనదన్నారు. ఎయిడ్స్ కంటే కూడా ప్రమాదకరమైన కుల వివక్షపై మాలలు పోరాటం చేశారని, సుప్రీంకోర్టు తీర్పు న్యాయసూత్రాలకు విరుద్ధంగా ఉందని, ఈ తీర్పును రద్దు చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని తేల్చి చెప్పారు. ఢిల్లీకి చెందిన బస్వర్ పాశ్వాన్ మాట్లాడుతూ.. పార్లమెంట్‌లో మాలల గురించి, ఎస్సీ వర్గీకరణ అంశంపై సమగ్ర చర్చ జరగాలని, మనం గర్జిస్తే ప్రధాని సీటు కదలాలని అన్నారు. ప్రధాని మోదీ పరేడ్‌గ్రౌండ్ వేదికగా ఎస్సీ వర్గీకరణ చేసి తీరుతామని ప్రకటించి దళితుల్లో ఉన్న ఐక్యతను దెబ్బతీశారని విమర్శించారు. ఈ పోరాటం తెలంగాణ, ఏపీకే పరిమితం కాదని, యావత్ దేశానికి సంబంధించిన సమస్యగా పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ రద్దు కోసం మాలలంతా కలిసి ఢిల్లీకి తరలిరావాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి డాక్టర్ శంకరరావు మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు తీర్పుతో 30లక్షల మంది మాలలు నష్టపోతున్నారన్నారు. ఎస్సీ వర్గీకరణను తాము అడ్డుకోవడం లేదని, అందరికీ సమన్యాయం జరగాలని పోరాడుతున్నామని తెలిపారు. ఎమ్మెల్యే వినోద్ మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు తీర్పును వ్యతిరేకించేందుకు పెద్ద సంఖ్యలో సమావేశానికి మాలలు రావడం సంతోషంగా ఉందని అన్నారు. మాలలను ఇబ్బంది పెడితే ఊరుకునేది లేదని విశ్లేషకులు దిగంబర్ హెచ్చరించారు. తాము 30 ఏళ్లు ఓపిక, సహనంతో ఉన్నామని, ఇక ఆగేది లేదన్నారు. ఎస్సీ వర్గీకరణ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మొదటగా చేపట్టి తర్వాత తెలంగాణలో చేయాలని సూచించారు. అగ్రకుల రాజకీయ పార్టీలకు బుద్ధి చెప్పాలని చెరుకు రాంచందర్ అన్నారు. దామాషా ప్రకారం రిజర్వేషన్ల కోసం రాబోయే రోజుల్లో పోరాటం చేయాలన్నారు.

నాయబ్ తహసీల్దార్లకు పదోన్నతులు కల్పించాలి

- ట్రెసా కార్యవర్గ సమావేశంలో తీర్మానం

శామీర్‌పేట, హైదరాబాద్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నాయబ్ తహసీల్దార్లకు పదోన్నతులు కల్పించాలని, ఎన్నికల సందర్భంగా బదిలీ చేసిన రెవెన్యూ అధికారులను తిరిగి బదిలీ చేయాలని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్(ట్రెసా) తీర్మానించింది. ఆదివారం మూసారాంబాగ్‌లోని రెవెన్యూ భవన్‌లో ట్రెసా రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్ రెడ్డి ఆధ్యక్షతన ట్రెసా రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా.. సోషల్ మీడియా వేదికగా ట్రెసా సంఘంపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని గట్టిగా ఎదుర్కోవాలని కార్యవర్గ సభ్యులంతా తీర్మానించారు. వంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వానికి సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ పోస్టుల అప్‌గ్రేడేషన్ ప్రతిపాదనలు సమర్పించామని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక రెవెన్యూ మంత్రి సెలక్షన్ గ్రేడ్ పోస్టుల మంజూరుకై హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలకు ట్రెసా ఆమోదం తెలిపింది. నాయబ్ తహసీల్దార్ పదోన్నతి పొందిన వారికి సొంత జిల్లాలోనే పోస్టింగ్ ఇవ్వాలని, లగచర్ల, దిలావర్‌పూర్‌లలో రెవెన్యూ ఉద్యోగులపై జరిగిన దాడులు దృష్ట్యా రెవెన్యూ ఉద్యోగులకు రక్షణకై ఒక ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలని, కొత్తగా ఏర్పడిన మండలాలకు కేడర్ స్ట్రెంత్ మంజూరు చేయాలని తీర్మానాలు చేశారు.

త్వరలోనే వీఆర్వోలకు శుభవార్త: లచ్చిరెడ్డి

అతి త్వరలోనే ప్రభుత్వ అనుమతితో పూర్వ వీఆర్వోలకు శుభవార్త అందిస్తామని తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్ మేడ్చల్ జిల్లా షామీర్‌పేట్ మండలం తూంకుంట గ్రామంలో తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు గరిక ఉపేందర్ అధ్యక్షతన పూర్వ వీఆర్వోల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. దీనికి లచ్చిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం తీసుకున్న అశాస్త్రీయమైన నిర్ణయాల కారణంగా రెవెన్యూ ఉద్యోగులు బలయ్యారని ధ్వజమెత్తారు. రాబోతున్న రెవెన్యూ చట్టానికి పూర్వ వీఆర్వోలు అత్యంత అవసరమని పేర్కొన్నారు. పూర్వ వీఆర్వోలను తిరిగి విధుల్లోకి తీసుకోవడానికి సీఎం రేవంత్‌రెడ్డి సుముఖంగా ఉన్నారన్నారు. త్వరలోనే ప్రభుత్వం నుండి శుభవార్త వస్తుందని, ఆందోళన చెందవద్దని చెప్పారు. పూర్వ వీఆర్వోలను కలుపుకొని అతిపెద్ద అసోసియేషన్‌ను ఏర్పాటు చేస్తామని, దానికి తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అని నామకరణం చేస్తామని లచ్చిరెడ్డి ప్రకటించారు.

మహిళల్లోనూ పెరుగుతున్న బట్టతల

- తొలి దశలో గుర్తిస్తే నివారణ సాధ్యమే
- ఐఏ డీవీఎల్ సదస్సులో వక్తల వెల్లడి

గుంటూరు మెడికల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బట్టతల అనగానే మొదట పురుషులే గుర్తొస్తారు. మహిళల్లో ఇది చాలా అరుదు. అయితే ఒత్తిళ్లతో కూడిన జీవనశైలిలో యువతులు, మహిళల్లోనూ బట్టతల సమస్య పెరుగుతున్నట్లు ముంబైకి చెందిన హెయిర్ స్పెషలిస్ట్ డాక్టర్ రచితా దురత్ తెలిపారు. ఏపీలోని గుంటూరులో జరుగుతున్న ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ డెర్మటాలజీ, వెనిరియాలజీ, లెప్రాలజీ (ఐఏ డీవీఎల్) ఆంధ్రప్రదేశ్ శాఖ 43వ వార్షిక వైద్య సదస్సులో భాగంగా ఆదివారం జరిగిన 'ఏపీ క్యుటికాన్ 2024'లో ఆమె పాల్గొన్నారు. 'బట్టతల సమస్య పరిష్కారానికి ఆధునిక చికిత్సలు.. వాటి సామర్థ్యం' అనే అంశంపై డాక్టర్ రచితా మాట్లాడుతూ.. పురుషులతో పోలిస్తే మహిళలకు జుత్తు రాలడం వంటి సమస్య తీవ్ర ఆందోళన కగిలిస్తుందన్నారు. తీవ్రమైన మానసిక ఒత్తిళ్లు, పౌష్టికాహార లోపం, జన్యుపరమైన కారణాలతో మహిళల్లోనూ ఫీమేల్ ప్యాటర్న్ బాల్డ్‌హెడ్ (బట్టతల) సమస్య ఏర్పడుతుందని తెలిపారు. టైట్‌గా లాగి జడ వేసుకోవడం వల్ల ట్రాక్షన్ ఎలపేషియా అనే సమస్యతో తల ముందు భాగంలో జుత్తు రాలిపోయే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. మహిళల్లో బట్టతల సమస్యను తొలి దశలో గుర్తిస్తే కొంత వరకు నివారించ వచ్చని చెప్పారు. గతంలో ట్రాపికల్ స్టెరాయిడ్స్ మందులు దీనికి వాడేవారని, మినాక్సిడిల్ ఔషధం తక్కువ మోతాదులో ఇవ్వడం ద్వారా బట్టతల, జుత్తు ఊడటం వంటి సమస్యలను నియంత్రించే అవకాశం ఉందని ఆమె వివరించారు. సోరియాసిస్ రోగుల్లో కీళ్ల నొప్పులు (సోరియాటిక్ ఆర్థరైటిస్) బారిన పడే అవకాశం ఉందో లేదో కొన్నేళ్ల ముందుగానే తెలుసుకొనేందుకు స్పెషల్ అల్ట్రా సౌండ్ పరీక్ష అందుబాటులోకి వచ్చిందని సీనియర్ డెర్మటాలజిస్ట్ డాక్టర్ కేపీ సీతారామ్ తెలిపారు.

అనారోగ్యంతో అప్పులపాలు కావొద్దు

- అదే మా ప్రభుత్వ లక్ష్యం
- సర్కారీ వైద్యంపై నమ్మకం పెంచాం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సర్కారీ వైద్యంపై ప్రతి ఒక్కరికీ నమ్మకం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చెప్పారు. అనారోగ్యం బారిన పడిన ప్రజలు అప్పులపాలు కావొద్దన్నదే తమ ఉద్దేశమని తెలిపారు. సబ్ సెంటర్ల నుంచి బోధనాస్పత్రుల వరకు అన్నింటినీ బలోపేతం చేస్తామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్న సందర్భంగా మంత్రి 'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఏడాది కాలంలో వైద్య ఆరోగ్య శాఖలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చామన్నారు. ఆరోగ్యశ్రీ చికిత్స పరిమితి పెంచడంతో పాటు వైద్యులు, నర్సుల సంఖ్యను భారీగా పెంచామని చెప్పారు. సర్కారీ దవాఖానాల్లో యుద్ధ ప్రాతిపదికన నియామక ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో నమ్మకం పెంచామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఏడాది కాలంలో అన్ని వైద్య కళాశాలల్లో ఓపీ, ఐపీ పదిరెట్లు పెరగడమే దీనికి నిదర్శనమని చెప్పారు.

ఏడాదిలో ఎటువంటి విజయాలు సాధించారు?

ప్రజలు అనారోగ్యం వల్ల అప్పులు పాలు కావొద్దన్నదే మా ప్రభుత్వ లక్ష్యం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్య చికిత్స పరిమితిని రూ.10 లక్షలకు పెంచాం. కొత్తగా 163 చికిత్సలను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తెచ్చాం. ఈ పథకం కింద ప్రతి నెలా సగటున రూ.76 కోట్లు ఖర్చు చేస్తున్నాం. వైద్యశాఖలో 7774 ఉద్యోగాలను ఏడాదిలోపే భర్తీ చేశాం. మరో 6470 పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది. గత ప్రభుత్వం జీవోలు ఇచ్చి చేతులు దులుపుకోగా, మేం వచ్చాక 8 మెడికల్ కాలేజీలను అందుబాటులోకి తెచ్చాం. అదనంగా 400 ఎంబీబీఎస్ సీట్లు మన పిల్లలకు వచ్చాయి. కొడంగల్‌లో కొత్త మెడికల్ కాలేజీని ఏర్పాటు చేయబోతున్నాం. అలాగే ఏడాది లోపే 16 నర్సింగ్ కాలేజీలను అందుబాటులోకి తెచ్చాం. 28 పారామెడికల్ కాలేజీలను ప్రారంభించుకుంటున్నాం. గోషామహల్‌లో ఉస్మానియా కొత్త భవనాన్ని 32 ఎకరాల్లో రూ.2 వేల కోట్లతో నిర్మించబోతున్నాం. త్వరలో సీఎం చేతుల మీదుగా శంకుస్థాపన చేస్తాం. కిడ్నీ విఫలమైన రోగుల కోసం మరో 18 డయాలసిస్ సెంటర్లతో పాటు కొత్తగా 7 వాస్క్యులర్ కేంద్రాలను మంజూరు చేశాం.

కొత్త పథకాలు తీసుకురాబోతున్నారా?

ఉన్నవి పకడ్బందీగా అమలు చేస్తాం. రాష్ట్రంలో క్యాన్సర్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి జిల్లాలో స్క్రీనింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని యోచిస్తున్నాం. మొబైల్ స్క్రీనింగ్ కేంద్రాలను తీసుకురావాలనుకుంటున్నాం. జనాభా సంఖ్య ఆధారంగా అన్ని జిల్లాల్లో కొత్తగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్‌సెంటర్లు, ఏరియా ఆస్పత్రులతో పాటు బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేయబోతున్నాం. గర్భిణులకు ఇచ్చే ఎంసీహెచ్ కిట్‌లో మార్పులు తీసుకొస్తున్నాం.

ఈహెచ్ఎస్ అమలు కావడం లేదంటున్నారు?

ఉద్యోగులు పదేళ్లుగా ఇబ్బంది పడుతున్నారు. ఆ విషయం మా దృష్టిలో ఉంది. ఈహెచ్ఎస్‌ను వారు కోరుకున్నట్లుగా అమలు చేస్తాం. భవిష్యత్‌లో ఇబ్బందులు రాకుండా, కొత్త వ్యవస్థను రూపొందిస్తాం.

వైద్యవిద్య కళాశాలల్లో అధ్యాపకుల కొరత తీవ్రంగా ఉంది కదా?

కేవలం కాగితాలపై జీవోలిచ్చి అద్దె భవనాలు ఏర్పాటు చేస్తే ఆస్పత్రులు, కాలేజీలు ఏర్పాటు చేసినట్లు కాదు. ప్రజలకు వైద్యం అందాలంటే వైద్యులు, నర్సులు, ఇతర అన్ని రకాల సిబ్బంది కావాలి. మేం అధికారంలోకి వచ్చే నాటికి మానవ వనరుల కొరత ఉన్నది వాస్తవం. ఈ ఏడాది కాలంలో పోస్టుల భర్తీ ప్రక్రియను వేగిరం చేశాం. 6 నెలల్లో నియామక ప్రక్రియ అంతా పూర్తవుతుంది. త్వరలో 600కు పైగా అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయబోతున్నాం. తాత్కాలికంగా బోధనాస్పత్రుల్లో కాంట్రాక్టు పద్ధతిలో అధ్యాపకులను నియమించాం. సాధారణ బదిలీల తర్వాత కొందరు తప్పుడు ప్రచారం చేసి, లబ్ధి పొందే యత్నం చేస్తున్నారు. అలాంటి వాటిని పట్టించుకోం.

తెలంగాణ వైద్యవిధాన పరిషత్‌ను సెకండరీ కేర్ హెల్త్ డైరెక్టరేట్‌గా మార్చే ఆలోచన ఉందా?

ఉంది. దానిపై కసరత్తు చేస్తున్నాం. భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తకుండా బలమైన వ్యవస్థ ఉండేలా అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ నిపుణులతో అధ్యయనం చేయించాం. వారి ప్రతిపాదనలపై సమీక్ష చేశాం. సీఎంతో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటాం.

సర్కారీ దవాఖానాల్లో మందుల్లేవనే వార్తలు తరచూ వస్తున్నాయి?

ఆ ప్రచారం అవాస్తవం. రోగులకు అవసరమైన అన్ని ఔషధాలను ఆస్పత్రులకు అందజేస్తున్నాం. ఇండెంట్ దగ్గర్నించి రోగులకు చేరే వరకు ఆన్‌లైన్‌లో అన్ని వివరాలూ నమోదయ్యేలా చూస్తున్నాం.

నిఖేశ్‌కు 13 రోజుల రిమాండ్

- చంచల్‌గూడ జైలుకు తరలింపు
- రూ.200 కోట్లు దాటిన అవినీతి చిట్టా
- కస్టడీ పిటిషన్ దాఖలు చేయనున్న ఏసీబీ
- అంటకాగిన అధికారుల పైనా విచారణ
- సిద్దాపూర్‌లో విల్లాలు కొనుగోలు చేసిన ఆరుగురు అధికారుల ఆదాయంపై నజర్

హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అవినీతి కేసులో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడి, ఆపై ఆదాయానికి మించిన కేసులో అరెస్టయిన ఇరిగేషన్ శాఖ ఏఈఈ హేరూర్ నిఖేశ్‌కుమార్‌కు ఏసీబీ కోర్టు న్యాయమూర్తి ఈనెల 13వరకు జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. శనివారం సాయంత్రం నిఖేశ్‌ను అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు.. ఆయనను ఏసీబీ కోర్టు న్యాయమూర్తి నివాసంలో ఆదివారం ఉదయం హాజరుపరిచారు. దీంతో నిఖేశ్‌ను రెండు వారాలు కస్టడీకి తరలించాలని న్యాయమూర్తి ఆదేశించారు. ఆపై నిఖేశ్‌ను చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఏసీబీ అధికారులు శనివారం ఉదయం నుంచి నిఖేశ్‌కుమార్ ఇల్లు, అతని బంధువులు, మిత్రులకు సంబంధించిన 19చోట్ల సోదాలు నిర్వహించి ఆదాయానికివిుంచిన పలు ఆస్తులు ఉన్నట్లు గుర్తించడం తెలిసిందే. వీటి మొత్తం మార్కెట్ విలువ రూ.200కోట్లకు పైనే ఉంటుందని భావిస్తున్నారు. వీటిలో రెండు వ్యాపార సముదాయాల నుంచి ప్రతినెలా రూ.లక్షల్లో అద్దెలు వస్తున్నట్లు అధికారులు గుర్తించారు. తన అవినీతి దందా బయటపడకుండా నిఖేశ్ తన ఆస్తులను చిన్ననాటి స్నేహితులు, బంధువుల పేరిట రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు ఇప్పటికే గుర్తించారు. చెరువులు, కుంటలు, జలాశయాల ప్రాంతాల్లో ఇంటి నిర్మాణాలు, వాణిజ్య కార్యక్రమాలకు ఇరిగేషన్ శాఖ ఇచ్చే ఎన్‌వోసీ జారీనే నిఖేశ్ తన ఆదాయమార్గంగా మలుచుకున్నాడు. ఇరిగేషన్ విభాగంలో.. అందునా గండిపేట ప్రాంతంలో పనిచేయడంతో నాటి ప్రభుత్వంలోని పెద్దలు చెప్పినవారి ఫైళ్లు క్లియర్ చేస్తూ మిగతా అధికారులకు వాటాలు ఇస్తూ నిఖేశ్ చక్రం తిప్పినట్లు ఏసీబీ అధికారుల విచారణలో వెల్లడైంది. దీంతో నిఖేశ్‌తో అంటకాగిన అధికారులపైనా ఏసీబీ దృష్టి పెట్టిం ది. గత నాలుగైదేళ్లలో గండిపేట పరిసర ప్రాంతాల్లో ఎందరికి ఎన్‌వోసీలు జారీ అయ్యాయనే విషయాలను ఏసీబీ అధికారులు పరిశీలిస్తున్నారు. నిఖేశ్‌తో కలిసి కొల్లూరు సమీపంలోని సిద్దాపూర్‌లో ఒకే వెంచర్‌లో విల్లాలుకొన్న ఆరుగురు అధికారుల ఆదాయం పైనా ఏసీబీ విచారణ ప్రారంభించినట్లు సమాచారం.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: N. Rahul Kumar. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.